సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 10

మంగళవారం 2-4-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



లాభాల స్వాగతం

ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాలు నమోదు చేసిన సూచీలు -13లో



ముంబై 'మూడు'పోయింది!


ఐపీఎల్‌లో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడిన హార్దిక్ పాండ్యా బృందం -12లో



తిహార్ జైలుకు కేజ్రీవాల్

ఢిల్లీ మద్యం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈనెల 15దాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

- వివరాలు 6లో



కఠినచర్యలు తీసుకోబోం

ఎన్నికల వేళ ఐటీ శాఖ వేల కోట్ల నోటీసులతో ఇబ్బందులకు గురిచేస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది.

- వివరాలు 6లో



ఈశాన్యం ఎవరి వశం!

సెవెన్ సిస్టర్స్‌గా పేరొందిన ఈశాన్య రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తక్కువగానే ఉన్నప్పటికీ, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

- వివరాలు 6లో



బంగ్లాలో 'బాయ్‌కాట్ ఇండియా'

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా 4వసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టాక సామాజిక మాధ్యమాల్లో భారత వ్యతిరేక ప్రచారం ఊపందుకుంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

బంగారం మెరుపులు..



బంగారం ధర పరుగులు పెడుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర సోమవారం ఒక్కరోజే రూ.1,070 ఎగసి, రూ.68,420కి ఎగసింది. ఇక వెండి కూడా కేజీకి రూ.1,120 ఎగసి రూ.78,570కి చేరింది.

- వివరాలు 13లో

వచ్చే 3 రోజులు ఎండల మంటలే!



రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సోమవారం తెలంగాణవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.5 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికమవడంతో వాతావరణంలో తేమ శాతం, ఉక్కపోత తీవ్రమైనట్లు అధికారులు వివరించారు.

- వివరాలు 14లో

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా



మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా పడింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కౌంటింగ్ చేపట్టొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. జూన్ రెండో తేదీన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఐదో తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

- వివరాలు 2లో

అది 'కారు'చిచ్చే!

ట్యాపింగ్ కేసులో రిమాండ్ రిపోర్టు

బీఆర్‌ఎస్ నాయకత్వం సూచనలతోనే ట్యాపింగ్

- రాధాకిషన్‌రావు విచారణలో చెప్పారని రిమాండ్ రిపోర్టులో కోర్టుకు తెలిపిన సిట్
- అప్పటి ప్రతిపక్షాలే టార్గెట్‌గా ఎస్ఐబీలో ప్రత్యేక టీమ్... కీలకంగా వ్యవహరించిన టి.ప్రభాకర్‌రావు
- ప్రతిపక్షాల నగదు రవాణాపై ప్రత్యేకంగా ఫోకస్... నేతలతోపాటు అనుచరులు టార్గెట్‌గా అక్రమ నిఘా
- ట్యాపింగ్‌లో గుర్తించిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్‌తో దాడులు చేయించి సొమ్ము స్వాధీనం
- కొందరు బీఆర్‌ఎస్ పార్టీ నేతలపైనా నిఘా కొనసాగిందని వెల్లడి
- మరిన్ని వివరాలు రాబట్టేందుకు రాధాకిషన్‌రావును కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి



రాధాకిషన్‌రావు



టి.ప్రభాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ పేరు కూడా తెరపైకి వచ్చింది. ఇటీవల అరెస్టైన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు దీనితోపాటు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. రిపోర్టులోని వివరాల మేరకు..

''రాష్ట్ర అవతరణ తర్వాత బీఆర్‌ఎస్ నాయకత్వం కుల సమీకరణాల్లో భాగంగానే డీఐజీ హోదాలో ఉన్న టి.ప్రభాకర్‌రావును 2016లో ఎస్ఐబీ చీఫ్‌గా నియమించింది. తమ కులంతోపాటు ఇతర కులాలకు చెందిన నమ్మకస్తులైన అధికారులను నేతలు ఎంపిక చేసుకున్నారు. వివిధ విభాగాలు, జిల్లాల్లో పనిచేస్తున్న వీరందరినీ ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ విభాగంలోకి డిప్యూటేషన్‌పై తెచ్చుకున్నారు. అందులో నల్లగొండ నుంచి ప్రణీత్‌రావు, రాచకొండ నుంచి భుజంగరావు, సైబరాబాద్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి తిరుపతన్న ఉన్నారు. ప్రభాకర్‌రావు సూచనల మేరకే 2017లో రాధాకిషన్‌రావును బీఆర్‌ఎస్ నాయకత్వం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించింది. దీని వెనుక రాజకీయ, ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ప్రభాకర్‌రావు, రాధాకిషన్ రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు తరచుగా కలుస్తూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కొనసాగడం కోసం చేయాల్సిన పనులపై చర్చించేవారు.

గుట్టుగా సంప్రదింపులు..: హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో వెస్ట్‌జోన్‌కు 2021 వరకు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన గట్టుమల్లును రాధాకిషన్‌రావు సూచనల మేరకు ప్రభాకర్‌రావు ఎస్ఐబీలోకి తీసుకున్నారు. తమ లక్ష్యాలను చేరుకోవడానికి చేసే కుట్రలను అమలు చేయడానికి గట్టుమల్లును వినియోగించుకున్నారు. ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్‌ల్లోని మానవ వనరులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి.. వీరి అక్రమాలు ఎవరికీ మిగతా 5వ పేజీలో ▶

ప్రతిపక్షాలతోపాటు విమర్శించే వారిపైనా..

ప్రతిపక్షాలపై నిఘా ఉంచడం, అడ్డుకోవడం ద్వారా 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపించడమే తమ లక్ష్యమంటూ ప్రభాకర్‌రావు తన బృందమైన రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు, వేణుగోపాల్‌రావు, తిరుపతన్నలకు స్పష్టంచేశారు. ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబీకులు, సంబంధీకులు, మద్దతిచ్చే వ్యాపారులతోపాటు బీఆర్‌ఎస్‌ను విమర్శించే వారిపైనా ప్రభాకర్‌రావు బృందం నిఘా ఉంచింది. బీఆర్‌ఎస్ నాయకత్వం ఆదేశాల మేరకు.. ఆ పార్టీ నాయకులు కొందరిపైనా నిఘా వేశారు. రాధాకిషన్‌రావు 2020 ఆగస్టులోనే పదవీ విరమణ చేసినా.. కుల ప్రాతిపదికన ఆయనకు ఓఎస్డీగా రెండుసార్లు అవకాశమిచ్చారు. హైదరాబాద్ నగరంపై పట్టు కొనసాగడానికే ఇలా చేశారు.

కరువు మొదలైందే.. బీఆర్‌ఎస్ పాలనలో..

కేసీఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ ఫైర్

రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లన్నింటికీ కేసీఆరే కారణం

3 నెలల్లోనే బీఆర్‌ఎస్ కుప్పకూలింది.. ఆ భయంతోనే ఇష్టమొచ్చినట్లు విమర్శలు

పదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తి ఇంతగా దిగజారాలా అని వ్యాఖ్య



ఢిల్లీలో మీడియా సమావేశంలో భట్టి



హైదరాబాద్‌లో మాట్లాడుతున్న ఉత్తమ్

నల్లగొండ జిల్లా పర్యటనలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు, కట్టుకథలు అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం వేర్వేరు చోట్ల మీడియాతో మాట్లాడిన వీరిద్దరూ.. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రంలో కరువు మొదలైందని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ మిగలదని కేసీఆర్‌లో భయం మొదలైందని, అది తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. చివరికి ప్రెస్‌మీట్‌లో జనరేటర్ ఆగిపోతే విద్యుత్ కోతలంటూ మాట్లాడారని తప్పుపట్టారు. రాష్ట్రంలో 200 మంది రైతుల ఆత్మహత్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అయితే ఈ వంద రోజుల్లో 200 మంది బీఆర్‌ఎస్ నేతలు వెళ్లిపోయింది వాస్తవమన్నారు. దేశంలో వంద రోజుల్లో ఇంత పతనమైన పార్టీ బీఆర్‌ఎస్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. -10లో

కడియం కావ్యకే వరంగల్ టికెట్

అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ 5లో



కదిరిలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం

మేమంతా మీ వెంటే.. 10లో

బీఆర్‌ఎస్



- రైతుల సమస్యలే ప్రధాన అస్త్రం
- రైతు సంక్షేమం లక్ష్యంగా బీఆర్‌ఎస్ అమలు చేసిన పథకాల ప్రస్తావన
- పంట పొలాల సందర్శనతో ఇప్పటికే ప్రజల్లోకి కేసీఆర్... 5న కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటనకు ఏర్పాట్లు
- 13న చేవెళ్ల సభతో ప్రచారం షురూ

రైతు ఎజెండాతో జనంలోకి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వంపై భారత్ రాష్ట్ర సమితి దృష్టి సారించింది. 'రైతు ఎజెండా'తో బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతోంది. దీనిపై ముమ్మర కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, గతంలో తాము రైతు సంక్షేమం లక్ష్యంగా అమలు చేసిన పథకాలను గట్టిగా ప్రస్తావించాలని భావిస్తోంది. వచ్చే రెండు నెలల పాటు రైతాంగం వరి కోతలు, ధాన్యం అమ్మకాల్లో నిమగ్నం కానుండటంతో ప్రచారంలో ఇవే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయంటూ బీఆర్‌ఎస్ అధినేత ఇప్పటికే సమర శంఖం పూరించారు. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించిన కేసీఆర్ ఈ నెల 5న కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు రూట్ మ్యాప్ తయారవుతోంది. కాళేశ్వరం జలాలు, విద్యుత్ కోతలు, మిగతా 10వ పేజీలో ▶

నీ పక్కనే డేంజర్‌గాళ్లు

రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ 2లో

లీకు వార్తలు.. ఫేక్ ప్రచారాలు

కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ ధ్వజం 2లో

బీజేపీ



- అసెంబ్లీ ఎన్నికల వేళ జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదు..
- అప్పట్లో మొక్కుబడిగా పోలింగ్ బూత్ కమిటీల నిర్వహణ... ఈసారి పార్టీ ఆఫీసు నుంచే కాల్‌సెంటర్ ద్వారా పర్యవేక్షణ... ఒక్కోబూత్‌కు సంబంధించి సీనియర్ నేతకు సమన్వయ బాధ్యతలు

ఈసారి ఆ తప్పులు చేయొద్దు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గతేడాది చివర్లో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా పార్టీపరంగా చోటు చేసుకున్న లోపాలు, లోటుపాట్లు ఇప్పుడు జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాకుండా కమలదళం జాగ్రత్తలు తీసుకుంటోంది. లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అయ్యేందుకు పకడ్బందీగా కార్యాచరణ అమలుకు చర్యలు చేపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక నిర్వహించిన సమీక్షల్లో పార్టీనాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయలోపం అనేది ఓటమికి ప్రధాన కారణమని ముఖ్యనేతలు తేల్చారు. మరీ ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు ముందు హడావుడిగా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసుకున్న పోలింగ్ బూత్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందనే విషయం కూడా నాయకత్వం దృష్టికి వచ్చింది.

అప్పుడు జరిగిన తప్పులేవంటే..

అప్పట్లో మొక్కుబడిగా పోలింగ్‌బూత్ కమిటీలు ఏర్పాటుకావడంతో వాటి నిర్వహణ సరిగా జరగలేదనేది స్పష్టమైంది. అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంగా.. అందులోని మిగతా 10వ పేజీలో ▶

5న సత్యాగ్రహం: బీజేపీ

రైతాంగానికి రుణమాఫీ హామీ అమలుపై నిలదీయాలని నిర్ణయం 2లో

ఇదండీ సంగతి



పరారీలో మాండ్ర శివానందరెడ్డి

- పోలీసుల్ని ఏమార్చి పరారైన టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి
- అసైన్డ్ భూముల గోల్‌మాల్ వ్యవహారంలో ఆయనపై కేసులు
- అల్లూరులో అరెస్ట్ చేసేందుకు హైదరాబాద్ పోలీసుల యత్నం
- నోటీసులివ్వాలని డిమాండ్ చేసిన ఈ మాజీ పోలీసు అధికారి
- అధికారులు ఆ పనిలో ఉండగా కారులో ఉడాయింపు
- పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల్ని అడ్డుకున్న అనుచరులు



సాక్షి, హైదరాబాద్/సాక్షి, నంద్యాల: టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిని ఓ భూ వివాదం కేసులో అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించారు. ఆయన వారి కళ్లుగప్పి పరారయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన భార్యను, కుమారుడిని హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసైన్డ్ భూముల కొనుగోలు పంచాయితీకి సంబంధించి భాగస్వాముల వివాదాలతో హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్)లో కేసులు నమోదయ్యాయి. వీటిని దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో మాజీ పోలీసు అధికారి అయిన శివానందరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములు కొనుగోలు చేయడం, వాటిలో నిర్మాణాల పేరుతో ప్రీలాంచ్ ఆఫర్లు ఇచ్చి అడ్వాన్సులు వసూలు చేయడం వంటి పలు మిగతా 5వ పేజీలో ▶

మరో రూ.1,000 కోట్లు అప్పు

- నేడు సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా సమకూర్చుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం
- మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల రుణాలను తీసుకునే యోచన
- దాదాపు రూ.50 వేల కోట్లకు చేరిన గత ఆర్థిక సంవత్సరం పద్దు



సాక్షి, హైదరాబాద్: కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్ల తొలి అప్పు చేయనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా మంగళవారం ఈ మేరకు రుణం తీసుకోనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.59 వేల కోట్లకు పైగా నిధులను బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా సేకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో మొత్తం రూ.40వేల కోట్లకు పైగా రుణ సేకరణను లక్ష్యంగా పెట్టుకోగా, ఆ పద్దు దాదాపు రూ.50 వేల కోట్లకు చేరడం గమనార్హం.

డిసెంబర్ నుంచి రూ.13 వేల కోట్లకు పైమాటే

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గత ఆర్థిక సంవత్సరంలో చేసిన అప్పు రూ.13 వేల కోట్లు దాటింది. డిసెంబర్ 7 నుంచి మార్చి 31 వరకు తొమ్మిది దఫాల్లో బహిరంగ మార్కెట్ ద్వారా ఈ రుణాలను సమీకరించింది. గత ఏడాది డిసెంబర్ 12న రూ. 500 కోట్లు, మిగతా 10వ పేజీలో ▶

వేధింపుల సంస్థలా ఈడీ

- దర్యాప్తులో నిష్పక్షపాతం లేదని ఎమ్మెల్సీ కవిత ఆరోపణ
- ఆమె బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో వాదనలు
- విచారణను 4వ తేదీకి వాయిదా వేసిన న్యాయమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు సంస్థలా కాకుండా వేధించే సంస్థలా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈడీ దర్యాప్తులో నిష్పక్షపాతం కనిపించడం లేదని, కక్షగట్టి వ్యవహరిస్తున్నట్లు అనిపిస్తోందని విమర్శించారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టైన కవిత తీహార్ జైలులో రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఆమె దాఖలు చేసుకున్న మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా కవిత తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ''ఈడీ దర్యాప్తు సంస్థలా కాకుండా వేధించే ఏజెన్సీలా వ్యవహరిస్తోంది. న్యాయం, నిష్పక్షపాతం కనిపించడంలేదు. అంతా ప్రీమోటివేటెడ్ విధానంలా ఉంది. అరెస్టు చేసినా, చేయకపోయినా నిత్యం వేధింపులు తప్పవన్నట్టు వ్యవహరిస్తోంది. రోజూ ఒక ఆపిల్ తింటే ఆరోగ్యమని డాక్టర్లు చెప్పినట్టు.. మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

మేము ఊపిరిపోస్తే.. కాంగ్రెస్ ఉసురు తీస్తోంది

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మేము రైతులకు ఊపిరిపోస్తే, వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ వారి ఉసురు తీస్తోంది'అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు నెలకొందని, అన్నదాతలు తమ ఆవేదన, ఆక్రందనను వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రైతాంగంపై కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధిని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించడం హాస్యాస్పదం అని అన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం రైతులు, ప్రజలను హోల్‌సేల్‌గా మోసం చేసిందన్నారు.

తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఉంటుంది



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉన్నంత కాలం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందంటూ విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్ని సీట్లు వస్తాయో చెప్పాలన్నారు. పార్టీ నేత లోక బాపురెడ్డితో కలిసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావని, అదే నిజమైతే దేశంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదనుకోవచ్చా అని ప్రశ్నించారు. కేసీఆర్ పంట పొలాల సందర్శనకు అడుగు బయట పెట్టగానే కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారని అన్నారు. పంటలు ఎందుకు ఎండాయో మంత్రులు వాస్తవాలు చెప్పాలని, రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రాజెక్టుల వారీగా సీఎం, మంత్రులు సమీక్షలు నిర్వహించడం లేదని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు.

కడియం ఇంటి ముందు చావుడప్పు కొడతాం

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సాక్షి, హైదరాబాద్: పార్టీలో పెద్ద పదవులు అనుభవించి.. ద్రోహం చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటిముందు చావుడప్పు మోగిస్తామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణకు ద్రోహం చేసిన టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన కడియం శ్రీహరిని రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలోకి తీసుకుని కేసీఆర్ అనేక అవకాశాలు ఇచ్చారన్నారు. కడియం వల్లే మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్ బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లారన్నారు. మాదిగ జాతిని కడియం శ్రీహరి నిర్వీర్యం చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆట, పాట పాత్ర లేదని కేశవరావు వ్యాఖ్యానించడాన్ని ఆయన ఖండించారు.

మా పోటీపై జాతీయ నాయకత్వానిదే నిర్ణయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్న అంశాన్ని పార్టీ జాతీయ నాయకత్వానికే అప్పగించామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. పోటీ చేసే అంశాన్ని జాతీయ పార్టీనే నిర్ణయిస్తుందన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కేసీఆరే కారణమని ఆరోపించారు. గతంలో కేసీఆర్ చేసిన తప్పుల వల్లనే తెలంగాణ ప్రజలు, రైతులు ఇబ్బందిపడుతున్నారని కూనంనేని విమర్శించారు. పంట నష్టానికి రూ.25 వేలు డిమాండ్ చేస్తున్న కేసీఆర్, ఆయన ప్రభుత్వ హయాంలో ఎంత చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మునుగోడులో బీఆర్ఎస్‌కు సాయం చేస్తే ఆ పార్టీకి కనీసం కృతజ్ఞత ఉండాలి కదా అని కూనంనేని మండిపడ్డారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు: జాజుల

కవాడిగూడ (హైదరాబాద్): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీ లు సగం పార్లమెంటు స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలను డిమాండ్ చేశారు. అన్ని ప్రధాన రాజ కీయ పార్టీలకు బుద్ధి చెప్పే విధంగా ఈనెల 7న హైదరాబాద్ నగరంలో బీసీల రాజకీయ విధాన పరమైన నిర్ణయం కోసం జాతీయ సదస్సు నిర్వహించి తమ విధానాన్ని ప్రకటించనున్నట్లు జాజుల తెలిపారు. సోమవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ కులసంఘాల సమావేశంలో జాజుల మాట్లా డుతూ అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణలో 8 పార్లమెంటు స్థానాలను బీసీలకు కేటాయించాల్సి ఉండగా అందులో బీజేపీ 5 స్థానాలు, కాంగ్రెస్ 3 స్థానాలు, బీఆర్ఎస్ పార్టీ 6 స్థానా లను మాత్రమే కేటాయించడం సరికాదన్నారు.

కరువు నేలను తలపిస్తున్న మిరుదొడ్డిలోని పెద్ద చెరువు



అందె రోడ్డులో అడుగంటిన చెరువు నీరు



నీరందక ఎండిపోయిన వరి



ఇప్పుడే ఇలా.. ఇక ముందెలా?

మిరుదొడ్డి (దుబ్బాక): తీవ్రమైన ఎండల ధాటికి సిద్దిపేట జిల్లాలోని పలు చెరువుల్లో నీరు అడుగంటిపోతోంది. దీంతో చెరువులు కరువు నేలను తలపిస్తున్నాయి. వేసవి ధాటికి భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. చెరువుల ఆయకట్టు కింద ఉన్న బోరు బావులు సైతం వట్టిపోతున్నాయి. రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేస్తున్న పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. ముస్ముందు ఎండల పరిస్థితిని తలుచుకుంటేనే భయం వేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీ పక్కనే డేంజర్‌గాళ్లు

- నల్లగొండలో సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యలు
- ఏక్‌నాథ్ షిండేలు మీ పార్టీలోనే ఉన్నారట
- మేమేమీ మీ ప్రభుత్వాన్ని పడగొట్టం
- ఐదేళ్లు సీఎంగా ఉండు.. హామీలు అమలు చెయ్



రైతుతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'మీకు డేంజర్ నల్లగొండ, ఖమ్మం బాంబులతోనే.. బీఆర్ఎస్‌తో మీకేం డేంజర్ లేదు. మేమేమీ మీ ప్రభుత్వాన్ని పడగొట్టం. ఏక్‌నాథ్ షిండేలు మీ పార్టీలోనే ఉన్నారని బీజేపీ వాళ్లే చెబుతున్నారు..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. 'మీ వాళ్లే మీ ప్రభుత్వాన్ని పడగొడతారు. నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుసగుసలు పెడుతున్నరట. నేనొస్తా.. నేనొస్తా.. నాకు ముఖ్యమంత్రి ఇవ్వండి అంటున్నడట. నీ పక్కనే ఉన్నారు డేంజర్ గాళ్లు. మేము కాదు.. ఐదేళ్లు సీఎంగా ఉండు. 450 హామీలు అమలు చెయ్.. లేదంటే వదిలిపెట్టేది లేదు'అని కేటీఆర్ అన్నారు. సోమవారం నల్లగొండలో నల్లగొండ పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల తర్వాత రేవంతే బీజేపీలోకి వెళ్తారు

లోక్‌సభ ఎన్నికల తర్వాత శరణు కోసం, షెల్టర్ కోసం, భవిష్యత్తు కోసం కేసుల నుంచి బయట పడటం కోసం రేవంత్‌రెడ్డే కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళతారని కేటీఆర్ చెప్పారు. ఈ విషయం పదిసార్లు అన్నా రేవంత్‌రెడ్డి దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భయమా? భక్తా.. మోదీ దగ్గరకు వెళ్లేందుకు మార్గం వేసుకుంటున్నారనే సీక్రెట్ బయట పడిందనే ఇబ్బందా చెప్పాలన్నారు. రాహుల్‌గాంధీ ఢిల్లీలో మోదీని దొంగ అని విమర్శిస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం మోదీ మా పెద్దన్న అని అంటున్నారని గుర్తు చేశారు. గుజరాత్‌లో అంతా స్కామ్‌లు జరుగుతున్నాయని రాహుల్ విమర్శిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గుజరాత్ మోడల్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తానంటున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని చెప్పారు.

చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకే ఓటమి

పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని కేటీఆర్ అన్నారు. అయితే చేసిన అభివృద్ధి చెప్పుకోకపోవడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినట్లుగా ఓయూ విద్యార్థుల సర్వేలో తేలిందని తెలిపారు. పదేళ్లలో 1,63,283 ఉద్యోగాలు ఇచ్చామని, ఈ విషయాన్ని యువతకు, నిరు ద్యోగులకు, ప్రజలకు చెప్పి వారి మనసు గెలుచుకోలేకపోయామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తాము 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, పెళ్లి చేసుకుని సంసారం చేస్తేనే పిల్లలు పుడతారు కదా.. నోటిఫికేషన్లు ఇవ్వకుండానే ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలకే వాళ్లు ఉత్తర్వులు ఇచ్చారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులకు 73 శాతం మేర జీతాలు పెంచినా, నెలలో మొదటి రోజు జీతాలు పడటం లేదని వారు దూరమయ్యారని అన్నారు. కరోనా కారణంగా ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులతో ఇవ్వలేకపోతున్నామని ఉద్యోగులకు సర్ది చెప్పడంలో విఫలమయ్యామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అసమర్థత వల్లే కరువు

6న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

నల్లగొండ రూరల్: 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కరువు'అని కేటీఆర్ చెప్పారు. పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతుంటే సీఎం, మంత్రులు రైతులకు ధైర్యం చెప్పడం లేదని, పొలాలను పరిశీలించడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన రైతులు గన్నెబోయిన మల్లయ్య యాదవ్, బోర్ల రాంరెడ్డి నివాసాలకు ఆయన వెళ్లారు. మల్లయ్య యాదవ్‌కు బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఇచ్చిన రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలో రెండు పంటలకు సాగునీరు అందేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని, ఎండిన వరికి ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని, క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఈ నెల 6న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాయకులు పల్లె రవికుమార్, చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ అభివృద్ధి ఎజెండాతోనే ఓట్లు అడుగుతాం: కిషన్‌రెడ్డి

- బీజేపీ ప్రత్యర్థులు మోదీ, కేంద్రమంత్రులపై ఒక్క అవినీతి ఆరోపణ చేయలేకపోయారు
- తాత్కాలిక ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ఉచితాలు ఇచ్చింది
- కేసీఆర్, కేటీఆర్ తప్పిదాలతోనే తెలంగాణకు నష్టం



విలేకరులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా ఆధారంగానే ప్రజలను ఓట్లు అడుగుతామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గత పదేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తామని చెప్పారు. కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు పూర్తి భిన్నంగా నీతివంతమైన, ప్రజాస్వామ్యబద్ధమైన పాలనను మోదీ అందించారన్నారు. బీజేపీ ప్రత్యర్థులు కూడా మోదీ, కేంద్ర మంత్రులపై ఒక్క అవినీతి ఆరోపణ చేయలేకపోయారంటే వాస్తవ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. సోమవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2004–14 మధ్య కాంగ్రెస్ హయాంలో 'పాలసీ పెరాలసిస్' (పాలనాపరమైన వైఫల్యం) సాగిందని మండిపడ్డారు. ఆనాడు తాత్కాలిక ప్రయోజనాల కోసమే ప్రజలకు కాంగ్రెస్ ఉచితాలు ఇచ్చిందన్నారు. యూపీఏ (కాంగ్రెస్) పాలనలో అమలైన పథకాలు నినాదాలకే పరిమితమయ్యాయని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాలేకపోయాయని విమర్శించారు. గత పదేళ్ల మోదీ సర్కార్ పాలనలో మన దేశమే చాలా దేశాలకు చేయూతనందిస్తుందని, అనేక విషయాల్లో చేదోడువాదోడుగా నిలుస్తోందన్నారు.

రూ.34 లక్షల కోట్ల సంక్షేమ పథకాలు అందాయి

ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశంలో సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఓ ప్రభావవంతమైన ముందడుగు పడిందన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఉచితాలు ఇవ్వడం వంటి ఆలోచనల నుంచి బయటపడి, దీర్ఘకాలంలో సామాజికంగా లాభం చేకూర్చే కార్యక్రమాలను రూపొందించిందన్నారు. కులమతాలకు అతీతంగా రూ.34 లక్షల కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలను మోదీ ప్రభుత్వం అందించిందన్నారు. కేంద్రం తీసుకొచ్చి న సంస్కరణల వల్ల దేశవ్యాప్తంగా సరాసరి 22 గంటల విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

అత్యంత తక్కువ సమయంలో బీఆర్ఎస్ అంతర్ధానం

అత్యంత తక్కువ సమయంలో అంతర్ధానం కానున్న పార్టీ బీఆర్ఎస్ అని కిషన్‌రెడ్డి ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాజాగా మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన పర్యటనపై స్పందించాల్సింది ఏమీ లేదని చెప్పారు. రాష్ట్రంలో ఎన్టీపీసీ ప్లాంట్ శంకుస్థాపనకు వచ్చిన కేసీఆర్, ప్రారంభోత్సవానికి రాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి వివిధ రూపాల్లో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తే సీఎంగా కేసీఆర్ ఏ మాత్రం సహకారం అందించలేదని చెప్పారు. కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన్ను చూసి మనమందరం జాలి పడాల్సి ఉందన్నారు. తాను సీఎం అయినట్టు కేటీఆర్ కలలు కన్నారని, చివరకు అవి విఫలం అయ్యాయని, కేసీఆర్, కేటీఆర్‌ల తప్పిదాల వల్లనే తెలంగాణకు తీరని నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా

- మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికపై ఈసీ నిర్ణయం
- జూన్ 2న ఓట్ల లెక్కింపు.. 5 లోపు ప్రక్రియ పూర్తి
- జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్‌కు ఈసీ ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా పడింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం.. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన పక్షంలో దీని ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై చూపే అవకాశం ఉండటంతో కౌంటింగ్ చేపట్టొద్దని ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌కు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. జూన్ రెండో తేదీన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఐదో తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల రెండో తేదీన అంటే మంగళవారం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ చేపట్టాల్సి ఉంది. జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళా శాలలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందుగా ఉప ఎన్నిక రావడం.. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ వ్యూహాలతో క్యాంప్ రాజకీయాలకు తెరలేపడం.. సీఎం రేవంత్ సొంత ఇలాకాలో జరుగుతున్న పోరు కావటంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపైనే పడింది. ఫలితాల కోసం పార్టీలు ఆతృతగా ఎదురు చూస్తున్న క్రమంలో కౌంటింగ్ వాయిదా పడడంతో నాయకుల్లో నిరుత్సాహం అలుముకుంది.

5న రైతు సత్యాగ్రహం: బీజేపీ

రుణమాఫీ హామీ అమలు కోసం కాంగ్రెస్‌ను నిలదీయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 5న అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలపై రైతు సత్యాగ్రహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర బీజేపీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు ఇచ్చి నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానంగా రూ.రెండు లక్షలలోపు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన రేవంత్.. సీఎం అయ్యాక మాట తప్పారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను పెంచడంతోపాటు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు దేశ వ్యాప్తంగా రూ. 6 వేల సహకారం అందిస్తోందన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ సీట్లలో బీజేపీ గెలిచేందుకు కిసాన్ మోర్చా శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు.

మాటల రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత



తమిళ సినిమా: సీనియర్ దర్శకుడు, అనువాద మాటల రచయిత శ్రీరామకృష్ణ (75) సోమవారం రాత్రి 8.30 గంటలకు చెన్నై అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. గత కొద్దికాలంగా ఆయన వృద్ధాప్య సంబంధ సమస్యలు, అనారోగ్యంతో బాధపడు తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి ఆయన జన్మస్థలం. 1980 దశకంలో చెన్నైకి వచ్చారు. తొలుత దర్శకుడు దొరై వద్ద, అనంతరం అనువాద రచ యిత రాజశ్రీ,, వసంతకుమార్ వద్ద సహాయకుడిగా పనిచేశారు. సమాజంలో స్త్రీ, బాలమురళి ఎంఏ సినిమాలకు దర్శ కత్వం వహించారు. అనువాద రచయితగా 100 పైగా చిత్రాలకు పనిచేశారు. వీటిలో బొంబాయి, జెంటిల్మన్, చంద్రముఖి లాంటి భారీ చిత్రాలు న్నాయి. దర్శకులు మణిరత్నం, శంకర్ అన్ని చిత్రాలకు మాటలు రాసిన శ్రీరామకృష్ణ, రజనీకాంత్ దర్బార్ చిత్రానికి చివరిగా మాటలు అందించారు.

లీకు వార్తలు.. ఫేక్ ప్రచారాలు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ధ్వజం
- హామీలు నెరవేర్చలేక రోజుకో కొత్త నాటకం.. బీజేపీతో కలిస్తే జోడీ.. లేదంటే ఈడీ దాడి
- పదేళ్లలో ఆ పార్టీ ఏం చేసిందో చెప్పాలి



మాట్లాడుతున్న తన్నీరు హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: హామీలు అమలు చేయలేక రోజుకో కొత్త నాటకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అన్నీ లీక్ వార్తలు, ఫేక్ ప్రచారాలే తప్ప హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. పదేళ్లలో రాష్ట్రానికి ఏమీ చేయలేని బీజేపీ మరోసారి రాముడు, దేవాలయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు గుంజాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. బీఆర్ ఎస్ పార్టీలో కీలక పదవులు అనుభవించిన నేత లు అవకాశవాద రాజకీయాలతో పార్టీలు మారి తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా చింతగట్టు క్యాంపు సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో.. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాకతీయ తోరణాన్ని ముట్టుకోవద్దు

కాంగ్రెస్ నాయకులు ఏదో ఉద్ధరిస్తారని ప్రజలు అనుకుంటే.. వంద రోజుల్లో ఉద్దెర మాటలే తప్ప ఉద్ధరించింది ఏమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ చిహ్నాలు, గుర్తులను చెరిపేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. సీఎం రేవంత్ సర్కార్ కాకతీయ తోరణాన్ని ముట్టు కుంటే వరంగల్ జిల్లా అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. కాకతీయ తోరణం వరంగల్ జిల్లా ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని అభివర్ణించారు.

రాముడికి అందరం మొక్కుతాం

'మాట వింటే జోడీ.. వినకపోతే తెల్లారే ఈడీ దాడి' అనే విధంగా పదేళ్లలో దేశంలో రాజకీయ పరిస్థితిని బీజేపీ మార్చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీ పాలనలో దేశంలో ఆకలి, పేదరికం, నిరు ద్యోగం పెరిగిపోయాయన్నారు. 'బీజేపోళ్లు ఏమన్నా అంటే రామాలయం అంటారు. రాముడికి అందరం మొక్కుతాం. మనం కూడా హనుమాన్ చాలీసా చదువుతాం. బీజేపోళ్లకు వస్తదో.. రాదో తెల్వదు కానీ.. నేను హనుమాన్ చాలీసా రెండు నిమిషాల్లో చదువుతాను (చదివి వినిపించి)' అని చెప్పారు.

కడియం శ్రీహరికి గుణపాఠం చెప్పాలి

➤ పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ తరఫున అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పలు సందర్భాల్లో రేవంత్‌రెడ్డిని దొంగతో పోల్చి, చివరకు ఆ దొంగతోనే కాంగ్రెస్ కండువా కప్పించుకున్నారని, ఈ వయసులో ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీని వాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణా రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ కాళ్లపై పడిన కార్యకర్త

సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతుండగా ఓ కార్యకర్త వేగంగా స్టేజీపైకి చేరుకుని ఆయన కాళ్లపై పడ్డారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. నేతలు, గన్‌మన్లు కలిసి అతన్ని కిందికి దింపారు.

రైతులకు భరోసా కల్పించేందుకే దీక్ష

బీజేపీ ఎంపీ బండి సంజయ్




కరీంనగర్‌టౌన్: 'సాగునీరు లేక పంటలు ఎండి పోతున్నాయి. రైతులకు అండగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తూ మొద్దు నిద్రలో ఉంది'అని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని మేల్కొల్పడానికి, రైతులకు భరోసా కల్పించేందుకు మంగళవారం కరీంనగర్‌లో రైతు దీక్ష చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాడు కేసీఆర్ రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి, వారిని గోస పెడితే ముందుండి కొట్లాడింది బీజేపీయే అని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ విధానాలనే అవలంబిస్తోందన్నారు. సాగునీరు లేక రైతులు అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కరువు ఉందని కుంటిసాకులు చెబుతూ తప్పించుకోవాలని చూస్తోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, కౌలు రైతులకు రైతుబంధు ఏమైందని ప్రశ్నించారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ రామడుగు వచ్చి పంటనష్టం ఇస్తానని ఇవ్వలేదని, ఆయనకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. రైతులకు క్షమాపణ చెప్పిన తర్వాతే కరీంనగర్‌లో అడుగుపెట్టాలన్నారు.

'చెంగిచర్ల' కేసును కొట్టివేయండి

సాక్షి, హైదరాబాద్: చెంగిచర్ల ఘటనలో తనపై రాజకీయ ప్రేరే పితంగా తప్పుడు కేసు పెట్టారని, ఉప్పల్, మేడిపల్లిలో నమో దైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని హైకోర్టులో బీజేపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిటిషన్ దాఖలు చేశారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకనే అవాస్తవాలు మాట్లాడుతున్నారు

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేసీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతవల్లే కరువు పరిస్థితులు వచ్చాయనడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పంట వాడిపోవడానికి, ఎండిపోవడానికి కూడా తేడా తెలియని పెద్ద రైతు మన కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. జనగామ జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులోని లక్ష ఎకరాల వరి పంట వారం రోజుల్లో కోయడానికి సిద్ధంగా ఉందని, కరెంట్ లేని కారణంగా గుంట భూమి కూడా ఎండిపోలేదని తెలిపారు. జనగామలో 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, పంట లెండిపోతే కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని కేసీఆర్ తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వం కంటే కరెంటు సరఫరా బాగున్నదని, 24 గంటల కరెంటు అంతటా ఇస్తున్నామని సుధాకర్ గౌడ్ చెప్పారు. ఎక్కడైనా కరెంటు రాలేదని కేసీఆర్ నిరూపిస్తారా? అని సవాలు విసిరారు.


మా NEET/JEE లాంగ్ టర్మ్ బ్యాచ్‌లో చేరి
విజేతలుగా మారండి
Aakash
Medical | IIT-JEE | Foundations
NEET (UG)
AIR 1 MRINAL KUTTERI NEET (UG) 2021
AIR 1 TANMAY GUPTA NEET (UG) 2021
AIR 1 KARTHIKA G NAIR NEET (UG) 2021
AIR 2 VATSA A BATRA NEET (UG) 2022
AIR 3 KAUSTAV BAURI NEET (UG) 2023
and many more...
JEE (Advanced)
AIR 1 CHIRAG FALOR JEE (ADVANCED) 2020
AIR (FEMALE) 1 TANISHKA KABRA JEE (ADVANCED) 2022
AIR 27 ADITYA NEERAJE JEE (ADVANCED) 2023
AIR 28 AAKASH GUPTA JEE (ADVANCED) 2023
AIR 29 TANISHQ MANDHANE JEE (ADVANCED) 2023
and many more...
Though every care has been taken to publish the result, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
MEDICAL (NEET-UG)
క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్ నుండి ఆకాష్ తెలంగాణ స్టార్స్
ENGINEERING (JEE)
CHINMAYI VUPPALA JIPMER PUDUCHERRY
LAKSHANYA ADHIKESAVAN AIIMS NEW DELHI
ABHINAV UPADHYAY JIPMER PUDUCHERRY
SRAVANI REDDY AIIMS BHUBANESWAR
PRAHARSH PATEL KOTHAM JIPMER PUDUCHERRY
and many more...
ALLADI LOHITH KUMAR IIT NEW DELHI
POORVIE SADAGOPAN IIT KANPUR
B SIDDAARTH IIT KHARAGPUR
VEMULA SIDDHARTHA IIT HYDERABAD
GUNJE MANIDEEP RAM IIT GUWAHATI
and many more...
అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి
లాంగ్ టర్మ్ బ్యాచ్‌లు
for JEE | EAMCET / NEET 2025
• Special Focus on Physics & Chemistry
• Exclusive Doubt Sessions
• Comprehensive Study Material & All India Tests
• Student Centric Approach
Hurry! Batches filling fast.
JEE | EAMCET / NEET 2024
కోసం క్రాష్ కోర్సులు
Enrollment Started
CLASS 8th-10th
Integrated Courses
for School Boards / Olympiads / NTSE
Enrollment Started
CLASS 11th
2 Year Integrated Courses
for NEET / JEE | EAMCET
Enrollment Started
CLASS 12th
1 Year Integrated Courses
for NEET / JEE | EAMCET
Enrollment Started
Junior College Integrated Program Available
90%* పూర్తి స్థాయి
స్కాలర్‌షిప్ కోసం త్వరపడండి
ఇన్‌స్టంట్ అడ్మిషన్ మరియు స్కాలర్‌షిప్ టెస్టును (iACST) వ్రాయండి.
ఇప్పుడే ఉచితంగా నమోదు చేసుకోండి: iacst.aakash.ac.in
వెబ్‌సైట్‌ని సందర్శించండి లేదా QR కోడ్‌ని స్కాన్ చేయండి
*Terms and conditions apply.
Omni Channel Learning
Meticulously Designed Study Material
Regular Tests & Assessments
35+ Years of Excellence
1,22,000+ Aakashians Qualified NEET & JEE in 2023
300+ Branches Across India
MEDICAL (NEET)
AudiPrep-Audiobook for NEET
Know Your NCERT
NCERT Maps-NEET
NEET Challenger
ENGINEERING (JEE)
JEE Challenger
Video Solutions of Study Material
JEE Archive, Spotlight Program
Skull Crusher Quiz
FOUNDATION (Class 8-10)
Activity Based Learning
Quizzes & Workshops
Experiment Based Videos
Flash Cards & Lecture PPTs
CALL YOUR NEAREST BRANCH
Hyderabad
Habsiguda: 8800950201
Himayat Nagar: 8800013001
Kondapur: 8800897955
Kothapet: 8800013004
Kukatpally: 8800013003
Shaikpet: 8800013006
S R Nagar: 8800013002
Suchitra: 8800948902
Trimulgherry: 8800013009
Karimnagar: 8800013007
Nizamabad: 8800857521
Warangal: 8800013016
SCAN FOR NEAREST BRANCH
Aakash Information Centre: Mancherial: 9100078157
Andhra Pradesh Branches: Guntur: 8800971868, Kadapa: 8800898028, Kakinada: 8800789546 , Kurnool: 8800013008, Nellore: 8800012982, Rajahmundry: 8800012983, Tirupati: 8800013010, Vijayawada: 8800013015, Visakhapatnam: Dwarka Nagar: 8800013011, Gajuwaka: 8800013012, Madhurawada: 8800548130. Aakash Information Centre: Vizianagaram: 8448799006
CALL (TOLL-FREE): 1800-102-2727
VISIT: aakash.ac.in
Aakash
Medical IIT-JEE Foundations



అనుకరించకుండా (వాళ్లు చేసింది చేయకుండా) నిరోధించుకోవడమే అత్యుత్తమ ప్రతీకారం.
– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 2 ఏప్రిల్ 2024

రాజధానిలో ప్రతిపక్ష గర్జన

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరిగిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భారీ ర్యాలీ అనేక విధాల ప్రత్యేకమైనది. 'లోక్‌తంత్ర్ బచావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) పేరిట సాగిన ఈ ర్యాలీకి నేతలే కాదు... ప్రజలూ పెద్దయెత్తున తరలిరావడం విశేషమైతే, ప్రతిపక్ష కూటమిని కొట్టి పారేస్తున్న విమర్శకులకు ఇది ఒక కనువిప్పు. అలాగే, క్రికెట్ లాగా ఈ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ చేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారంటూ ర్యాలీలో చేసిన ఆరోపణ ఓ సంచలనం. కీలక ప్రతిపక్ష నేతల్ని అరెస్టు చేయడం, పన్నుల భూతాన్ని పైకి తీసి పార్టీలను వేధించడం వగైరాలతో ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేకుండా చేస్తున్నారన్న వాదన కూడా జనసామాన్యంలోకి నెమ్మదిగా చొచ్చుకుపోతోంది. ఎన్నికల్లో తొలి ఓటు పడడానికి మరో మూడు వారాలైనా లేని పరిస్థితుల్లో... ప్రతిపక్ష కూటమి మొన్న జరిపిన మూడో ర్యాలీ అందరి దృష్టినీ ఆకర్షించింది అందుకే.

మార్చి 3న పాట్నాలో 'జన చేతన ర్యాలీ', మార్చి 17న ముంబయ్‌లో రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' తర్వాత ఇది మూడోది. తాజా సభను ఎన్నికల ముందు సహజంగా జరిపే అనేక ర్యాలీల్లో ఒకటిగా చూడలేం. ఎన్నికలనగానే సర్వసాధారణంగా ఉపాధి అవకాశాలు, ధరల పెరుగుదల, ఇటీవల కులగణన, విభిన్న వర్గాల మధ్య సామరస్యం లాంటి అంశాలను ప్రతిపక్షాలు భుజానికెత్తుకుంటాయి. కానీ, ప్రతిపక్షం ఈసారి ఏకంగా ఈ ఎన్నికలను జరిపే విధానంపైనే సందేహాలు వ్యక్తం చేయడం అసాధారణం. కేంద్రంలో గద్దె మీద ఉన్న బీజేపీ, దాని పెద్దలు ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను శాఖ వగైరాలను గుప్పెట్లో పెట్టుకొని ఎన్నికల్లో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ప్రతిపక్షాలకు చెందిన ఇద్దరు సీఎంల అరెస్టు సహా పలు ఘటనల్ని కూటమి అందుకు ఉదాహరణగా చూపిస్తోంది. అధికార, ప్రతిపక్షాలకు సమాన అవకాశాల్ని కల్పించాల్సిన ఎన్నికల వాతావరణాన్ని ఇలా నాశనం చేశారంటోంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, దుర్నీతి లేకుండా జరిగేలా చూడాలనే వాదనను బలంగా ముందుకు తెచ్చింది.

సోరెన్, కేజ్రీవాల్‌ల సతీమణులు సహా మొత్తం 17 పార్టీలు పాల్గొన్న ర్యాలీ ఇది. కేవలం కేజ్రీవాల్‌కు సంఘీభావంగా కొలువు దీరారనే అపవాదు రాకుండా ఉండేందుకు వేదిక ముందున్న కటకటాల్లో కేజ్రీవాల్ బ్యానర్‌ను 'ఆమ్ ఆద్మీ పార్టీ' పెద్దమనసుతో తొలగించడం విశేషం. మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు గైర్హాజరైనా కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కు సోనియా స్వయంగా పాల్గొన్న ఈ సభలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, ప్రియాంక, పలువురు ఇతర పక్షాల నేతలు నిప్పులు చెరిగిన తీరు వారి సమర్థకులకు ఉత్సాహజనకమే. అయితే, ఇంత చేసినా ఈ ర్యాలీ వెనుక అసలైన ఉద్దేశం పట్ల అనుమానాలు తొంగిచూస్తూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి కట్టుబడతామనీ, సమైక్యంగా ఉంటామనీ కూటమి పక్షాలు చెబుతున్నా వారి ఇమేజ్ ఎందుకో ఆశించినంతగా పెరుగుతున్నట్టు లేదు. ఇంకా ఏదో అపనమ్మకం, అనైక్యత, అస్పష్టత కొనసాగుతున్నాయి. కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ – ఎల్డీఎఫ్, పంజాబ్‌లో కాంగ్రెస్ – ఆప్... ఇలా 'ఇండియా' కూటమి భాగస్వాములే పరస్పరం తలపడడం ప్రతిపక్ష ప్రయోజనాలకే భంగకరం. ఈ పరిస్థితుల్లో... తొలి దశ ఓటింగ్ దగ్గరపడుతున్నందున జనానికి తమపై నమ్మకం పెరిగేలా ప్రతిపక్షాలు అడుగులు వేయడం కీలకం.

కేవలం మోదీని గద్దె దింపడమే కాదు... తమకంటూ స్పష్టమైన అభివృద్ధి అజెండా ఉందని కూటమి నమ్మకం కలిగించాలి. కలగూరగంప అంటూ అధికార పక్షం తక్కువ చేసి మాట్లాడుతున్న 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు ఇకనైనా ఉద్యోగ కల్పన, ధరల నియంత్రణ, సంక్షేమం తదితర అంశాలపై కనీస ఉమ్మడి ప్రణాళికను ఓటరు దేవుళ్ళ ముందుంచాలి. కేజ్రీవాల్ సతీమణి సునీత పేర్కొన్న దేశమంతటా నిరంతర విద్యుత్ లాంటి అంశాలతో ప్రజానుకూల ఎన్నికల వాగ్దాన పత్రాన్ని ప్రకటించాలి. 'మోదీ గ్యారెంటీ'కి పోటీగా ఇప్పటికే ప్రకటించిన అయిదు గ్యారెంటీలను కాంగ్రెస్ జనంలోకి తీసుకెళ్ళకుంటే ప్రయోజనం లేదు. ఢిల్లీ ర్యాలీతో వచ్చిన సానుకూలతను సద్వినియోగం చేసుకోవాలంటే దేశం నలుమూలలా ఇలాంటి సభలతో, ఇదే ఊపును కొనసాగించడం ముఖ్యం. కూటమిలో మమత ఉన్నట్టా లేనట్టా అని చెవులు కొరుక్కుంటున్న సమయంలో ఢిల్లీ సభలో ఆమె పార్టీ నేత పాల్గొని, కూటమిలో తృణమూల్ ఉంది, ఉంటుందని తేల్చిచెప్పడం ఊరట.

దాదాపు 400 సీట్లలో బీజేపీతో ముఖాముఖి తలపడాలన్న కూటమి కల నెరవేరలేదు. బీజేపీ, దాని మిత్రపక్షాలు దాదాపు అభ్యర్థులందరినీ ఖరారు చేసి, ప్రచారం సాగిస్తున్నందున ఇప్పటికీ పోటీలో తమ అభ్యర్థుల్ని ఖరారు చేయని ప్రతిపక్ష కూటమి తక్షణమే కళ్ళు తెరవాలి. ఈ లోటుపాట్లు అటుంచితే, 'నియంతృత్వాన్ని గద్దె దింపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ ఎన్నికల సంఘం ముందు కూటమి తాజాగా ఉంచిన అయిదు డిమాండ్లు అసంబద్ధమైనవని అనలేం. ప్రతిపక్షాల ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు ప్రభుత్వ సారథులు ప్రయత్నాలు సహా అనేకం అసత్యాలని అనలేం. అదే సమయంలో ఈ దొంగదెబ్బలను అడ్డుకొనేందుకు ఎన్నికల సంఘం తన పరిధిలో ఏమి చేయగలుగుతుందన్నదీ చెప్పలేం. అయితే, ప్రతిపక్షాల అనుమానాలు, ఆందోళనల్ని దూరం చేసి, నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక రాజ్యాంగబద్ధంగా తనకున్న విశేషాధికారాలను సద్వినియోగం చేయడం దాని చేతుల్లోనే ఉంది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంలో ఎన్నికలను నిజాయతీగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే దాని విధి. ఆ పని సవ్యంగా చేయడమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. ప్రతిపక్షాలు కోరుతున్నదీ అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.అష్టమి ప.3.27 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.6.37 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.2.20 నుండి 3.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.10 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.42 వరకు, **అమృతఘడియలు:** రా.1.50 నుండి 3.24 వరకు

సూర్యోదయం: 5.58
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

బైడెన్, ట్రంప్ మధ్యేనా పోరు?

విశ్లేషణ



ధ్రువ జయ్‌శంకర్

రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ బైడెన్, ట్రంప్ మధ్యే పోరు ఉండబోతున్నట్టు కనబడుతోంది. ఆ ఇద్దరిలోనూ ప్రస్తుతానికైతే ప్రజాభిప్రాయ సర్వేలు ట్రంప్‌కు స్వల్పంగా ఎక్కువ ఆదరణ చూపుతున్నాయి. నవంబర్ నాటికి ఇది తలకిందులవుతుందని బైడెన్ వర్గం నమ్ముతోంది. ఎవరు గెలిచినా, అమెరికాకు ప్రధాన పోటీదారుగా చైనాను నిలపడంలో, అమెరికాకు ప్రయోజనం చేకూర్చని వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరువురిదీ ఒకే బాట. కాకపోతే వాతావరణ విధానం, వలసలు, సుంకాలు, ప్రజాస్వామ్యం వంటి అంశాల్లో ముఖ్యమైన తేడాలు ఉంటాయి. వాణిజ్యం, వలసల విషయంలో భారత్ నాటకీయ మార్పులను ఎదుర్కోవాల్సి ఉంటుంది; అదే సమయంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా తనను తాను సర్దుబాటు చేసుకోగలుగుతుంది.


భారతదేశం ఎన్నికలకు సిద్ధమవుతున్న సమయంలో, అమెరికాలో కూడా ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఇప్పటికైతే అధ్యక్ష అభ్యర్థులుగా ప్రస్తుత అధ్యక్షుడు, డెమొక్రాట్ అయిన జో బైడెన్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అయిన డోనాల్డ్ ట్రంప్ ఉండేట్టే కనబడుతోంది. బైడెన్ వృద్ధాప్యం సహా, ద్రవ్యోల్బణం, సరిహద్దు భద్రత, పశ్చిమాసియా విధానంపై ఆయన తీరు మీద ఓటర్లు అసంతృప్తిగా ఉండటంతో, ప్రజాభిప్రాయ సర్వేలు ప్రస్తుతానికి ట్రంప్‌కు స్వల్పంగా ఎక్కువ ఆదరణ ఉన్నట్టు చూపుతున్నాయి. అయితే ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు, తక్కువ నిరుద్యోగం, రుణ విముక్తి, చట్టపరంగా ట్రంప్ ఎదుర్కొంటున్న కష్టాలు వంటివి... నవంబర్ నాటికి ప్రజలు ఎన్నికలకు వెళ్లే సమయానికి ఆటుపోట్లను తిప్పికొట్టగలవని బైడెన్ వర్గం నమ్ముతోంది.

ఈ ప్రారంభ దశలోనే, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం నిష్ఫలమే అవుతుంది. అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో ఫలితం ఇప్పటికే తేలినట్టయింది. ఇక మొత్తం ఫలితం దాదాపు ఆరు కీలకమైన 'స్వింగ్ స్టేట్స్'(ఊగే రాష్ట్రాలు) ద్వారా, పది లక్షల కంటే తక్కువ ఓట్ల ద్వారా మాత్రమే నిర్ణయించబడుతుంది. పరిశీలకులు విధానపరమైన చిక్కులను అంచనా వేయడం ప్రారంభించడం వివేకం. అయితే విధానపరమైన నిర్ణయాలు అలాగే కొనసాగవచ్చు, కాకపోతే వాణిజ్యం, వలస విధానంలో కొన్ని నాటకీయ మార్పులు ఉండవచ్చు.

అనేక అంశాల విషయంలో– ట్రంప్, బైడెన్ హయాంలు రెండింటిలోనూ గత ఎనిమిది సంవత్సరాలుగా గణనీయమైన కొనసాగింపు ఉంది. ఒకటి: అమెరికా అగ్రగామి వ్యూహాత్మక పోటీదారుగా చైనా ఉంటుందని చాలావరకు అర్థమైపోయింది. దీనివల్ల ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా దేశీయ, ఆర్థిక, భద్రతా విధానాలలో మార్పులకు దారితీసింది. రెండు: నయా ఉదారవాదం లేదా ప్రపంచీకరణ స్ఫూర్తితో ఇకపై పరస్పర సంబంధం లేని మార్కెట్ ప్రాప్యతను అందించకూడదని అమెరికా విశ్వసిస్తోంది. అమెరికాకు అనుకూలంగా క్రీడా మైదానాన్ని మార్చని వాణిజ్య ఒప్పందాలు ఇకపై కుదిరే ప్రశ్నే లేదు. మూడు: అమెరికా పాలకవర్గం ప్రత్యక్ష, బహిరంగ సైనిక యాత్రలకు వ్యతిరేకంగా ఉంది. దీనిని విమర్శకులు 'ఎప్పటికీ సాగే యుద్ధాలు'గా అభివర్ణిస్తున్నారు. నాలుగు: సమస్యలు ఉన్నప్పటికీ, చాలావరకు ఇజ్రాయెల్, గల్ఫ్ అరబ్ దేశాలకు అమెరికా మద్దతుగా స్థిరంగా ఉంది.

కీలకమైన తేడాలు

అయితే పొత్తులు, వాతావరణ విధానం, వలసలు(ఇమ్మిగ్రేషన్), టారిఫ్‌లు, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై బైడెన్, ట్రంప్ మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నాయి. ట్రంప్, అమెరికా మిత్రదేశాలను ఫ్రీలోడర్‌లుగా (ఇతరుల ఔదార్యాన్ని అవకాశంగా తీసుకునేవారు) విమర్శిస్తున్నప్పటికీ, బైడెన్ మాత్రం యూరప్, ఇండో–పసిఫిక్‌లో మిత్రులే ఫస్ట్ అనే విధానాన్ని అవలంబించారు. ట్రంప్ విజయం ఉత్తర అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో), ఉక్రెయిన్‌కు అమెరికా మద్దతు విషయంలో ప్రత్యేక చిక్కులను కొనితెస్తుంది. డెమొక్రాటిక్ పునాదికి ముఖ్యమైన వాతావరణం, పర్యావరణ విధానాలపై బైడెన్ దేశీయ పరిశ్రమకు, క్రియాశీల వాతావరణ దౌత్యం కోసం భారీ రాయితీలకు మద్దతు ఇచ్చారు. ట్రంప్ ఆ సబ్సిడీలను రద్దు చేయకపోవచ్చు (ఇది రిపబ్లికన్ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుస్తుంది) కానీ ఆయన కచ్చితంగా అంతర్జాతీయ వాతావరణ ఒప్పందాలను వెనక్కి తీసుకుంటారు.



వ్యత్యాసం ఉన్న మరొక అంశం వలసలు. వీటిని రిపబ్లికన్లు అడ్డుకోవాలని కోరుకుంటారు. కానీ డెమొక్రాట్లు సులభతరం చేయాలని ఆశిస్తున్నారు. మెక్సికన్ సరిహద్దులో అక్రమ వలసలను అరికట్టడానికి రిపబ్లికన్ పాలనాయంత్రాంగం ఉద్దేశపూర్వకంగా క్రూరమైన విధానాన్ని అవలంబిస్తుంది. వాణిజ్య అసమతుల్యతలను ఎదుర్కోవడానికీ సుంకాలు, ఇతర చర్యలను అమలు చేయడానికి ట్రంప్ సుముఖత వ్యక్తం చేశారు. చివరగా, బైడెన్ తన ప్రాపంచిక దృక్పథాన్ని ప్రజాస్వామ్యం వర్సెస్ నిరంకుశత్వాలను చూపుతుండగా, ట్రంప్ పాలనాయంత్రాంగం మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి తక్కువ శ్రద్ధ చూపుతుంది.

ఆసియాతో సహా కొన్ని అమెరికన్ మిత్రదేశాలు, భాగస్వాములు ఇప్పటికే రెండవసారి ట్రంప్ అధ్యక్ష పదవికి సంబంధించిన చిక్కులను అంచనా వేస్తున్నారు. తన ఎజెండా విషయంలో ట్రంప్, ముఖ్యంగా సైనిక సహాయం, వాణిజ్యం, ఇమ్మిగ్రేషన్‌పై ఎక్కువ నిబద్ధతతో ఉంటారు; వాటి అమలులో గొప్ప వృత్తిపరతత్వం కూడా కనబరుస్తారు. 2016లో, ట్రంప్ ఏమాత్రం సన్నద్ధత లేకుండా ఎన్నికలలో విజయం సాధించడం పట్ల తనకు తానే ఆశ్చర్యపోయినట్లు కాకుండా, మళ్లీ అధికారంలోకి తిరిగి వచ్చినప్పుడు తన విజన్‌ని అమలు చేయడంలో మరింత నైపుణ్యం కలిగిన కార్య నిర్వహణ ఉండనుంది. రిపబ్లికన్ పార్టీకి చెందిన చాలా శ్రేణులు ఆయన వెనుకే ఉంటారు. మాజీ వాణిజ్య సంధానకర్త రాబర్ట్ లైట్ థైజర్, మాజీ జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ ఓ'బ్రియన్, దేశీయ విధాన సలహాదారు స్టీఫెన్ మిల్లర్... వాణిజ్యం, విదేశాంగ విధానం, ఇమ్మిగ్రేషన్ విధానాన్ని రూపొందించడంలో కీలక పాత్రలు పోషిస్తున్న వారిలో ఉన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే కేటాయించాల్సిన చాలా ప్రభుత్వ కీలక పదవులకు సన్నాహాలు జరుగుతున్నాయి. సొంత పార్టీలోని ట్రంప్ విమర్శకులు సైతం పాలనా యంత్రాంగంలో చేరే అవకాశం గురించి ఆయన్ని సంప్రదిస్తున్నారు.

ఇండియాపై ప్రభావం ఉంటుందా?

ఎన్నికల ఫలితాల వల్ల భారతదేశానికి ఎలాంటి చిక్కులు ఎదురవుతాయి? రక్షణ లేదా సైనిక సహాయం కోసం వాషింగ్టన్‌పై ఆధారపడే అమెరికా మిత్రదేశాలు లేదా అమెరికన్ మార్కెట్ ప్రాప్యతపై ఆధారపడే ప్రధాన వాణిజ్య భాగస్వాములతో పోలిస్తే, ఎన్నికల ఫలితం న్యూఢిల్లీపై కాస్త తక్కువగానే ఉంటుంది. అనేక అంశాలలో, భారతదేశం తనను తాను భారాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్న భాగస్వామిగా చూపించుకుంటూ, 2017–2021ల మధ్యలానే ట్రంప్ లావాదేవీలకు తనను తాను సర్దుబాటు చేసుకోగలుగుతుంది.

ఏది ఏమైనప్పటికీ, న్యూఢిల్లీ కనీసం రెండు అంశాలలో– వాణిజ్యం, వలసల విషయంలో నాటకీయ మార్పులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అమెరికాతో భారతదేశ వాణిజ్య మిగులు దృష్ట్యా, సుంకాలను అంచనా వేయవలసి ఉంటుంది. పైగా కొన్ని కఠినమైన చర్చలు అనివార్యం అవుతాయి. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తూనే, చైనా నుండి రిస్క్ లేకుండా చూసుకోవడం గురించిన భాగస్వామ్య అవగాహన, ఇప్పటికే ప్రపంచంలోని ఇతర పెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారతదేశం, జపాన్, బ్రిటన్, యూరప్‌ల మధ్య చర్చలను రేకెత్తిస్తోంది.

భారత్ విషయంలో వలస సమస్య మరింత నాటకీయంగా ఉంటుంది. చట్టపరమైన వలసదారులు– శాశ్వత నివాసితులు, అధిక నైపుణ్యం కలిగిన నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తల ప్రాసెసింగ్‌లో మందగమనం కొనసాగవచ్చు. ఎక్కువ తనిఖీలను ఎదుర్కోవాల్సి రావొచ్చు. కఠినమైన నిర్బంధాలను ఎదుర్కొనే పత్రాలు లేని వలసదారుల సంఖ్య పెరగవచ్చు. ట్రంప్ విధానాల రూపురేఖలను ఇప్పటికే ఊహించవచ్చు. అయినప్పటికీ, ఆయన విజయం సాధించిన పక్షంలోనూ భారతదేశం చాలా ఇతర దేశాల కంటే ప్రత్యక్షంగా తక్కువ ప్రభావితం కావచ్చు.

వ్యాసకర్త 'ఓఆర్ఎఫ్ అమెరికా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పెద్ద జోక్



ఏప్రిల్ ఫూల్ అనేది విదేశీ భావన. భారతదేశంలో మనకు 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) ఉన్నాయి.
– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

మంచి సంగతి



బూస్ట్, హార్లిక్స్, బోర్న్‌విటా లాంటి వాటికి 'ఆరోగ్య డ్రింకులు' అనే పదాన్ని వాడటాన్ని 'బాలల హక్కుల సంరక్షణ జాతీయ కమిషన్' నిషేధించడం గొప్ప విజయం. ఎన్నో ఏళ్లుగా 'హెల్త్ డ్రింక్' అనే మాటతో అమాయక తల్లిదండ్రులు మోసపోతున్నారు. ఇప్పుడది సాగదు.
– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఉత్కళ జలధి తరంగ...



అందరికీ 'ఉత్కళ దిబస' (ఏప్రిల్ 1 : ఒడిశా అవతరణ దినోత్సవం) శుభాకాంక్షలు. ఒడిశా, దాని క్రియాశీల జనాల ఘన సంస్కృతి, వారసత్వాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. జాతీయ పురోభివృద్ధికి రాష్ట్రం ఎంతో తోడ్పడింది. ఒడిశా ప్రజల సమృద్ధి, విజయం కోసం ప్రార్థిస్తాను.
– నరేంద్ర మోదీ, ప్రధాని

ఇవి నయం కదా!



'జన్ ఔషధి' అమ్మే ఔషధాలను ఎంతమంది ప్రయత్నించారు? నేను ఈ మధ్యే నా మందులను ఈ అవుట్ లెట్ల నుంచి తీసుకుంటున్నాను : బిల్లు దాదాపు 80 శాతం తగ్గింది. ఔషధ ఫార్ములాలు అవే, నాణ్యత కూడా అదే. ఈ లెక్కన ఫార్మా కంపెనీలు ఎంత భారీ మార్జిన్లు పొందుతున్నాయో ఆశ్చర్యం కలుగుతుంది.
– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

స్వాగతించాల్సిన విజయం



టర్కీ స్థానిక ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం గెలుపొందడం పట్ల నాకు గర్వంగా ఉంది. గత దశాబ్దంగా స్వేచ్ఛ, న్యాయాలకు స్థానం లేకుండా పోయినప్పటికీ బ్యాలెట్లు ముఖ్యమైనవనీ, ప్రతిపక్షాలు ముఖ్యమైనవనీ అర్థమవుతోంది. ప్రజాస్వామిక మార్పునకు ఇంకా ఆశ ఉంది.
– ముస్తఫా అక్యోల్, టర్కీ రచయిత

సంకేతం ఇవ్వకుండా...



కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక... అమేథీ, రాయబరేలీ (రెండూ ఉత్తరప్రదేశ్‌లోని నియోజకవర్గాలు) నుంచి పోటీ చేయవలసింది! అక్కడి నుంచి పోటీ చేయకపోవడం బలహీనతకు సంకేతంగా కనబడుతుంది. వాళ్లు అనుమానం లేకుండా గెలుస్తారు.
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

వాటిని పట్టించుకోవా?



"పాలస్తీనా గురించి నీకు అంత పట్టింపు ఎందుకు సోదరా?" "వాళ్లు మన ముస్లిం సోదరులు. వాళ్ల బాధను నేను సహానుభూతి చెందగలను." "తాలిబన్లు మహిళలను రాళ్లతో కొట్టి చంపుతున్నారు. ఐసిస్ తీవ్రవాద దాడులు చేస్తోంది. అవెందుకు ఖండించవు?" "నేను ఇండియాలో ఉంటాను. వేరే దేశాల్లో ఏం జరుగుతున్నదో నాకు తెలీదు."
– ఒమర్ ఘాజీ, రచయిత

ఇన్ బాక్స్

సామాజిక వీరుడు

శతాబ్దాల క్రితమే సబ్బండ వర్ణాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని స్థాపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్‌లో 1650 ఆగస్ట్ 18న పాపన్న పుట్టాడు. తండ్రి చిన్నప్పుడే మరణించడంతో తల్లి సర్వమ్మే సర్వస్వమై పాపన్నను పెంచింది. రాచరిక వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దార్లు సాగిస్తున్న అరాచకాలను చూసి కుపితుడై, కుల వృత్తిని కూడా వదిలిపెట్టి ప్రజల కోసం పోరుబాట పట్టాడు. అయితే అగ్రకుల పెత్తనాన్ని అణచాలంటే ఒక్కరితో సాధ్యం కాదని మొత్తం బహుజన కులాలను ఏకం చేశాడు. అందుకే స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాండ్లు, దూదేకుల పీర్ మహ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్‌లతో గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడీలపై, కోటలపై దాడి చేశాడు. సంపదను బహుజన పేదలకు పంచాడు. గడీల్లో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించాడు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

12 మందితో ప్రారంభమైన పాపన్న గౌడ్ సైన్యం పన్నెండు వేలకు చేరింది. చిన్న చిన్న సంస్థానాలను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరించాడు. ఖిలాషాపూర్‌లో పటిష్ఠమైన కోటను కట్టించాడు. వేలాదిమంది సైన్యంతో పాపన్న వరంగల్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం భువనగిరి ఖిల్లాను తన ఖాతాలో వేసుకున్నాడు. చివరికి మొఘల్ చక్రవర్తులకు కప్పం కడుతూ గోల్కొండకూ పాలకుడయ్యాడు. అయితే 1709 కొన్ని కారణాల వల్ల తాడికొండలో మొఘల్ సైన్యానికీ, పాపన్న యోధులకూ మధ్య భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఓడి వెనుకకు తగ్గాడు. చివరికి మొగలాయీ సైన్యాలకు చిక్కి మరణ దండనకు గురయ్యాడు.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా
(నేడు సర్వాయి పాపన్న వర్ధంతి)

గేట్లు తెరిస్తే... మునిగేది ఎవరు?

గత బీఆర్ఎస్ పార్టీ గేట్లు తెరచిన నాడు దూరిన సభ్యులే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే, ఆ పార్టీ లోంచి ఈ పార్టీలోకి దూరుతున్నారు. ఇలా దూరే వాళ్ళను దూరం పెడితేనే గెలిచిన పార్టీకి మనుగడ ఉంటుంది. లేదంటే, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ దుకాణం బందవుతదేమో గాని, వీళ్ల వల్ల కాంగ్రెస్ దుకాణం కూడా ఇప్పుడు కాకున్నా, కొంతకాలానికి బంద్ అవ్వుడు ఖాయం. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌కి వచ్చినట్టుగా, రేపు బీజేపీకి పరిస్థితులు అనుకూలిస్తే, ప్రభుత్వాన్ని కూలగొట్టే కుట్ర పన్నితే, బీజేపీ గేట్లు తెరిస్తే, ఈ సంచారులు కాంగ్రెస్‌ను వెన్నుపోటు పొడిచి బీజేపీలోకి దూరిపోతారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన నచ్చకనే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సమాజం అవకాశం ఇచ్చింది. గత పాలనలో ఉన్నవారే మళ్లీ తిరిగి ఈ ప్రభుత్వ పాలనలో భాగస్వాములను చేస్తే ప్రజలను వెర్రివాళ్లను చేసినట్లే కదా! ప్రజల ఆలోచనలను, నిర్ణయాలను, బేఖాతరు చేసి రాజకీయ పక్షాలు ఒకటై ప్రజలను బకరాలను చేస్తున్నాయి. ప్రజలు సైతం ఈ వ్యవహారాలను గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు సరియైన నిర్ణయం తీసుకొని ఇటువంటి సంచారులను ఇంటికి సాగనంపుతారు.

ప్రతి పార్టీకి ఒక సిద్ధాంతం ఉంటుంది. ఆ పార్టీ సభ్యులందరూ ఆ సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి. ప్రతి పార్టీకి ప్రత్యేక విధి విధానాలు ఉన్నప్పటికీ, ఆ పార్టీలను నడిపే అగ్రశ్రేణి నాయకులు సైతం వాటిని ఉల్లంఘిస్తున్నారు. గత చరిత్రను పరిగణనలోకి తీసుకోకుండానే తమ పార్టీలో చేరాలనుకుంటున్న ఇతర పార్టీల నాయకుల వద్దకు వెళ్లి మరీ సాదరంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకుంటున్నారు. పార్టీలు మారినవారికి పువ్వుల్లో పెట్టి టికెట్లు ఇచ్చేస్తున్నారు, వారిని గెలిచే గుర్రాలుగా పరిగణిస్తున్నారు. ఇలాంటి చర్యలు చూసి, ఎప్పటి నుండో పార్టీలో జెండాలు మోసిన వారు; తమ శ్రమను, సమయాన్ని, సంపదను పార్టీ కోసం వెచ్చించినవారు; నిరాశా నిస్పృహలకు గురి అవుతున్నారు. వారి విధేయతను, నిబద్ధతను, నిజాయితీని పార్టీ పెద్దలు విస్మరించడాన్ని తట్టుకోలేకపోతున్నారు. నిజమైన నాయకులను వెనకకు నెట్టి, ఇతర పార్టీలో ఉండి ఆర్థికంగా బలపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. వారికి సమాధానంగా 'ఎన్నికల్లో గెలవడానికి ఎంతో పెట్టుబడి అవసరం, అది మీ దగ్గర ఉన్నదా' అని అడుగుతున్నారు. వీరి వ్యవహార శైలి ఇలాగే కొనసాగితే సొంత పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తలు చూసి చూసి భగ్గున మండి, ఎదురు తిరిగే రోజులు వస్తాయి. అటు కార్యకర్తలు, పౌర సమాజం, ఇటు ప్రజలు, ఇలాంటి దుశ్చర్యలను గ్రహించి, ఎదురు తిరిగి ఉద్యమిస్తే, ఈ పార్టీల ఉనికికే ప్రమాదం.



ఎన్నికల్లో గెలవడానికి డబ్బే ప్రధానం అనుకున్న బీఆర్ఎస్ పార్టీ గతి ఏమయిందో అసెంబ్లీ ఎన్నికల్లో చూశాం. ప్రజలు డబ్బులు ఇస్తే తీసుకున్నారు, కానీ ఓటు ఎవరికి వేయాలో వారికే వేశారు. ఇకపై ఓటరు డబ్బులు తీసుకున్నా, అభ్యర్థి ఎలాంటి వాడు, ఏ గోడ దూకి వచ్చాడు, ఏ గేటు లోంచి వచ్చాడు, గతంలో అతడు ఒరగబెట్టిందేమిటి... ఇవన్నీ గమనించే ఓటు వేస్తారు.

కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కొనసాగిస్తున్న వ్యవహార శైలిని మార్చుకోకపోతే, వారు తవ్వుకున్న గొయ్యిలో వారే పడిపోతారు. ఇప్పటికైనా పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి, ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, ప్రజల నిర్ణయాన్ని ఖాతరు చేసి, నిజమైన ప్రజా పాలనను కొనసాగించగలిగితే పౌర సమాజ అండ ఆ పార్టీకి ఉంటుంది.

పౌర సమాజమే ఆ పార్టీని కాపాడుకుంటుంది. నిజాయితీగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, భేద భావాలు లేకుండా సమానత్వాన్ని పెంపొందిస్తూ, నిష్కల్మషంగా, ప్రజాహితం కోరుతూ, అభివృద్ధే లక్ష్యంగా, అవినీతి రహిత పాలన గనుక కొనసాగిస్తే, తెలంగాణలో ఇంకో పార్టీ అవసరమే ఉండదు. లేదంటే మరో కొత్త ప్రాంతీయ పార్టీకి కాంగ్రెస్‌వారే స్పేస్ ఇచ్చినవారవుతారు.

– సయ్యద్ రఫీ | చిత్ర దర్శకుడు

ఓర్పు – నేర్పు

మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకోగలిగిన వివేకవంతుడు మానవుడే. ఇతడు సద్గుణాలను గుర్తించగలడు. వాటిని అలవరచుకోగలడు కూడా. ఒక మనిషిలో ఎన్నెన్ని సద్గుణాలు ఉండటానికి అవకాశమున్నదో ప్రత్యక్షంగా చూపించిన మహనీయుడే శ్రీరామచంద్రుడు. రావణుని లోని దుర్గుణాలను దరిచేరనీయరాదు. శ్రీరాముడిలోని గుణాలను ఆదర్శంగా గ్రహించి, వాటిని అలవరచుకునేందుకు కృషి చేయాలి. **'రామాదివత్ వర్తితవ్యం న రావణాదివత్'** అంటూ మన వాఙ్మయం ఉద్బోధిస్తున్నది.

జ్యోతిర్మయం

మనిషి అలవరచుకోవలసిన సద్గుణాలలో ముఖ్యమైనది ఓర్పు. వదలవలసిన దుర్గుణాలలో మొదటిది కోపం. మనిషి, తన ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా, నియంత్రణ కోల్పోయి ఆగ్రహావేశాలకు లోనవుతాడు. యుక్తాయుక్త విచక్షణను కోల్పోతాడు. ఆ తర్వాత పూడ్చుకోలేనంత కష్టానికి, నష్టానికి గురవుతాడు. అయితే కోపానికి వశమయ్యే సందర్భాలు ఏర్పడినపుడే నేర్పుతో వ్యవహరించాలి. ఓర్పును అలవరచుకోవాలి. రాక్షస స్త్రీలు, రావణుడు తనను మాటిమాటికీ మాటలతో, చేష్టలతో బాధించినపుడే సీతమ్మతల్లి ఓర్పును వహించినది.

శాంతిని కాంక్షించే గాంధీజీ యొక్క అహింసా విధానం అతణ్ణి మహాత్ముణ్ణి చేసింది. లోకానికి ఆదర్శంగా నిలబెట్టింది. అందుకే త్యాగరాజులవారు ఎంతవారికైనా **'శాంతము లేక సౌఖ్యము లేదు'** అని పేర్కొన్నారు. ఆలోచన లేకుండా ఆవేశంతో తొందరపాటుతనంతో చేసే పనుల వల్ల ఆపదలు సంభవిస్తాయనీ, ఆలోచనతో సావధాన చిత్తులై పనులు చేసే వారికి సంపదలు తమంతట తాముగా వరిస్తాయనీ భారవి తెలిపాడు.

ఒకే సమయంలో ఓర్పుతో అనేక కార్యాలను సక్రమంగా నిర్వర్తించగలిగే నేర్పును అలవరచుకోవాలి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఓర్పును కలిగియుండాలి. ఆ యా సందర్భాలను, పరిస్థితులను మనకు అనుకూలంగా మరల్చుకునే నేర్పును ఓర్పుతో అలవరచుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

– సముద్రాల శఠగోపాచార్యులు



క్లుప్తంగా...

ఉత్పత్తి, రవాణాలో రికార్డుల 'సింగరేణి'

37 వేల కోట్ల టర్నోవర్‌లో రూ.3 వేల కోట్ల నికరలాభం అంచనా


ఎన్.బలరామ్

సింగరేణి (కొత్తగూడెం): తెలంగాణకు మణిహారమైన సింగరేణి తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం(2023–24)లో నిర్దేశించుకున్న 70.02 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ఛేదించి మహారత్న కంపెనీలకు దీటుగా నిలిచింది. దీంతో గడచిన ఏడేళ్లలో వెనకబడుతూ వచ్చిన లోటు తీరినట్లయింది. ఈసారి సాధించిన బొగ్గు ఉత్పత్తితో రూ.37 వేల కోట్ల టర్నోవర్ నమోదు కాగా, ఇందులో సుమారు రూ.3వేల కోట్ల నికర లాభం వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ ఏడాది 69.86 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాతో పాటు, 420.38 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించడం విశేషం.

ఏడు ఏరియాల్లో వంద శాతం

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు గాను ఏడు ఏరియాలు ఇల్లెందు, కొత్తగూడెం, ఆర్జీ–3, మణుగూరు, బెల్లంపల్లి, ఆర్జీ–1 ఆర్జీ–2 వంద శాతానికిపైగా ఉత్పత్తి సాధించాయి. మందమర్రి, శ్రీరాంపూర్, ఆండ్రియాల ప్రాజెక్ట్, భూపాలపల్లి ఏరియాల్లో వందశాతానికి తగ్గినప్పటికీ మొత్తంగా సింగరేణి వ్యాప్తంగా చూస్తే 100 శాతం ఉత్పత్తి నమోదైంది. 11 ఏరియాల్లోని 22 భూగర్భ గనుల్లో 72 శాతం, 18 ఓసీల్లో 104 శాతం ఉత్పత్తి సాధించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.

ఇక బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు: టీబీజీకేఎస్

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణిలో రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా గెలిచిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)కు ఇక నుంచి బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం ఉండదని, ఇతర యూనియన్ల మాదిరిగానే స్వతంత్రంగా వ్యవహరిస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి తెలిపారు. ఇటీవల గోదావరిఖనిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. యూనియన్ పునర్నిర్మాణానికి కృషి చేయాలని నిర్ణయించామన్నారు. మంగళవారం నుంచి సభ్యత్వాలు స్వీకరించి ఏరియాల వారీగా కమిటీలు నియమిస్తా మని చెప్పారు. ఆపై సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని రాజిరెడ్డి తెలిపారు.

విద్యుదుత్పత్తిలో దేశంలోనే రెండో ర్యాంక్

రికార్డు సృష్టించిన కేటీపీఎస్ ఏడో దశ

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం గత ఆర్థిక సంవత్సరంలో విద్యుదుత్పత్తిలో రికార్డు సృష్టించింది. 800 మెగావాట్ల సామర్థ్యం, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గల ఈ యూనిట్ దేశవ్యాప్తంగా రెండో స్థానంలో, టీఎస్ జెన్‌కో పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ యూనిట్‌లో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో 4211.3262 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించగా, 2023 – 24లో 6011.2766 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించింది. 2022 –23లో పీఎల్ఎఫ్ (ఉత్పాదక శక్తి సామర్థ్యం) 60.09 శాతం కాగా, 2023 –24లో 85.54 శాతంగా నమోదైంది. అంతేకాక ఏడాది మొత్తంలో ఏడు సార్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఇక కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారాల్లో మాత్రం విద్యుదుత్పత్తి నిరాశాజనకంగానే ఉంది. కాగా, ఏడో దశలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి నమోదు కావడంపై సీఈ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సహకారం, ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి వల్లే సాధ్యమైందని చెప్పారు.

స్తంభంపైనే షాక్‌తో విలవిల

కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం: విద్యుత్ వైర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తూ షాక్‌కు గురై యువకునికి తీవ్ర గాయాలైన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని చిన్నమల్లారెడ్డి శివారులో సోమవారం జరిగింది. లింగంపేటకు చెందిన సాయికుమార్ కామారెడ్డి మండలం సరంపల్లిలోని తన అమ్మమ్మ దగ్గర నివాసం ఉంటూ ట్రాన్స్‌కోలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్నాడు. లైన్‌మన్ రవీందర్ ఆధ్వర్యంలో సరంపల్లి– చిన్నమల్లారెడ్డి శివారులో సోమవారం విద్యుత్ తీగలను సరిచేస్తున్న క్రమంలో వాటికి దగ్గరగా 11 కేవీ, 33 కేవీ విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రమాదవశాత్తు షాక్ తగిలి సాయికుమార్ కొద్దిసేపు స్తంభంపైనే ఉండిపోయాడు. కిందకు దించి వెంటనే అతన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పరారీలో మాండ్ర శివానందరెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో శివానందరెడ్డిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు సోమవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఆయన ఇంటికి వచ్చారు. భూ కబ్జాకు సంబంధించిన కేసులో విచారణకు సహకరించాలని ఆయన్ని కోరారు. నోటీసులు ఇవ్వకుండా తాను సహకరించనని మాండ్ర చెప్పారు. దీంతో పోలీసులు నోటీసులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు శివానందరెడ్డి ఇంటికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలోనే శివానందరెడ్డి పోలీసుల కళ్లుగప్పి కారులో పరారయ్యారు. ఆయన్ని వెంబడించేందుకు ప్రయత్నించిన పోలీసుల్ని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసులు బయటికి వెళ్లకుండా ఆయన అనుచరులు గేట్లు మూసేశారు. దీంతో మాండ్ర తప్పించుకుని పారిపోయారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న సీసీఎస్ పోలీసులు నగరంలోని తారామతి బారాదారి వద్ద ఉన్న వెస్సెల్లా మెడోస్‌లోని శివానందరెడ్డి ఇంటిపై దాడిచేశారు. ఆయన భార్య ఉమాదేవిని, కుమారుడు కనిష్కరెడ్డిని అదుపులోకి తీసుకుని సీసీఎస్ కార్యాలయానికి తరలించారు. పరారీలో ఉన్న శివానందరెడ్డి కోసం పోలీసులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలోను ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో శివానందరెడ్డి సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తాను భూ కబ్జాలకు పాల్పడలేదని, కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇస్తే విచారణకు సహకరిస్తానని అందులో పేర్కొన్నారు.

బుద్వేల్‌లోని అసైన్డ్ భూములు కేంద్రంగా..

సీఐడీలో సైబర్ క్రైమ్ ఎస్పీగా పనిచేస్తూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న శివానందరెడ్డి 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన హైదరాబాద్ బుద్వేల్‌లోని అసైన్డ్ భూములు కేంద్రంగా పాల్పడిన నేరం బయటపడింది. రాజేంద్రనగర్ శివారులో ఉన్న ఈ ప్రాంతంలోని 282, 283, 284, 289 సర్వే నంబర్లలో 480 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని 1986లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్‌గా ప్రకటిస్తూ దళితులకు పంపిణీ చేసింది. అనంతర పరిణామాల నేపథ్యంలో 1997లో అప్పటి ప్రభుత్వం ఈ భూముల్ని వెనక్కి తీసుకుంది. దీన్ని సవాల్ చేస్తూ అసైనీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ పోరాటం తర్వాత అక్కడున్న అసైనీలతోపాటు అప్పటికే ఆ స్థలాల్లో ఉంటున్న వారికీ న్యాయం చేయాలని ఆదేశాలొచ్చాయి. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కో అసైనీకి 800 చదరపు గజాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వారికి విక్రయించే హక్కుల్ని మాత్రం ఇవ్వలేదు. దీంతో అసైనీలు విక్రయహక్కుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం మీద ఒక్కో అసైనీకి 800 చదరపు గజాల చొప్పున 66 మందికి, ఆ స్థలంలో ఉంటున్న ఒక్కొక్కరికి 400 చదరపు గజాల చొప్పున 82 మందికి ఇచ్చే ప్రయత్నాలు జరిగాయి.

భాగస్వాముల విభేదాలతో..

ఈ నేపథ్యంలో ఈ భూముల కోసం టి.జె.ప్రకాష్, కోనేరు గాంధీ, ఎస్.దశరథరామారావు రంగంలోకి దిగారు. అసైనీలుగా ఉన్న గుంటి నర్సింహులు తదితరులతో 69,200 చదరపు గజాల స్థలంపై అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నారు. వీరికి చెల్లింపులు చేయడానికి గూడూరు కృష్ణ, రవి రాంబాబు, ఎంసీహెచ్ రాఘవరావు తదితరుల నుంచి 2014, 2018ల్లో పెట్టుబడులు తీసుకున్నారు. ఆ సందర్భాల్లో సర్వే నంబర్లు 282, 289ల్లో ఉన్న స్థలం నుంచి కొంతభాగం వీరికి ఇచ్చేలా, అది అసైన్డ్ భూమి కావడంతో గరిష్ఠంగా 6 నెలల్లో ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు పొందేలా ఒప్పందాలు చేసుకున్నారు. 2022 నాటికీ ఈ తంతు పూర్తిగాకపోవడంతో భాగస్వాముల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో గూడూరు కృష్ణ, రవి రాంబాబు, ఎంసీహెచ్ రాఘవరావు తదితరులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో 2022 అక్టోబర్ 18న ప్రకాష్, గాంధీ, దశరథ్‌లపై నాలుగు కేసులు నమోదయ్యాయి.

వీటి దర్యాప్తులో ఆయన పాత్ర వెలుగులోకి..

ఈ 4 కేసుల దర్యాప్తులో శివానందరెడ్డితో పాటు ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు డైరెక్టర్లుగా ఉన్న కంపెనీ పాత్ర వెలుగులోకి వచ్చింది. 2015–16లో రంగంలోకి దిగిన శివానందరెడ్డి తాను బయటకు రాకుండా టి.జె.ప్రకాష్, కోనేరు గాంధీ, ఎస్.దశరథరామారావులను ముందుపెట్టి కథ నడిపారు. ఆ భూముల్ని తన కంపెనీ పేరుతో రాయించుకోవడంతోపాటు రాత్రికిరాత్రే అనుమతి జీవోలు తెప్పించుకున్నారని వెలుగులోకి వచ్చింది. పట్టాలు కూడా అసైనీలకు ఇవ్వకుండా, లేఔట్ కూడా వేయకుండా వారిని భయపెట్టి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తిచేసినట్లు పోలీసులు గుర్తించారు. గజం కనిష్ఠంగా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు సొంతం చేసుకున్నట్లు బయటపడింది. ఇది వెలుగులోకి రావడంతో కేసులు మరో మలుపు తిరిగాయి. ఈ వ్యవహారంలో అప్పటి కొందరు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తేలింది. జనవరిలో కోర్టు అనుమతితో సీసీఎస్ పోలీసులు శివానందరెడ్డికి చెందిన వెస్సెల్లా గ్రూప్ కార్యాలయాల్లోను, ఆయన ఇంట్లోను సోదాలు చేశారు. పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 26 ఎకరాల అసైన్డ్ భూముల్ని చేజిక్కించుకున్న శివానందరెడ్డి.. వెస్సెల్లా గ్రూప్ పేరిట 400 చదరపు గజాలు (5 వేల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా), 800 చదరపు గజాల (10 వేల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా) విస్తీర్ణంలో లగ్జరీ విల్లాలు నిర్మిస్తామని ప్రచారం చేయడమేగాక ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో చదరపు అడుగుకి రూ.10 వేల చొప్పున అనేకమంది నుంచి అడ్వాన్సులు సైతం వసూలు చేశారని ఈ డాక్యుమెంట్ల ఆధారంగా గుర్తించారు.

హైకోర్టును ఆశ్రయించిన శివానందరెడ్డి, భార్య, కుమారుడు

తమపై సీసీఎస్ పోలీసులను బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కరెడ్డి సోమవారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారు లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. శివానందరెడ్డిపై దాఖలైన కేసు వివరాలు తెలుసుకుని రావాలంటూ ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ.. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం విచారణ జరిగే వరకు శివానందరెడ్డిని అరెస్టు చేయవద్దని పోలీసులకు స్పష్టం చేశారు. ఒకవేళ ఇప్పటికే అరెస్టు చేస్తే.. వ్యక్తిగత బాండ్లపై విడుదల చేయాలని పేర్కొన్నారు. అయితే పిటిషనర్లు ఎట్టి పరిస్థితుల్లోను సీసీఎస్ పోలీసులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

కడియం కావ్యకే వరంగల్ టికెట్

- అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ
- నేడు కరీంనగర్, హైదరాబాద్ అభ్యర్థుల ప్రకటన?
- ఖమ్మం సీటుపై వీడని చిక్కుముడి



సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య బరిలో నిలవనున్నారు. అనేక కసరత్తుల అనంతరం కావ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ నుంచి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలవనున్న అభ్యర్థుల ఖరారుపై కాంగ్రెస్ అధిష్టానం మరోసారి చర్చలు జరిపింది. ఇప్పటికే రాష్ట్రంలో 13 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా... మిగిలిన నాలుగు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై సోమవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులపై ఏకాభిప్రాయానికి వచ్చారు. సోమవారం రాత్రి వరంగల్ అభ్యర్థి పేరును ఖరారు చేస్తూ ప్రకటన విడుదల కాగా మిగతా రెండు స్థానాల అభ్యర్థుల పేర్లను మంగళవారం ప్రకటించే అవకాశం ఉంది. కాగా ఆశావాహులు ఎక్కువగా ఉన్న ఖమ్మం లోక్‌సభ స్థానంపై పీఠముడి ఇంకా వీడలేదు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ఖమ్మం స్థానంపై మరోసారి చర్చించాలని నిర్ణయించారు.

తుక్కుగూడ సభ ఏర్పాట్లపై చర్చ

ఈ నెల ఆరో తేదీన తుక్కుగూడలో జరుగనున్న కాంగ్రెస్ మహా సభ ఏర్పాట్లపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మేనిఫెస్టో విడుదలకు సంబంధించిన అంశాలతో పాటు ఆ సభలో రాహుల్‌గాంధీ పాల్గొంటున్న నేపథ్యంలో సభ ఏర్పాట్ల ప్రణాళికపై చర్చించారు.

నెలాఖరులోగా అందరికీ రైతుబంధు

రుణమాఫీపై ఆర్‌బీఐతో చర్చిస్తున్నాం: తుమ్మల

ఖమ్మం వన్‌టౌన్: ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులందరికీ రైతుబంధు అందించామని, మిగిలిన వారికి సైతం ఈ నెలాఖరులోగా సాయం అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణ – ఏపీ సరిహద్దులో అశ్వారావుపేటకు సమీపాన పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి ఆలయాన్ని సోమవారం సందర్శించిన ఆయన మొక్కు చెల్లించారు. ఈ సందర్భంగా అక్కడే మీడియాతో మంత్రి పలు అంశాలపై మాట్లాడారు. రైతుబంధు సీలింగ్‌పై అసెంబ్లీలో చర్చించాక నిర్ణయం తీసుకుంటామని తుమ్మల తెలిపారు. వచ్చే వ్యవసాయ సీజన్ నుండి పంట వేసిన రైతులకే పెట్టుబడి సాయం ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇక రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలుపై ఆర్‌బీఐతో పాటు బ్యాంకర్లతో చర్చిస్తున్నామని.. ఒకేసారి రుణమాఫీ చేసేలా విధివిధానాలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, వరిధాన్యానికి రూ.500 బోనస్ వచ్చే పంట సీజన్ నుంచి ఇచ్చేలా ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. కాగా, పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లకు వెంటనే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. ఆ తర్వాత 37 ఏళ్ల క్రితం తనకు భోజనం పెట్టిన రైతు చెరుకూరి సత్యనారాయణ ఇంటికి వెళ్లిన తుమ్మల ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


చెరుకూరి సత్యనారాయణతో మాట్లాడుతున్న తుమ్మల

వేధింపుల సంస్థలా ఈడీ

▶ మొదటి పేజీ తరువాయి

రోజూ సమన్లు ఇవ్వడం ఈడీకి సంతోషంగా ఉంటున్నట్టుంది..'' అని పేర్కొన్నారు. ఈడీది ప్రత్యేక సామ్రాజ్యమన్నట్టు, కోర్టుకు, రాజ్యాంగానికి అతీతమన్నట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు.

కవితను అరెస్టు చేయాల్సిన అవసరమేంటి?

ఈడీ విచారణకు కవిత సహకరించారని, ఆమెను అరెస్టు చేసి ఉండాల్సిన అవసరమే లేదని సింఘ్వి పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉన్న కారణంగానే కవిత ఈడీ విచారణకు హాజరుకాలేదని వివరించారు. ''ఇదేమైనా హత్య కేసా? పీఎంఎల్ఏ సెక్షన్ 19ను ఐపీసీ సెక్షన్ 302లా చూపుతున్నారు. కవిత సమాజంలో పేరున్న మహిళ. ప్రకటిత నేరస్తురాలు కాదు. ఆమె ఎక్కడికీ పారిపోరు..'' అని స్పష్టం చేశారు. ఈడీ సమన్లు ఇచ్చిన తర్వాత ఎన్ని ప్రశ్నలు వేశారు? ఇంకా ఎన్ని మిగిలిఉన్నాయో చెప్పాలని కోరారు. అరుణ్‌పిళ్లై స్టేట్‌మెంట్లు విభిన్నంగా ఉన్నాయని.. ఈడీ దాఖలు చేసిన చార్జిషీటు, అదనపు చార్జిషీటులో నిందితురాలుగా గానీ, ముద్దాయిగా గానీ కవిత పేరు ఎక్కడా లేదని వివరించారు. కాగా.. కవితకు బెయిల్ ఇవ్వొద్దని ఈడీ తరఫున జోహెబ్ హుస్సేన్ కోర్టును కోరారు. కవిత బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలంటూ ఈడీ తరఫున కౌంటర్ దాఖలు చేశారు. దీనితో కవిత తరఫున న్యాయవాది సింఘ్వి.. ఈడీ కౌంటర్‌పై రిజాయిండర్‌ను ఈ నెల 3 కల్లా దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. దీనితో విచారణను న్యాయమూర్తి ఈ నెల 4వ తేదీకి వాయిదా వేశారు.

కవితకు ఇంటి భోజనం, పుస్తకాలు ఇవ్వండి..

తనకు అందించాల్సిన సౌకర్యాలపై కోర్టు ఆదేశాలు ఇచ్చినా.. జైలు అధికారులు పాటించడం లేదంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారు. కవితకు ఇంటి భోజనం, పుస్తకాలు, మెడిటేషన్ చేసుకొనేందుకు జపమాల, బూట్లను అనుమతించాలని తాజాగా ఆదేశాలు ఇచ్చారు.

అది 'కారు'చిచ్చే!

▶ మొదటి పేజీ తరువాయి

తెలియకుండా ఉండేలా ప్రభాకర్‌రావు బృందం అనేక జాగ్రత్తలు తీసుకుంది. వారంతా కేవలం వాట్సాప్, సిగ్నల్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్స్ ద్వారానే సంప్రదింపులు జరిపేవారు. ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు తన నమ్మినబంటు ప్రణీత్‌రావును స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) నిర్వహణ కోసమే తీసుకువచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పనిచేయడం, ప్రతిపక్షాలను ముప్పతిప్పలు పెట్టడానికి నేతలతోపాటు వారి అనుచరులనూ టార్గెట్ చేయడం, అక్రమ నిఘాతో సున్నిత సమాచారం సేకరించి అవకాశమున్న ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌లో చేరేలా చేయడం వంటివే వారి టార్గెట్.

నగదు రవాణాను గుర్తించి..: ప్రభాకర్‌రావు, ఆయన బృందం ప్రధానంగా ప్రతిపక్షాలకు చెందిన నగదు రవాణాపై దృష్టి పెట్టింది. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున భవ్య సిమెంట్ కంపెనీకి చెందిన ఆనంద్ ప్రసాద్ పోటీచేశారు. ఆ సమయంలో ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు రంగంలోకి దిగి.. ఆనంద్ ప్రసాద్ సంబంధీకుల నగదు రవాణాపై నిఘా పెట్టారు. ఆ వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధాకిషన్‌రావుకు అందించారు. ఈయన ఆదేశాలతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్యారడైజ్ వద్ద రూ.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 2020లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ప్రణీత్‌రావు.. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సంబంధీకులపై నిఘా పెట్టి వివరాలను రాధాకిషన్‌రావుకు చేరవేశారు. ఫలితంగానే సిద్దిపేటలో చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించే రఘునందన్‌రావు బంధువు నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.కోటి స్వాధీనం చేసుకున్నారు. 2022 అక్టోబర్ రెండోవారంలో మునుగోడు ఉప ఎన్నిక జరిగింది. అప్పట్లో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంబంధీకులపై ప్రణీత్‌రావు సాంకేతిక నిఘా ఉంచారు. నగదు రవాణా అంశాన్ని గుర్తించి రాధాకిషన్‌రావుకు తెలిపారు. ఈయన ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం తనిఖీలు చేసి.. కోమటిరెడ్డి అనుచరులైన జి.సాయికుమార్‌రెడ్డి, ఎం.మహేందర్, ఎ.అనూష్ రెడ్డి, వి.భరత్‌ల నుంచి రూ.3.5 కోట్లు స్వాధీనం చేసుకుంది'' అని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. రాధాకిషన్‌రావు నుంచి మరిన్ని కీలక విషయాలు రాబట్టడం కోసం తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరింది.

'ఆరోగ్యశ్రీ' బకాయిలు చెల్లించండి

- రూ. 900 కోట్లు ప్రభుత్వం నుంచి రావాలి
- వెంటనే విడుదల చేయాలని సీఎంకు నెట్‌వర్క్ ఆస్పత్రుల వినతి
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరతో భేటీ



సాక్షి, హైదరాబాద్: 'ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల కు రాష్ట్ర ప్రభుత్వం రూ.900 కోట్ల మేర బకాయి పడింది. అవి పేరుకుపోవడంతో ఆరోగ్యశ్రీ రోగులకు చి కిత్స చేయలేని పరిస్థితి నెలకొందని' తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ చెప్పారు. సోమవారం ఆ సంఘం తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించింది. దానికి సంబంధించిన వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అందజేసింది. అన్ని ఆస్పత్రులు ఐదారు నె లలుగా సిబ్బంది జీతాలు, ఇతరత్రా చెల్లింపులు చేయలేని పరిస్థితికి చేరాయని, దీంతో పేద రోగులకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేని పరిస్థితిలో ఉన్నామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించి నప్పుడు పథకం చాలా పకడ్బందీగా కొనసాగిందని, చికిత్సల ప్యాకేజీ సొమ్ము ఇప్పటివరకు సవరణ చేయలే దన్నారు. తక్కువ ప్యాకేజీల కారణంగా ఆస్పత్రులను నడ పలేని స్థితికి చేరుకున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్యాకేజీని సవరించాలని కోరారు. రోగి డిశ్చార్జ్ అయిన 2 నుంచి 4 వారాలలోపు చెల్లింపులను క్లియర్ చేయడానికి గ్రీన్‌చానల్ అప్‌గ్రేడ్ చేయాలని వారు సీఎంను కోరారు.

నా ఫోన్ ట్యాప్ చేశారు

- కేసీఆర్, కేటీఆర్‌పై సీపీకి కాంగ్రెస్ నేత మహేందర్‌రెడ్డి ఫిర్యాదు


సీసీఎస్ కార్యాలయం వద్ద మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం

హిమాయత్‌నగర్: గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సిరిసిల్లలో వార్ రూం ఏర్పాటు చేసి తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీ ఆర్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తన రాజకీయ కదలిక లను తెలుసుకునేందుకు తనకు సహకరిస్తున్న వ్యక్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి పలు ఆధారాలను కూడా సీపీకి అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంతంలో ఏర్పాటైన ఫోన్ ట్యాపింగ్ సెంటర్‌కు సంబంధించి కేటీఆర్‌కు విచారణ నోటీసులు జారీ చేయాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ అసలైన దోషులు ఎంతటి పెద్దలైనా వదిలిపెట్టకుండా, నిజాలు నిగ్గు తేల్చాలని సీపీని కోరినట్లు కేకే మహేందర్ రెడ్డి వెల్లడించారు.

కన్నారావు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల తేజేశ్వరరావు అలియాస్ కన్నారావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమ వారం కొట్టివేసింది. అబ్దుల్లాపూర్ మండలం మన్నెగూడ వద్ద 2 ఎకరాల ప్రైవేట్ భూమిని కబ్జా చేశారంటూ మార్చి 3న ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కన్నారావుపై పోలీసులు హత్యాయత్నం, నేరపూరిత చొరబాటు, నష్టం కలిగించడం, పేలుడు పదార్థాలను ఉపయోగించడం, అల్లర్లకు పాల్పడినందుకు కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలు అవాస్తవమని.. తనపై హత్యాయత్నం, భూ ఆక్రమణ ఆరోపణలపై ఆదిబట్ల పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గతంలో కన్నారా వు హైకోర్టును ఆశ్రయించగా, ఆయన దాఖలు చేసిన పిటిషన్ గత నెల 20న కొట్టివేసింది. దీంతో ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మరోసారి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ జి.రాధా రాణి.. కన్నారావు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

విద్యుత్ అంతరాయాలు లేకున్నా అసత్యప్రచారం

- ఆందోళన వ్యక్తం చేసిన తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు, అంతరాయాలు లేకున్నా ఉన్నట్లు అసత్యప్రచారం చేస్తుండటంతో విద్యుత్ ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతింటోందని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) ఆందోళన వ్యక్తంచేసింది. రాష్ట్రంలో జరిగిన పలు సమావేశాల్లో వినియోగదారుల వైపు నుంచి లోపాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా, విద్యుత్ శాఖపై నెపం వేస్తున్నారని తప్పుబట్టింది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతున్న సందర్భంగా ప్రైవేటు జనరేటర్ ద్వారా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయన రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మింట్ కాంపౌండ్‌లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) కార్యాలయంలో సోమవారం చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు నేతృత్వంలో జేఏసీ సమావేశమై ఈ అంశంపై చర్చించింది. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అహర్నిశలు కృషిచేస్తున్న విద్యుత్ సంస్థలు, అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందిపై అసత్యప్రచారాన్ని మానుకోవాలని కోరింది. తప్పుడు ప్రచారంతో క్షేత్రస్థాయిలోని సిబ్బందిపై పైస్థాయి అధికారుల నుంచి ఒత్తిళ్లు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేసింది. రాష్ట్రంలో గతేడాది 15,497 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నెలకొని ఉండగా, ఈ ఏడాది ఇప్పటికే 15,623 మెగావాట్లకు దాటిందని గుర్తు చేసింది. భవిష్యత్‌లో మరింతగా డిమాండ్ పెరిగినా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తామని స్పష్టంచేసింది.

కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

- పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వరికోతలు పూర్తయిన అన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రారంభమైందని, రబీ (యాసంగి) సీజన్‌లో 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. గత సంవత్సరం రబీ సీజన్‌లో 7,037 కొనుగోలు కేంద్రాల ద్వారా 66.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈసారి 75.4 ఎల్ఎంటీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధర గ్రేడ్–ఎ వరికి రూ. 2,203, సాధారణ గ్రేడ్ రూ. 2,183కు కొనుగోలు చేస్తామన్నారు. ఇంతకన్నా తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించవద్దని, రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించకూడదని సూచించారు. రైస్ మిల్లర్లు, వ్యాపారులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన ప్రాంతాల్లో మార్చి 30వ తేదీ వరకు 121 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చౌహాన్ వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సమస్యలపై రైతులు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు 1967, 1800 4250 0333కు కాల్ చేయవచ్చునని పేర్కొన్నారు.

ఈశాన్యం ఎవరి వశం!

క్రమంగా విస్తరిస్తున్న బీజేపీ

- 11 సీట్లలో 2019లో 5 కైవసం
- ఈసారీ వాటిని నిలుపుకునే చాన్స్
- తగ్గుతూ వస్తున్న కాంగ్రెస్ ప్రభ
- ఒక్క సీటే రావచ్చంటున్న సర్వేలు
- పలు రాష్ట్రాల్లో స్థానిక పార్టీల హవా



సెవెన్ సిస్టర్స్‌గా పేరొందిన ఈశాన్య రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తక్కువగానే ఉన్నప్పటికీ, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఏడు రాష్ట్రాలతో పాటు సిక్కింను సోదర రాష్ట్రంగా వ్యవహరింటారు. భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్, చైనాలతో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి ఇప్పుడిప్పుడే జోరందుకుంటోంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీలదే హవా. కొన్నేళ్లుగా జాతీయ పార్టీలు వాటికి తీవ్రంగా పోటీ ఇస్తున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలతో ఈశాన్యంలో పాగా వేసింది. అయితే ఇటీవలి మణిపూర్ మారణ కాండ నేపథ్యంలో సమీకరణాలు మారుతున్నాయి...

మణిపూర్.. కాంగ్రెస్‌కు షాక్

మణిపూర్లో అసెంబ్లీతో పాటు లోక్‌సభ స్థానాల్లోనూ పట్టు నిలుపుకుంటూ వస్తున్న కాంగ్రెస్‌కు 2019లో తొలిసారి షాక్ తగిలింది. ఇక్కడి రెండు సీట్లలో ఓటమి పాలైంది. ఒకటి బీజేపీ, మరోటి ప్రాంతీయ పార్టీ నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్)కు గెలుచుకున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగిరింది. 60 సీట్లకు గాను బీజేపీ 32 స్థానాలు కైవసం చేసుకుని సొంతంగా మెజారిటీ దక్కించుకుంది. ప్రాంతీయ పార్టీలైన ఎన్పీఎఫ్, ఎన్పీపీ, లోక్ జనశక్తి పార్టీలతో కలిసి బీరేన్ సింగ్ సీఎంగా ఎన్డీఏ సర్కారు కొలువుదీరింది. గతేడాది కుకీ, మెయితీ తెగల మధ్య చెలరేగిన ఘర్షణలు దేశమంతటా ప్రకంపనలు సృష్టించాయి. అత్యాచారాలు, సజీవ దహనాలతో మణిపూర్ అట్టుడికింది. ఇప్పటికీ పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ప్రభుత్వం అల్లర్ల బీజేపీ నివారణలో విఫలమైందని, మోదీ కనీసం ఒక్కసారైనా పర్యటించలేదంటూ విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి.



నోట్: ఈశాన్య రాష్ట్రాల్లో 14 లోక్‌సభ సీట్లున్న అసోంపై విడిగా కథనం అందిస్తాం

2019లో ఏ పార్టీకి ఎన్ని?

మొత్తం సీట్లు 11
అరుణాచల్ ప్రదేశ్ - 2 (బీజేపీ 2)
మణిపూర్ - 2 (బీజేపీ 1, ఎన్పీఎఫ్ 1,)
మేఘాలయ - 2 (కాంగ్రెస్ 1, ఎన్పీపీ 1)
మిజోరం - 1 (ఎంఎన్ఎఫ్ 1)
నాగాలాండ్ - 1 (ఎన్డీపీపీ 1)
త్రిపుర - 2 (బీజేపీ 2)
సిక్కిం - 1 (ఎస్‌కేఎం 1)

మేఘాలయ... బీజేపీకి అందని ద్రాక్ష

ఇక్కడా ప్రాంతీయ పార్టీల హవాయే సాగుతోంది. కాంగ్రెస్ పోటీ ఇస్తున్నా బీజేపీ పెద్దగా సోదిలో లేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అంతే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్పీపీ చెరో సీటు గెలవగా బీజేపీ ఖాతా తెరవలేదు. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగేలా కన్పిస్తోంది. ఇక మిజోరంలో ఏకైక లోక్‌సభ స్థానం ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్ మధ్య చేతులు మారుతోంది. 2019లో ఎంఎన్ఎఫ్ గెలిచింది. నాగాలాండ్‌లో ఏకైక లోక్‌సభ సీటును 2004, 2014ల్లో నాగాలాండ్ పీపుల్స్ పార్టీ గెలుచుకుంది. 2019లో నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ గెలిచింది. ఈసారి ఎన్పీపీ కూడా గట్టి పోటీ ఇస్తోంది.

త్రిపుర.. కమ్యూనిస్టుల కోట బద్దలు

ఈ కమ్యూనిస్టుల కంచుకోటలో ఎట్టకేలకు కాషాయ జెండా ఎగిరింది. 1998 నుంచి 2018 దాకా రాష్ట్రాన్ని సీపీఎం నేత మాణిక్ సర్కార్ ఏలారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 60 ఎమ్మెల్యే సీట్లలో 36 స్థానాలు దక్కించుకుని బిప్లవ్ కుమార్ దేవ్ తొలి బీజేపీ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ రెండు సీట్లలోనూ బీజేపీ చేతిలో సీపీఎం ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త ప్రభావం చూపుతున్నా లోక్‌సభ పోరులో మాత్రం పూర్తిగా వెనకబడింది.

అరుణాచల్‌లో బీజేపీ పాగా

కాంగ్రెస్ కంచుకోట అయిన ఈ రాష్ట్రంలో ఎట్టకేలకు కమలనాథులు పాగా వేశారు. ఇక్కడ లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. 2004 నుంచి 2014 దాకా రాష్ట్రంలో కాంగ్రెసే అధికారాన్ని చేజిక్కించుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రెండు సీట్లనూ 2004లో బీజేపీ, 2009లో కాంగ్రెస్ నెగ్గాయి. 2014లో చెరో సీటు దక్కించుకున్నాయి. 2019 మాత్రం మోదీ సునామీ ఈశాన్యాన్ని కూడా ముంచెత్తింది. దాంతో అరుణాచల్ పూర్తిగా బీజేపీ ఖాతాలో చేరింది. రెండు లోక్‌సభ సీట్లతో పాటు అసెంబ్లీలోనూ ఎన్డీఏ పాగా వేసి కాంగ్రెస్ (యూపీఏ) సుదీర్ఘ పాలనకు తెరదించింది. 60 సీట్ల అరుణాచల్ అసెంబ్లీలో ఎన్డీఏ భాగస్వాములు బీజేపీ 41 సీట్లు, జేడీయూ 7, నేషనల్ పీపుల్స్ పార్టీ 5 గెలుచుకున్నాయి. పెమా ఖండూ సీఎంగా తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ సర్కారు కొలువుదీరింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పోలింగ్‌కు ముందే ఖాతా తెరిచింది. సీఎం పెమా ఖండూతో సహా 10 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2019లో కూడా ఖండూతో పాటు ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. ఈసారి మొత్తం 60 సీట్లలోనూ బీజేపీ బరిలో ఉంది.

సిక్కింలో లోకల్ హవా

ఈ బుల్లి రాష్ట్రంలో కూడా లోక్‌సభతో పాటు అసెంబ్లీకీ ఎన్నికలు జరుతున్నాయి. ఇక్కడ లోకల్ పార్టీలదే పూర్తి హవా. దేశంలోనే అత్యంత సుదీర్ఘకాలం సీఎం పదవిలో కొనసాగిన రికార్డు దక్కించుకున్న (1994 నుంచి 2019 వరకు, 5 సార్లు) పవన్ కుమార్ చామ్లింగ్‌కు గత ఎన్నికల్లో షాక్ తగిలింది. ప్రేమ్ సింగ్ తమాంగ్ నేతృత్వంలోని సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) చేతిలో చామ్లింగ్ పార్టీ సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్డీఎఫ్) ఓటమి చవిచూసింది. లోక్‌సభ సీటు కూడా ఎస్‌కేఎం వశమైంది. దాంతో ఈసారి పోరు ఆసక్తికరంగా మారింది.

సర్వేలు ఏమంటున్నాయి...

అరుణాచల్, త్రిపురల్లోని 4 సీట్లూ బీజేపీవేనని, మణిపూర్‌లో బీజేపీ, కాంగ్రెస్ చెరోటి, మిజోరంలో జెడ్పీఎం, నాగాలాండ్‌లో ఎన్డీపీపీ, సిక్కింలో ఎస్‌కేఎం, మేఘాలయలో ఎన్పీపీకి 2 సీట్లు దక్కుతాయని సర్వేలు అంచనా వేస్తున్నాయి. అదే జరిగితే బీజేపీ ఈశాన్యంలో తన 5 సీట్లను నిలబెట్టుకోనుంది. కాంగ్రెస్ ఒక స్థానాన్ని చేజార్చుకోనుంది.

రెండు విడతల్లో పోలింగ్

అసోం మినహా ఈశాన్య రాష్ట్రాల్లో 11 లోక్‌సభ స్థానాలున్నాయి. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, త్రిపురలో రెండేసి, మిజోరం, నాగాలాండ్, సిక్కింలో ఒక్కో సీటు ఉన్నాయి. అరుణాచల్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర వెస్ట్, ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గాల్లో తొలి విడత (ఏప్రిల్ 19) ఎన్నికలు జరగనున్నాయి. త్రిపుర ఈస్ట్, ఔటర్ మణిపూర్‌లో రెండో దశలో (ఏప్రిల్ 26) పోలింగ్ నిర్వహించనున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సోమవారం స్థానికంగా పర్యటించారు. ఓ టీ కొట్టు వద్ద ఇలా చాయ్ చేయడంతో పాటు కప్పుల్లో పోసి అందరికీ అందించి సందడి చేశారు.

ఎలక్షన్ బీట్

ఛింద్వారాలో కాంగ్రెస్‌కు షాక్

భోపాల్(మధ్యప్రదేశ్): లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ నేత, మాజీ సీఎం కమల్ నాథ్ కంచుకోట ఛింద్వారాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఛింద్వారా మేయర్ విక్రమ్ అహాకే అధికార బీజేపీలో చేరారు. ఛింద్వారాలో కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. గత వారం, కమల్ నాథ్ సన్నిహితుడిగా పేరున్న ఛింద్వారాకే చెందిన అమర్వాడా కాంగ్రెస్ ఎమ్మెల్యే కమ్లేశ్ షా బీజేపీలో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ నకుల్ నాథ్. ఈ స్థానం నుంచి గతంలో కమల్ నాథ్ తొమ్మిది పర్యాయాలు విజయం సాధించారు. కమల్ నాథ్ ప్రస్తుతం ఛింద్వారా ఎమ్మెల్యేగా ఉన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సోమవారం ఎన్నికల కమిషన్‌ను కోరింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి నేతృత్వంలోని బీజేపీ బృందం రాహుల్‌పై ఈసీకి ఫిర్యాదు అందజేసింది. ఆదివారం ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ.. 'ఈసారి లోక్‌సభ ఎన్నికలకు మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది. ఎన్నికల కమిషన్‌లో కేంద్రం తన వాళ్లను నియమించుకుంది. ఎన్నికల తర్వాత రాజ్యాంగం కూడా మారిపోతుంది' అని అన్నారని మంత్రి గుర్తు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని కూడా ఈసీని కోరినట్లు తెలిపారు.

ఘోష్, శ్రీనేత్‌లకు ఈసీ చీవాట్లు

న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్‌లను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం గట్టిగా మందలించింది. ఇకపై వారి ప్రసంగాలను నిశితంగా గమనిస్తామని హెచ్చరించింది. నియమావళిని పాటించేలా చూడటంతోపాటు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీలకు సూచించింది. బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌పై సుప్రియ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ఘోష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.

రూ.25 కోట్లు ఇస్తామన్నారు: ఆప్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: బీజేపీలో చేరితే రూ.25 కోట్లు ఇస్తామంటూ ఆ పార్టీ నేతలు ఆశ చూపారని ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే రితురాజ్ ఝా సోమవారం ఆరోపించారు. మరో 10 మంది ఆప్ ఎమ్మెల్యేలను కూడా తీసుకురావాలని అడిగారన్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని నాశనం చేయాలని బీజేపీ భావిస్తోందని ఆయన ఆరోపించారు. ''ఆదివారం దరియాపూర్‌లో కొందరు వ్యక్తులు నన్ను కలిశారు. ఆప్‌ను వీడి బీజేపీలో చేరితే నాకు రూ.25 కోట్లు ఇస్తామని చెప్పారు. మరో 10 మంది ఎమ్మెల్యేలను తీసుకు రావాలని, తలా రూ.25 కోట్లు ముట్టజెబుతామని, నాకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారు'' అన్నారు.

ఐదున కాంగ్రెస్ మేనిఫెస్టో

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఈ నెల ఐదో తేదీన లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయనుంది. ''ప్రజలతో విస్తృత సంప్రదింపుల అనంతరం మేనిఫెస్టో రూపొందించాం. 5న విడుదల చేస్తాం. ఆరో తేదీ జైపూర్, హైదరాబాద్‌లలో భారీ సభలు నిర్వహించనున్నాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం వెల్లడించారు.

మైసూరు మహారాజుకు సొంతిల్లు లేదట!

బెంగళూరు: బీజేపీ టికెట్‌పై మైసూరు–కొడగు లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్న మైసూరు రాచ కుటుంబ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్‌కు సొంతిల్లు కూడా లేదట! తనకు భూములు, వాహనం కూడా లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.5 కోట్ల విలువైన ఆస్తులున్నాయని, భార్యకు రూ.1.04 కోట్ల ఆస్తి, కుటుంబంలోని మరో సభ్యునికి రూ.3.64 కోట్ల ఆస్తి ఉందని తెలిపారు. తన బంగారు, వెండి ఆభరణాల విలువ రూ.3.39 కోట్లు కాగా, తన భార్యకు రూ.1.02 కోట్ల విలువైన నగలున్నాయని పేర్కొన్నారు.

పేదలకు ఫారిన్ విస్కీ, బీరు ఉచితం

మహారాష్ట్రలో ఏజీఎంపీ అభ్యర్థి విచిత్ర హామీ

చంద్రాపూర్: ఎన్నికల్లో ఉచిత హామీల జాబితాలోకి తాజాగా మద్యం కూడా వచ్చి చేరింది! తనను గెలిపిస్తే పేదలకు ఎంపీ నిధులతో బీరు, ఫారిన్ విస్కీ సరఫరా చేస్తానని మహారాష్ట్రలో చంద్రాపూర్ అభ్యర్థి, అఖిల భారతీయ మానవతా పార్టీ నేత వనితా రౌత్ వింతైన హామీలిస్తున్నారు. ఊరూరా బార్ తెరిపిస్తానని, ఎంపీ నిధులతో ఉచితంగా బీరు, విదేశీ విస్కీ సరఫరా చేస్తానని చెప్పుకుంటున్నారు. మద్యానికి రేషనింగ్ విధానాన్ని అమలు చేస్తానని, మందు బాబులతోపాటు విక్రేతలకు కూడా లైసెన్సు ఉండాలన్నారు. రోజంతా శారీరక కష్టం చేసే పేదలు, చీపుగా దొరికే లిక్కర్ మితిమీరి తాగి ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నారు. అందుకే, అలాంటి వారికోసం విదేశీ విస్కీ, బీరు అందజేయాలనుకుంటున్నానన్నారు. యుక్త వయస్కులకే మందు తాగేందుకు లైసెన్సు ఇవ్వాలన్నారు. మద్యం తాగడం పట్ల సమాజంలో అపోహలను తొలగిస్తానని వనిత చెప్పారు. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేసిన వనిత, ఇలాంటి హామీలనే ఇవ్వడంతో అధికారులు డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వలేదు. అయినప్పటికీ, ఆమె తీరు మాత్రం ఈసారి కూడా మారలేదు.

డీఎంకే రెండు నాల్కల ధోరణి: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: కచ్చతీవు ద్వీపాన్ని కాంగ్రెస్ హయాంలో శ్రీలంకకు అప్పగించారంటూ ఆరోపించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఈ అంశంపై డీఎంకేపైనా సోమవారం విమర్శల వాన కురిపించారు. ''దీనిపై ఓవైపు నిరసనలు చేసి, మరోవైపు శ్రీలంకకు ఇవ్వడంలో అభ్యంతరం లేదనడం ద్వారా తమిళనాడు ప్రయోజనాలను డీఎంకే పణంగా పెట్టింది. తద్వారా రెండు నాల్కల ధోరణి బయట పెట్టుకుంది'' అని తూర్పారబట్టారు.

అరుణాచల్‌లోని మరో 30 ప్రాంతాలకు చైనా పేర్లు

బీజింగ్: అరుణాచల్ ప్రదేశ్‌లో మరో 30 ప్రాంతాలకు చైనా తమ పేర్లతో జాబితా విడుదల చేసింది. అరుణాచల్‌ను జాగ్నాన్ అని చైనా పిలుస్తుండటం, అది దక్షిణ టిబెట్ భాగమని వాదిస్తుండటం తెలిసిందే. చైనా తాజా చర్యను భారత్ తోసిపుచ్చింది. ''అరుణాచల్ భారత్‌లో విడదీయరాని భాగం. కొత్త పేర్లు పెట్టినంత మాత్రాన అది మారదు'' అని వ్యాఖ్యానించింది.



హేలీ తరహా తోకచుక్క ఒకటి ప్రస్తుతం వినువీధిలో కనువిందు చేస్తోంది. దీని పేరు

వినువీధిలో కనువిందు చేస్తున్న మదర్ ఆఫ్ డ్రాగన్స్

12పీ/పోన్స్–బ్రూక్స్. పెద్ద తోకను తలపించే ధూళి మేఘంతో మెరిసిపోతుంది గనుక ఖగోళ శాస్త్రవేత్తలు దీన్ని మదర్ ఆఫ్ డ్రాగన్స్ అనే ముద్దుపేరుతో పిలుచుకుంటారు. హేలీ మాదిరిగానే ఇది దాదాపుగా 71 ఏళ్లకు ఓసారి భూమిపై నుంచి కన్పిస్తుంది. ఈ తోకచుక్క ప్రస్తుతం భూమికి అతి సమీపంగా సాగిపోయే క్రమంలో ఉత్తరార్ధ గోళం నుంచి స్పష్టంగా కన్పిస్తోంది. ఏటా నవంబర్ చివరి నుంచి డిసెంబర్ మధ్య దాకా సాగే అంతరిక్షంలో జరిగే వార్షిక ఉల్కా పాతాలకు ఇదే మూలకారణం. అందుకే దీన్ని 'డెవిల్ కామెట్' అని కూడా పిలుస్తుంటారు. ఈ తోకచుక్క మంచు, ధూళి, రాళ్లమయం. సూర్యునికి సమీపంలోకి వచ్చినప్పుడల్లా మంచు వాయువుగా మారి ఉపరితలం మీది ధూళితో కలిసి మేఘంలా మారి బయటికి వెళ్లిపోతుంది. ఆ క్రమంలో దానికి అతి పెద్ద తోకలా కన్పిస్తుంటుంది. ధూళి మేఘం ఆకృతిని బట్టి ఈ తోకచుక్క భూమి నుంచి ఒక్కోసారి అతి ప్రకాశవంతంగా, మరోసారి కనీకనిపించనట్టుగా దర్శనమిస్తుంది. దీన్ని పరిశోధించి తోకచుక్కలకు, సౌరవ్యవస్థ వికాస క్రమానికి సంబంధించి మరిన్ని ఆసక్తికరమైన కొత్త సంగతులు కనిపెట్టే పనిలో సైంటిస్టులు ప్రస్తుతం బిజీగా ఉన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల వేళ కఠిన చర్యలు తీసుకోబోం

కాంగ్రెస్‌కు ట్యాక్స్ డిమాండ్ నోటీసులపై సుప్రీంకోర్టుకు తెలిపిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. తుది తీర్పు వచ్చేదాకా రూ.3,500 కోట్ల ఆదాయ పన్ను చెల్లింపుల బకాయిల కోసం ఆ పార్టీపై కఠిన చర్యలకు దిగబోమని ఐటీ విభాగం సోమవారం కోర్టుకు తెలిపింది. దాంతో విచారణను జులై 24వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. కాంగ్రెస్‌కు ఐటీ శాఖ అంతటి భారీ ఐటీ డిమాండ్ నోటీసులను ఎందుకు జారీచేయాల్సి వచ్చిందో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అంతకుముందు కోర్టుకు వివరించారు. ''కట్టాల్సిన దాంట్లో 20 శాతం చెల్లించాలన్న ఆఫర్‌ను కాంగ్రెస్ సద్వినియోగం చేసుకోలేదు. అందుకే 2021కు సంబంధించి రూ.135 కోట్లను రికవర్ చేశాం. నిబంధనల ప్రకారమే పాత రూ.1,700 కోట్ల కోసం నోటీసులు ఇచ్చాం'' అని తెలిపారు.

కోర్టులో ఉపశమనంపై కాంగ్రెస్ హర్షం వెలిబుచ్చింది. ''పన్నుల పేరిట ఉగ్రవాదానికి పాల్పడుతున్న ఏ రాజకీయ పార్టీనీ మేం గతంలో కోర్టుల వేదికగా ఎదుర్కోలేదు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. కోర్టు జోక్యంతో ఇప్పుడు ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య ఇప్పుడు సరైన పోటీ వాతావరణం మళ్లీ నెలకొంది'' అని పేర్కొంది.

తిహార్ జైలుకు కేజ్రీవాల్

15దాకా జ్యుడీషియల్ కస్టడీ ● జైలు వద్ద ఆప్ కార్యకర్తల నిరసన



రౌస్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ విధానంలో అక్రమాల కేసులో ఈడీ అరెస్ట్ చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ కోర్టు ఈనెల 15వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 21న ఈడీ అరెస్ట్‌చేశాక మార్చి 28వ తేదీదాకా ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ సిటీ కోర్టు స్పెషల్ జడ్జి కావేరీ బవేజా ఉత్తర్వులు జారీచేయడం తెల్సిందే. తమ విచారణలో కేజ్రీవాల్ ఏమాత్రం సహకరించట్లేదని, మరికొంతకాలం తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరడం, అందుకు కోర్టు సమ్మతిస్తూ ఏప్రిల్ ఒకటో తేదీదాకా కస్టడీని పొడిగించడం తెల్సిందే. ఏప్రిల్ ఒకటిన కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ఆయనను జడ్జి బవేజా ఎదుట ఈడీ అధికారులు హాజరుపరిచారు. విచారణకు సహకరించని ఆయనను 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించారు. ఈ వాదనతో ఏకీభవిస్తూ ఏప్రిల్ 15వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు. కేజ్రీవాల్‌ను రౌజ్ అవెన్యూ కోర్టుకు తీసుకొచ్చినప్పుడు ఆప్ మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్, కేజ్రీవాల్ భార్య సునీత అక్కడికొచ్చారు. '' కస్టడీలో ఈడీ 11 రోజులపాటు ప్రశ్నించింది. ఇంక ప్రశ్నించాల్సింది ఏమీ లేదు. ఆయనను ఇంతవరకు కోర్టు దోషిగా ప్రకటించలేదు. మరి అలాంటప్పుడు జైలుకు ఎందుకు పంపించారు?. లోక్‌సభ ఎన్నికల కోసమే బీజేపీ ఆయనను జైలుకు పంపింది'' అని సునీతా ఆరోపించారు. పార్టీలో సునీతా అత్యత 'క్రియాశీలక' పాత్ర పోషించనున్నట్లు ఆప్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఆదివారం ఢిల్లీలో రాంలీలా మైదాన్‌లో విపక్షాల ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో పాల్గొనడం ద్వారా సునీతా ఒక రకంగా రాజకీయ అరంగేట్రం చేసినట్లేనని ఆప్ వర్గాలు చెబుతున్నాయి. '' ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఉదంతంలో కేజ్రీవాల్ కీలక పాత్రధారి. లబ్ధిదారులకు లాభం చేకూరేలా మద్యంపాలసీ రూపకల్పన, అమలులో ఈయన ప్రత్యక్ష పాత్ర పోషించారు. మద్యం పాలసీని అమలుచేయకముందే క్విడ్ ప్రో ద్వారా తమకు రావాల్సిన నగదును కిక్‌బ్యాక్ రూపంలో పొందారు'' అని ఈడీ తన రిమాండ్ దరఖాస్తులో ఆరోపించింది.

మూడు పుస్తకాలు, ఔషధాలు, లాకెట్..

జడ్జి ఉత్తర్వుల అనంతరం కేజ్రీవాల్‌ను తిహార్ జైలుకు తరలించారు. కేజ్రీవాల్‌ను జైలుకు తరలిస్తున్నారన్న వార్త తెలిసి ఆప్ కార్యకర్తలు భారీ సంఖ్యలో తిహార్ జైలుకు చేరుకుని 'నేనూ కేజ్రీవాల్' అని టీ–షర్ట్‌లు ధరించి, ఆప్ జెండాలు పట్టుకుని ఆందోళన చేపట్టారు. రెండో నంబర్ జైలులో కేజ్రీవాల్‌ను ఉంచే అవకాశముంది. వైద్య పరీక్షలు చేస్తున్నాం. తర్వాత ఆయనను ఒంటరిగా ఒక గదిలో ఉంచనున్నారు. గదిలో ప్రతిరోజూ 24 గంటలపాటు సీసీటీవీ పర్యవేక్షణ కొనసాగనుంది. అనారోగ్యం దృష్ట్యా సంబంధిత ఔషధాలు, ప్రత్యేక ఆహారాన్ని ఆయనకు అందించనున్నారు. మతవిశ్వాసాన్ని గౌరవిస్తూ ఒక లాకెట్ ధరించేందుకు ఆయనకు అనుమతి లభించింది. భగవద్గీత, రామాయణం, నీరజా చౌదరి రాసిన ' హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాలనూ అనుమతించారు.

ఉదయం ఆరున్నరకు దినచర్య మొదలు

కేజ్రీవాల్ దినచర్య మిగతా విచారణఖైదీల్లాగే ఉదయం ఆరున్నర గంటలకు మొదలుకానుంది. ఉదయం చాయ్, బ్రెడ్ అల్పాహారంగా ఇవ్వనున్నారు. కోర్టులో కేసు విచారణ ఉంటే కోర్టుకు తీసుకెళ్తారు. లేదంటే 10.30 నుంచి 11 మధ్యలో లంచ్ వడ్డిస్తారు. పప్పు, కూరగాయలు లేదంటే ఐదు చపాతీలు లేదా అన్నం వడ్డిస్తారు.తర్వాత మూడు గంటల దాకా గదిలోనే ఉంచుతారు. మూడున్నరకు టీ, బిస్కెట్లు అందిస్తారు. నాలుగు గంటలకు తమ లాయర్లను కలిసేందుకు అనుమతిస్తారు. 5.30గంటలకే డిన్నర్ వడ్డిస్తారు. ఏడింటికల్లా గదికి పంపించి తాళం వేస్తారు. టీవీ సదుపాయం కల్పిస్తారు. వైద్య, సహాయక సిబ్బంది 24 గంటలూ అందుబాటులోఉంటారు. వారానికి రెండుసార్లు కుటుంబసభ్యులను కలవొచ్చు. ఆప్ నేత సంజయ్ సింగ్‌ను గతంలో ఈ సెల్‌లోనే ఉంచారు. ఇటీవల ఐదో నంబర్ జైలుకు మార్చారు. ఢిల్లీ మాజీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను ఒకటో నంబర్ జైలులో, బీఆర్ఎస్ నేత కె.కవితను ఆరో నంబర్ మహిళా జైలులో ఉంచారు.

శిథిలాల దిబ్బగా అల్ షిఫా ఆస్పత్రి

డెయిర్ అల్ బలాహ్: నిత్యం వేలాది మందికి వైద్య సేవలందించే గాజాలోనే అతిపెద్ద ఆస్పత్రి అల్–షిఫా శిథిలాల దిబ్బగా మారిపోయింది. దాదాపు రెండు వారాల పాటు ఆస్పత్రిపై యథేచ్ఛగా దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్ ఆర్మీ(ఐడీఎఫ్) ఆస్పత్రి పరిసరాల నుంచి సోమవారం వైదొలిగింది. ఆస్పత్రి భవనాన్ని నామరూపాల్లేకుండా నేలమట్టం చేయడంతో పాటు పరిసరాల్లోని పలు భవంతులను కూడా కూల్చివేసిందని స్థానికులు తెలిపారు. అక్కడంతా మృతదేహాలే పడున్నాయన్నారు. వాటినుంచి దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. ఐడీఎఫ్ నిరంతర దాడుల నేపథ్యంలో రోగులను అల్–అహ్లి ఆస్పత్రికి తరలించారు. దక్షిణ గాజాలోని నాసిర్ ఆస్పత్రిని ప్రారంభించాలని గాజా ఆరోగ్య శాఖ అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది.

200 మంది మిలిటెంట్లు హతం

ఆస్పత్రిలో దాగున్న సుమారు 200 మంది మిలిటెంట్లను హతం చేయడంతోపాటు హమాస్ కీలక నేతలు సహా 900 మంది మిలిటెంట్లను పట్టుకున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెద్ద సంఖ్యలో ఆయుధాలను, కీలక డాక్యుమెంట్లు, నిఘా సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పింది. దాడులు ప్రారంభమైన సమయంలో ఆస్పత్రిలో సుమారు ఆరువేల మంది ఉన్నారని, వీరిలో ఎక్కువ మంది తలదాచుకునేందుకు వచ్చిన సామాన్య పౌరులేనని చెప్పింది. ఆస్పత్రి కేంద్రంగా హమాస్ మిలిటెంట్లు కార్యకలాపాలు సాగిస్తున్నందునే దాడులు జరిపినట్లు చెప్పుకుంది. హమాస్, ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్లు తిష్ట వేసినందునే ఆస్పత్రి వార్డుల్లో కూడా దాడులు జరపాల్సి వచ్చినట్టు తెలిపింది. ఇవి ముున్ముందూ కొనసాగుతాయని చెప్పింది.

సిరియాలోని ఇరాన్ ఎంబసీపై ఇజ్రాయెల్ దాడులు

ఏడుగురి దుర్మరణం

దమాస్కస్: సిరియా రాజధాని దమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై సోమవారం ఇజ్రాయెల్ విమానం ద్వారా బాంబుదాడి చేసింది. ఈ దాడిలో రాయబార కార్యాలయంలోని కాన్సులర్ విభాగాన్ని నేలమట్టం చేసింది. రెవల్యూషనరీ గార్డ్స్ సీనియర్ కమాండర్, బ్రిగేడియర్ జనరల్ మహ్మద్ రెజా జహేది మృతి చెందారు. ఇరాన్ రాయబారి హుస్సేన్ అక్బరీ మొత్తం ఏడుగురు చనిపోయారని వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడిని ఖండించారు. ఇజ్రాయెల్.. లక్ష్యం దిశగా పలు మిస్సైళ్లను సంధించిందని.. తమ ఎయిర్ డిఫెన్స్ వీటిలో కొన్నింటిని ధ్వంసం చేసిందని, మిగతావి ఇరాన్ రాయబార కార్యాలయాన్ని నేలమట్టం చేశాయని సిరియా రక్షణ శాఖ తెలిపింది.

బంగ్లాదేశ్‌లో జోరుగా... 'బాయ్‌కాట్ ఇండియా'

భారత ఉత్పత్తులకు వ్యతిరేకంగా ఉద్యమం

మద్దతిస్తున్న విపక్ష బీఎన్పీ ● ఉద్యమాన్ని తప్పుబడుతున్న ప్రధాని హసీనా



భారత చీరలంటే తనకిష్టమంటూ చీరను ప్రదర్శిస్తున్న హసీనా

ఢాకా: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాలుగో విడత ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టాక సామాజిక మాధ్యమాల్లో భారత వ్యతిరేక ప్రచారం ఊపందుకుంది. చీరలు, సుగంధ ద్రవ్యాలు వంటి భారత ఉత్పత్తుల్ని బాయ్‌కాట్ చేయాలన్న ప్రచారానికి ప్రతిపక్ష నేతలు మద్దతిస్తున్నారు. భారత ఉత్పత్తులతో నిండిపోయే ఢాకా మార్కెట్‌లో కొంతకాలంగా వంటనూనె, ప్రాసెస్డ్ ఫుడ్స్, కాస్మెటిక్స్, దుస్తులు వంటి వాటి విక్రయాలు పడిపోయాయి. హసీనాను, ఆమె అవామీ లీగ్ పార్టీని అతిపెద్ద భారత ఉత్పత్తులుగా ప్రతిపక్ష బీఎన్పీ నేతలు అభివర్ణిస్తుండగా ప్రధాని హసీనా భారత వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు. తనకెంతో ఇష్టమైన చీరలతోనే ప్రత్యర్థి వాదనను ఆమె ఎదుర్కొంటున్నారు. భారత ఉత్పత్తుల్ని బాయ్‌కాట్ చేయాలని ప్రతిపక్ష బీఎన్పీ నేతలు నిజంగా భావిస్తున్నట్లయితే పార్టీ ఆఫీసు ఎదురుగా వాళ్ల భార్యల చీరలకు ఎందుకు నిప్పుపెట్టడం లేదు? అని ప్రశ్నించారు. బీఎన్పీ నేతలు, వారి భార్యలు భారత్‌లో చీరలు కొనుక్కొచ్చి, బంగ్లాదేశ్‌లో అమ్ముకుంటున్నారన్నారు. 'గరం మసాలా, అల్లం, వెల్లుల్లి, ఉల్లి తదితర ఎన్నో దినుసుల్ని భారత్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. బీఎన్పీ నేతలు భారత సుగంధ ద్రవ్యాలు వాడకుండా వంట చేయగలరా?' అని హసీనా నిలదీశారు. అలా తినగలమని వారు సమాధానం చెప్పగలరా అని అన్నారు. ప్రజల నుంచి దూరమైన ఆ పార్టీ భారత వ్యతిరేక ప్రచారాన్ని ఎగదోస్తోందని హసీనా అన్నారు.

భారత వ్యతిరేక ఆన్‌లైన్ ప్రచారం యూరప్, అమెరికాల్లో ఉన్న బంగ్లాదేశీయులతో ముందుగా మొదలైంది. పారిస్‌లో ఉంటున్న పినాకీ భట్టాచార్య భాయ్‌కాట్ ఇండియా ప్రచారంలో కీలకంగా ఉన్నారు. మొదట్లో ప్రతిపక్ష బీఎన్పీ నేతలు ఇందులో లేరు. తర్వాతర్వాత ప్రజల్లో మద్దతు సంపాదించేందుకు వారూ ఈ ప్రచారంలో తోడయ్యారు.

సాక్షి
కరీంనగర్

మంగళవారం । 2 ఏప్రిల్ । 2024



క్వింటాల్ పత్తి రూ. 7,450

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి రూ. 7,450 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గగూలోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ(సా॥)	సహర్ బుధ(ఉ॥)
కరీంనగర్	6.28	4.39
పెద్దపల్లి	6.35	4.48
రాజన్న సిరిసిల్ల	6.35	4.48
జగిత్యాల	6.35	4.46

గరిష్టం/కనిష్టం
40.0/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. రాత్రి చల్లగా ఉంటుంది.

మండే సూరీడు



రోజురోజుకూ ఎండలు ముదిరిపోతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. సాయంత్రం 5గంటలైనా వేడి తగ్గడంలేదు. జిల్లాలో ఆదివారం 40.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా సోమవారం 41 డిగ్రీలు నమోదయింది.



ఎవరికీ పట్టని ఫ్రీలెఫ్ట్!

అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలు

- కరీంనగర్ సిటీలో స్తంభిస్తున్న ట్రాఫిక్.. వాహనదారుల వాగ్వాదం
- విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పులు
- నేటికీ విస్తరణకు నోచుకోని బస్టాండ్, ప్రతిమ కూడళ్లు
- అర కిలోమీటరులో బస్టాండ్, ప్రతిమ, గీతాభవన్ జంక్షన్లు!



కోర్టు చౌరస్తాలో సిగ్నల్స్ వద్ద ఎడమవైపు వెళ్లకుండా ముందుకు వచ్చి అడ్డంగా ఉన్న వాహనదారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలు ఆశించినంత మేరకు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. నగరంలోని పలు చోట్ల కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తిస్థాయిలో వాహనాలను నియంత్రించలేకపోతున్నాయి. పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టినా.. వాహనదారుల్లో పలువురికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన లేక పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతోంది. ఒకప్పుడు పోలీసులు ఉండాల్సిన అవసరం లేకుండా నగరంలోని ముఖ్య జంక్షన్ల వద్ద రూపొందించిన రౌండ్ ఎబౌట్స్‌లోనే సిగ్నళ్లు వచ్చి చేరాయి. కానీ, నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనరద్దీ, వాహనదారులకు ఫ్రీ లెఫ్ట్‌పై అవగాహన లేకపోవడం ట్రాఫిక్ జామ్ సమస్యకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. మరికొన్ని చోట్ల జంక్షన్లు ఇరుకుగా మారడం వల్ల ట్రాఫిక్ సజావుగా సాగకుండా ఆగుతూ.. సాగుతూ మిగిలినవారికి చికాకు కలిగిస్తోంది.

అర కిలోమీటరులో మూడు జంక్షన్‌లా?

బస్టాండ్, ప్రతిమ, గీతాభవన్ చౌరస్తాలు.. ఈ మూడు చౌరస్తాల మధ్య దూరం అరకిలోమీటరు కూడా ఉండదు. కానీ, ఈ మూడు చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఉదాహరణకు కోతిరాంపూర్ నుంచి వచ్చే ఒక వాహనదారుడు కోర్టు వైపు వెళ్లాలంటే.. కమాన్, బస్టాండ్, ప్రతిమ, గీతాభవన్, కోర్టు జంక్షన్లను దాటాల్సి ఉంటుంది. ప్రతీ చోట వాహనదారులు 30 సెకండ్ల నుంచి 60 సెకండ్ల పాటు ఆగాల్సి ఉంటుంది. అందులోనూ బస్టాండ్, ప్రతిమ, గీతాభవన్ జంక్షన్ల వద్ద వాహనదారులు ఆగాలంటే విసుగు చెందుతున్నారు. పైగా ఎండాకాలం కావడంతో అన్నిచోట్లా ఆగాలంటే.. బైకు మీద ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. నానా కష్టాలు పడి బస్టాండ్ జంక్షన్ దాటామో లేదో.. వెంటనే ప్రతిమ జంక్షన్,... దాన్నీ దాటామనుకునే లోపు.. గీతాభవన్ జంక్షన్ వస్తుంది. వేములవాడ, సిరిసిల్ల వైపు వెళ్లే వాహనదారులు చాలామందికి ఫ్రీ లెఫ్ట్ అవగాహన లేక రెడ్‌సిగ్నల్ పడగానే.. గీతాభవన్ జంక్షన్‌లో వాహనాలు నిలుపుతున్నారు. ఫలితంగా ఒక్కోసారి ఆ వాహనాలు ప్రతిమ జంక్షన్ వరకు నిలవాల్సిన పరిస్థితి. రద్దీ సమయాల్లో ఈ మూడు జంక్షన్ల మధ్య బైకులకు, కార్లకు ఎక్కడా మూడో గేర్ కూడా వేయాల్సిన అవసరం రాదంటే అతిశయోక్తి కాదు. అలాగే కోర్టు చౌరస్తా, ఎస్సారార్ చౌరస్తాలోనూ వాహనదారులు ఫ్రీ లెఫ్ట్ వెళ్లే వారికి అవకాశం ఇవ్వడం లేదు.



మల్టీప్లెక్స్ చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ వెళ్లడానికి వీలు లేకుండా అడ్డుగా ఉన్న వాహనదారులు, కరెంట్ స్తంభం, ఫుట్‌పాత్‌తో ఇరుకుగా ఉన్న రోడ్డు

ఫ్రీ లెఫ్ట్ అంటే తెలియదా?

నగరంలో చాలామందికి ఫ్రీ లెఫ్ట్ అంటే తెలియదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఏ కూడలిలోనైనా ఎడమవైపు వెళ్లేవారు రెడ్‌సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లేందుకు పోలీసులే వెసులుబాటు కల్పించారు. దీంతో వారు వేచిచూడాల్సిన అవసరం ఉండదు. ఫ్రీ లెఫ్ట్ అమలులో భాగంగా కరీంనగర్ పోలీసులు ఈ విషయంలో స్పష్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రతీ కూడలి వద్ద ట్రాఫిక్ కోన్స్, రోప్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సజావుగా సాగేలా రోడ్డును విభజించారు. కానీ, ఫ్రీ లెఫ్ట్ మీద అవగాహలేని పలువురు వాహనదారులు కుడివైపు వెళ్లాల్సిన వారు ఫ్రీ లెఫ్ట్ స్థానంలో వాహనాలు నిలుపుతున్నారు. ఈ క్రమంలో ఫ్రీ లెఫ్ట్ వెళ్లాల్సిన వారు ముందు వాహనాలు నిలిపిన వారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. ఇలాంటి వివాదాలు విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫ్రీ లెఫ్ట్‌పై వాహనదారులకు అవగాహన కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

తాగునీటి కొరత రావొద్దు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కరీంనగర్: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి కొరత రాకుండా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా గ్రామాల వారీగా కలెక్టర్లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా ఉన్న బోర్‌వెల్స్, వ్యవసాయ బావులను తాగునీటి అవసరాలకు వాడుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని, రైతులకు మద్దతు ధర కల్పించే విషయంలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

జూన్ 10లోగా రూపురేఖలు మారాలి

జూన్ 10లోగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి తీర్చిదిద్దాలని అధికారులకు శాంతికుమారి సూచించారు. ఈ అంశంలో కలెక్టర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. పాఠశాలల్లో తాగునీటి సరఫరా, టాయిలెట్స్, అదనపు భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే చోట తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వడదెబ్బ బారిన పడిన వారికి తక్షణం వైద్య సేవలందించాలని, తర్వాత హాస్పిటల్‌కు తరలించాలని సూచించారు. ఎండలో అత్యవసర పనులకు వెళ్లే వారు క్యాప్, గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఏవో శ్రీనివాస్, డీఈవో జనార్దన్‌రావు, డీపీవో రవీందర్, పౌరసరఫరాల డీఎం రజనీకాంత్, డీసీఎస్ గౌరీశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

చొప్పదండి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం మండలంలోని వెదురుగట్టులో ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభించి ధాన్యం తేమ శాతం పరిశీలించారు. వరి పంట దాదాపు చేతికి వచ్చే సమయంలో ఉందని, కోసిన వెంటనే రైతులు తేమ శాతం పరిశీలించాకే కేంద్రాలకు తరలించాలని కోరారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఏవో శ్రీనివాస్, డీసీఎస్‌వో గౌరీశంకర్, సివిల్ సప్లై డీఎం రజనీకాంత్, అదనపు డీఆర్‌డీవో సునీత, ఏవో వంశీ, డీటీలు ఉషా, కమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఓటరు అవగాహనకు ప్రత్యేక సమావేశాలు



స్వయం సహాయక సంఘాలతో కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాల ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, సభ్యులు, వారి కుటుంబసభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఒకవేళ లేకుంటే వారికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్లు తొలగింపు, చిరానామా మార్పిడిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అందుకోసం ఓటర్లకు అవగాహన కల్పించి కరీంనగర్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. మహిళా సంఘాల ప్రత్యేక సమావేశాల్లో ఓటరు అవగాహనపై జరిగిన చర్చల వివరాలను తీర్మానాల రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో మెప్మా పీడీ బి.రవీందర్, టీఎంసీ ఎం.అనిత, పద్మ, సునీత్, స్వప్న, తిరుపతి, దీప, సీవోలు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాలు విడుదల

- 5లోగా అడ్మిషన్ ఫాం తీసుకోవాలి

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ మంగతాయారు విడుదల చేశారు. ప్రొవిజనల్ సెలెక్ట్ లిస్టు ద్వారా అర్హులైన 80 మంది విద్యార్థుల రూల్ నంబర్‌లను ప్రకటించారు. అలాగే ఫలితాలు నవోదయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని, ఎంపికైన విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్‌టికెట్, దరఖాస్తు సమయంలో హెచ్‌ఎం సంతకంతో అప్‌లోడ్ చేసిన ఒరిజినల్ పత్రం తీసుకొని ఈ నెల 5లోగా విద్యాలయం నుంచి అడ్మిషన్ ఫాం పొందాలని సూచించారు.

తొమ్మిదో తరగతి ఫలితాలు

విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గత ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను కూడా ప్రిన్సిపాల్ విడుదల చేశారు. 319617, 320343, 319357, 320209, 320043 హాల్ టికెట్ నంబర్లు గల ఐదుగురు విద్యార్థులు తొమ్మిదో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 5లోగా హాల్‌టికెట్టు, ఆధార్ కార్డుతో హాజరై విద్యాలయంలో అడ్మిషన్ దరఖాస్తు తీసుకోవాలని సూచించారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

కరీంనగర్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధులకు ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాల్సిందేనని డీఈవో జనార్దన్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు సెయింట్ జాన్ పాఠశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. లేకుంటే ప్రభుత్వ పరీక్షల విధానం రూల్(25) ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ కనికరం లేకుండా వ్యవహరిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, వారికిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు ఎకరాకు రూ.15,000, కౌలు రైతులకు రైతుబంధు ఏమైందని ప్రశ్నించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేసిందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పంట నష్టం జరిగిందని, ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సాయినీ మల్లేశం, రంగు భాస్కర్‌చారి, అధికార ప్రతినిధులు అలివేలు సమ్మిరెడ్డి, జానపట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులను కడుపున పెట్టుకొని కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వరద కాలువ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు(చొప్పదండి): ప్రతీ రైతును కాంగ్రెస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకొని కాపాడుకుంటుందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం రామడుగు మండలం షానగర్ వద్ద వరదకాలువ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి విడుదలతో రామడుగు, గంగాధర, బోయినపల్లి మండలాల్లో వరదకాలువ వెంట చివరి దశలో ఉన్న వరి పంటలను రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. కాగా సాగునీటి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, వారు అధికారులతో చర్చించి నీటి విడుదల చేసినందుకు రైతుల పక్షాన ఎమ్మెల్యే ధన్యావాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, నాయకులు బొమ్మరవేని తిరుపతి, బండపెల్లి యాదగిరి, పుల్కం గంగయ్య, పుల్కం నర్సయ్య, సైండ్ల నర్సింగం, పులి లక్ష్మీపతిగౌడ్, సల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తులు

పాహిమాం పరమేశ్వరా..

వేములవాడ: ఎములాడ రాజన్నకు సెలవుల రద్దీ మొదలైంది. శివకల్యాణోత్సవాలు ఆదివారంతో ముగియడంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవలను పునఃప్రారంభించారు. దీంతో పెద్ద ఎత్తున అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు ఊపందుకున్నాయి. సోమవారం రాజన్నను 35 వేల మంది భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు. మండుతున్న ఎండల కారణంగా భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

- మూల్యాంకనంపై నిర్లక్ష్యం వద్దు
- తప్పులు చేస్తే షోకాజ్ నోటీసులు, జరిమానా



కరీంనగర్: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ఈనెల 3 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్ హైస్కూల్‌లో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం కొనసాగనుంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 563 మంది ఏఈలు, 94 మంది సీఈలు, 230 మంది ప్రత్యేక సహాయకులుగా ఉపాధ్యాయులను నియమించారు. అసిస్టెంట్ కోడింగ్ అధికారులుగా 8 మంది, కోడింగ్ సహాయకులుగా మరో 60 మందిని నియమించారు. డీఈవో, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ స్ట్రాంగ్‌రూమ్ ఇన్‌చార్జీగా, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

తప్పిదాలకు పాల్పడితే..

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో తక్కువ సమయంలో ఎక్కువ జవాబు పత్రాలు మూల్యాంకనం చేసి డబ్బులు దండుకోవాలనే వారిపై కొరడా ఝుళిపించనున్నారు. దీంతో ఉపాధ్యాయులు స్పాట్ అంటేనే జంకుతున్నారు. ఏడాది పొడవునా కష్టపడి చదివి పరీక్ష రాసిన విద్యార్థులకు కొంత మంది గురువులు మూల్యాంకనంలో చేసే తప్పిదాలతో నష్టం వాటిల్లుతుంది. పరీక్షలు బాగా రాసినా మార్కులు తగ్గడం, ఫెయిల్ కావడం వంటి ఘటనలు గతంలో వెలుగుచూశాయి. విద్యార్థులు తమకేన్ని మార్కులు వచ్చాయో, చేసిన తప్పిదాలేంటో తెలుసుకునేందుకు ఎస్సెస్సీ బోర్డు జవాబు జిరాక్స్ పత్రాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో తప్పులు దిద్దినట్లు నిర్ధారణ అయితే విద్యార్థి నేరుగా కోర్టుకు వెళ్లవచ్చు. స్పాట్ వాల్యుయేషన్‌లో ఉపాధ్యాయులు తప్పిదాలకు పాల్పడితే నోటీసులు జారీ చేయడం, ఎక్కువ తప్పిదాలకు పాల్పడితే జరిమానా విధించడం, అవసరమైతే వారిని శాశ్వతంగా మూల్యాంకనం నుంచి తప్పించడం లాంటి నిర్ణయాలు కూడా తీసుకునే అధికారం ఉంది. దీంతో పలువురు ఉపాధ్యాయులు స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్లకుండా ఉండటమే మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు.

జిల్లాకు 2.20 లక్షల జవాబుపత్రాలు

ఇతర జిల్లాలకు చెందిన 2.20లక్షల జవాబు పత్రాలు స్థానిక సెయింట్ జాన్ పాఠశాలలోని మూల్యాంకన కేంద్రానికి చేరుకుంటున్నాయి. పటిష్ట బందోబస్తు మధ్య అధికారులు వాటిని కోడింగ్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. స్పాట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు ఈనెల 2 నుంచి తాము పనిచేసే పాఠశాలల నుంచి రిలీవ్ అయి 3న ఉదయం 8.30 గంటలకు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జరిమానా ఇలా..

పదో తరగతి మూల్యాంకనంలో తప్పిదాలు చేసే ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసు, జరిమానాలు విధిస్తారు. ఒకటి నుంచి 5 తప్పిదాలు చేసిన ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు, ఆరు నుంచి 10 తప్పిదాలు చెస్తే ఎగ్జామినర్లకు రూ.500, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.200 విధిస్తారు. 11 నుంచి 20 తప్పిదాలు చేసిన ఎగ్జామినర్లకు రూ.1,000, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.500, అలాగే 21 నుంచి 30 తప్పిదాలు చేసిన ఎగ్జామినర్లకు రూ.1,500, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.700 జరిమానా వేస్తారు. 30కి పైగా తప్పిదాలు చేసిన ఎగ్జామినర్లకు రూ.2,000, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.1,000 జరిమానా విధించడంతో పాటు భవిష్యత్తులో మూడేళ్ల పాటు మూల్యాంకనం విధులను వారికి అప్పగించరు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



పదో తరగతి మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాలను సజావుగా దిద్దేందుకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను సమకూర్చాం. స్పాట్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు మధ్య జవాబు పత్రాలను దిద్దుతారు. – జనార్దన్‌రావు, డీఈవో

క్లుప్తంగా

యుద్ధ విద్యలను నేర్చుకోవాలి



బెల్టులను అందజేస్తున్న వి.నరేందర్‌రెడ్డి

రామడుగు: ప్రతి విద్యార్థి తమను తాము రక్షించుకోవడానికి యుద్ధ విద్యలను తప్పకుండా నేర్చుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సూచించారు. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం వంద మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని పలు రకాల బెల్టులను సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వి.నరేందర్‌రెడ్డి, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



వైష్ణవి(ఫైల్)

పెగడపల్లి: డిగ్రీలో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో మండలంలోని మద్దులపల్లికి చెందిన డిగ్రీ విద్యార్థిని పూసల వైష్ణవి (20) ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూసల రాజేశం కూతురు వైష్ణవి కరీంనగర్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. డిగ్రీ ఫస్ట్ ‌ఇయర్ ఫస్ట్ సెమ్, సెకండియర్‌లో సెకండ్ సెమిస్టర్‌లో ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపానికి గురైన వైష్ణవి ఆదివారం రాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందు తాగింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



సంపత్ (ఫైల్)

మానకొండూర్: లింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్(36) అనే రైతు విద్యుదాఘాతంతో సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. స్థానికులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. సంపత్ సోమవారం తన వ్యవసాయ క్షేత్రంలో వరి పంటకు నీళ్లందించడానికి వెళ్లాడు. మోటార్ ఆన్ చేయగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో.. సమీప విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి పరిశీలించాడు. ఈక్రమంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హ్యాండిల్‌కు చేయి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో అగ్నిప్రమాదం

మెట్‌పల్లి: మెట్‌పల్లిలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్ సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఏటీఎం ఉన్న భవనానికి పక్కనే పెట్రోల్ బంక్ ఉంది. ఫైర్ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.

ఫారిన్ పోదాం.. చదువుకుందాం



- విద్యానిధి ద్వారా విదేశాల్లో చదువులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువులకు చక్కటి అవకాశం
- పది దేశాల్లో చదివేందుకు ప్రాధాన్యం

కరీంనగర్:

డిగ్రీచేసి విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు ఆసక్తి ఉన్నవారికి విదేశీ విద్యా నిధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఒక్కోవిద్యార్థికి రూ.20లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఉపకార వేతనం, బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకాలు భరోసానిస్తున్నాయి. 2014–15 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీలకు, 2018 నుంచి బీసీలకు ఈ పథకాలను అమలు చేస్తున్నారు.

చేయూతనిస్తున్నా అంతంతే..

విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ కొందరే సద్వినియోగం చేసుకుంటున్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ప్రారంభమై తొమ్మిదేళ్లయినా ఇప్పటివరకు విదేశాలకు వెళ్లింది 26 మందే. ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా ఇప్పటి వరకు 51మంది విదేశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకం ద్వారా జిల్లా నుంచి 18 మంది ఎంపికైనట్లు సమాచారం.

అవగాహన డొల్ల..

జిల్లా నుంచి ఏటా వందలాది మంది డిగ్రీ పట్టాలు పొందుతున్నారు. చాలా మందికి విదేశాల్లో చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం విద్యానిధి పథకాలతో విదేశీ విద్యను ప్రోత్సహిస్తున్నా క్షేత్రస్థాయిలో అందరికీ దక్కడం లేదు. జిల్లాలో 130కి పైగా ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల యాజమాన్యం విదేశీవిద్యపై అవగాహన కల్పిస్తే చాలా మంది సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

జిల్లా నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారి సంఖ్య

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం (ఎస్సీ,ఎస్టీ)	26
ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం(మైనార్టీ)	51
మహాత్మాజ్యోతిబాపూలే (బీసీ)	18

ఇవీ.. అర్హతలు

ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసి, 60 శాతానికి పైగా మార్కులు సాధించాలి. టోఫెల్‌లో 60శాతం, ఐఈఎల్ టీఎస్ 80మార్కులు, జీఆర్ఈ టోఫెల్, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి పీఈటీలో 50శాతం అర్హత మార్కులు ఉన్నవారికి అవకాశం ఉంటుంది. విద్యార్థి వయసు 35 ఏళ్ల లోపు, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి.

పదిదేశాల్లో అమలు

గతంలో నాలుగు దేశాల్లోని యూనివర్సిటీల్లో మాత్రమే విద్యార్థులు చదువుకుంటే రుణసౌకర్యం కల్పించేవారు. ఈసారి ఆ సంఖ్యను పది దేశాలకు పెంచారు. దక్షిణ కొరియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశాల్లో విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ఇక్కడ వైద్యవిద్య, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్‌సైన్స్, వ్యవసాయం, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, తదితర కోర్సుల్లో పీజీ చేయడానికి అవకాశముంది.

ఈ సర్టిఫికెట్లు అవసరం

కులం, ఆదాయం, జనన ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు, పదో తరగతి, డిగ్రీ, ఇంటర్, పీజీ మార్కుల జాబితాలతోపాటు టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌జీఆర్ఈ, జీమ్యాట్, పీఈటీ అర్హత కలిగి ఉండాలి. విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి సంబంధిత కళాశాల ప్రవేశ అనుమతిపత్రం, ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు. బ్యాంకుఖాతా పుస్తకాలు. వీటి ఆధారంగా మీసేవాకేంద్రంలో గానీ, ఆన్‌లైన్‌లో కానీ తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.10 విలువైన నాన్ జ్యూడిషియల్ స్టాంపును అతికించి రిజిస్ట్రార్ సంతకంతో కూడిన పత్రాన్ని ఆదాయ ధ్రువపత్రానికి జత చేసి దరఖాస్తు సమర్పించాలి. ఆయా సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీ సభ్యులు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎస్సీ సంక్షేమశాఖ నుంచి విద్యానిధి దరఖాస్తులకు మార్చి31వరకు గడువు ముగిసింది. బీసీ సంక్షేమశాఖ నుంచి ఏప్రిల్ 5 వరకు అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి



విదేశాల్లో చదువుకోవాలని ఆసక్తి ఉన్న ప్రతీఒక్కరికి మహాత్మాజ్యోతిబాపూలే విద్యానిధి పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల రుణ సహాయం అందించి చేయూతనందిస్తోంది. ఉన్నత విద్యాభ్యాసం కోసం జిల్లా నుంచి ఇప్పటి వరకు 18 మంది విదేశాలకు వెళ్లారు. ఈ అవకాశం ఏడాదికి నాలుగుసార్లు ఉంటుంది. డిగ్రీ పూర్తి చేసినవారు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.అనిల్ ప్రకాశ్, బీసీ సంక్షేమశాఖ అధికారి

ఉన్నత విద్యకు ఓ వరం



అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దళిత విద్యార్థులకు ఓ వరం లాంటిది. ఏటా పది లక్షల చొప్పున రెండేళ్లు రూ.20 లక్షల రుణసాయం ఉన్నత విద్యకు అందజేస్తున్నాం. పది విదేశాల్లో చదువుకునేందుకు ఈ పథకం దోహదపడుతుంది. పథకం తీరు తెన్నులపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఆశించిన మేరకు దరఖాస్తులు రావడం లేదు.

– నేతానియల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

51 మందికి అవకాశం

మైనార్టీ సంక్షేమశాఖ నుంచి ఉన్నత విద్యను విదేశాల్లో అభ్యసించేందుకు 2015–16లో ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు 51మంది విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంది. మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.పవన్‌కుమార్, డీఎండబ్ల్యూవో

ఆలయాల్లోనూ అవినీతి

- దేవుని భూములు కబ్జా చేశారు
- గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరిపిస్తాం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మనవడితో కలిసి రాజన్నకు మొక్కు చెల్లింపు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి సురేఖ. చిత్రంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: గత ప్రభుత్వ పాలనలో ఆలయాల్లో అవినీతి, అక్రమాలు మితిమీరాయని, దేవుని భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిపై కమిటీలు వేసి విచారణ జరిపిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. తన మనవడి పుట్టువెంట్రుకలు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్న మంత్రి.. స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పకడ్బందీ విచారణ జరిపిస్తామన్నారు. కోడెమొక్కులకు నిలయమైన వేములవాడ రాజన్న రాజన్నగుడి, పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. దేవాలయాల భూములపై సర్వేలు చేయించి హద్దులు గుర్తిస్తామని, యాజమాన్యాలకు పాస్‌బుక్‌లు ఇప్పిస్తామని అన్నారు. దేశ, విదేశాల నుంచి రాష్ట్రంలోని ఆలయాలకు కానుకలు వచ్చేలా త్వరలోనే వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రజలు, భక్తుల నుంచి నిధులు సమకూర్చి ఆలయాలను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొనారు. దాతల సహకారంతో కాకతీయుల కాలం నాటి మాదిరిగానే ఆలయాలకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలన పాపాల పుట్ట

- ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేశారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి సోమవారం పెద్దపల్లిలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పడుతున్న ఇబ్బందులకు అప్పటి సీఎం కేసీఆర్ అనుసరించిన విధానాలే కారణమని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్ సరికాదని ఆనాడే చెప్పామని అన్నారు. అయినా ప్రాజెక్టు పూర్తయ్యాక రైతుల భూములు సేకరించి వ్యవసాయ రంగానికి చుక్కనీరు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే కుట్రతో బయల్దేరిన కేసీఆర్ మాటలను ఎవరూ నమ్మరని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇపుడు ఏదో వంకతో రోడ్డెక్కి మొసలికన్నీరు కారిస్తే రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రైతుల రుణమాఫీ చేస్తామని నమ్మించి.. వారిని బ్యాంకులో డిఫాల్టర్లుగా మార్చి రుణం దొరక్కుండా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుబంధు అనర్హులకు అందించాలన్న దురుద్దేశంతోనే రాయితీ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందకుండా చేశారని ఆరోపించారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో వానలు కురవాలని, గతేడాది బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో వానలు కురిశాయా? అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలతో వానలు కురవలేదని, ఈ కారణంగా రిజర్వాయర్‌లు నీళ్లతో నిండలేదని తెలిపారు. యాసంగి పంటలను కాపాడేందుకు తమ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందని వెల్లడించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అభిలాశ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



అభిలాశ్ తండ్రితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్: గతనెల హాస్టల్‌లో అదృశ్యమై 27 రోజుల తర్వాత బావిలో శవమై తేలిన మంథని నియోజకవర్గం కాటారానికి చెందిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ కుటుంబసభ్యులను ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పరామర్శించారు. హైదరాబాద్ వెళ్తున్న ఆయన.. తిమ్మాపూర్ రాజీవ్ రహదారిపై కాసేపు ఆగి అభిలాష్ కుటుంబసభ్యులతో మాట్లాడారు. మృతికి గల కారణాల గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానం ఉన్నట్లు మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ కొడుకు చనిపోయాడని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని మంత్రిని వేడుకున్నారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు.. కరీంనగర్ రూరల్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడారు. కేసు పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగవంతం చేసి మృతి గల కారణాలు తెలుసుకోవాలని సూచించారు. కొన్ని కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కరీంనగర్ పోలీసులు.. అభిలాష్ కేసును ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని ఏసీపీని ప్రశ్నించారు. కేసును వెంటనే ఛేదించాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున మృతుడి కుటుంబసభ్యులను ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా కళాశాలల నిర్వాహకులు విద్యార్థులపై నిర్లక్ష్యం వహించకుండా అండగా ఉండాలని సూచించారు. మంత్రి వెంట ఎస్ఎల్ గౌడ్, మాచర్ల అంజయ్య, రాకేశ్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

పట్టుకున్న గంజాయి మాయం?



స్వాధీనం చేసుకున్న గుట్కాతో ఎస్పీ, పోలీసులు, నిందితులు (ఫైల్)

- సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఘటన
- రెండు నెలలకు గమనించిన పోలీసులు
- తనిఖీ ముమ్మరం

జగిత్యాలక్రైం/సారంగాపూర్: పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన సుమారు 70 కిలోల గంజాయి మాయమైన ఘటన సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023 ఫిబ్రవరి ఒకటిన వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఓ అంబులెన్స్ అనుమానాస్పదంగా కనిపించింది. దానిని తనిఖీచేయగా 70 కిలోల గంజాయి లభ్యమైంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై క్వార్టర్స్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు సదరు అంబులెన్స్‌ను గమనించగా.. గంజాయి కనిపించలేదు. దీంతో అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి పరిశీలించిన పోలీసులు గంజాయి చోరీ అయినట్లు నిర్ధారించుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు భారీ ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి అణువణువునా తనిఖీలు చేశారు.

సీసీ పుటేజీల పరిశీలన

సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయంపై జిల్లా పోలీసులు సత్వరమే స్పందించారు. భారీ ఎత్తున పోలీసు బలగాలు రంగంలోకి దిగి సారంగాపూర్‌తోపాటు సమీప గ్రామాల్లోని సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్స్ పక్కనే పార్కింగ్ చేసిన అంబులెన్స్ నుంచి మాయమవడం చర్చనీయాంశంగా మారింది. గంజాయి మాయంపై ఎ స్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను 'సాక్షి' సంప్రదించగా.. పూ ర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఆలయాల్లో చోరీ



ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో ఆదివారం అర్ధరాత్రి నాలుగు ఆలయాల్లో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయాలకు వెళ్లిన పూజరులు తాళాలు పగులగొట్టి ఉండటంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై అనిల్ వచ్చి క్లూస్ టీం పోలీసులను రప్పించారు. బ్రహ్మంగారి ఆలయంలో మూడు గ్రాముల పుస్తెలు, 3 గ్రాముల వెండి ఆభరణం, పంచముఖ హనుమన్ ఆలయంలో 2 గ్రాముల బంగారు పుస్తెలు, పెద్దమ్మ ఆలయంలో సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు వేలిముద్రలు సేకరించారు. కార్యదర్శి రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

కరీంనగర్ క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పరిధిలోని వావిలాలపల్లిలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో గుర్తించానమన్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, సమాచారం తెలిసినవారు ఠాణాలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- టిప్పర్ యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదం
- రాజేశ్వర్‌రావుపేట శివారులో ఘటన



దీక్ష (ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారు వరదకాల్వ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం పాలైంది. కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన వెలుమల దీక్ష(23) నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలోని తన అక్క వద్దకు వెళ్లింది. సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమైంది. తన అక్క భర్త దిలీప్ ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి వైపు వస్తుండగా.. ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్ వైపు నుంచి వరదకాల్వ మీదుగా బండరాళ్ల లోడుతో వస్తున్న టిప్పర్ రాజేశ్వర్‌రావుపేట బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా యూటర్న్ తీసుకుంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న దీక్ష, ఆమె బావ తప్పించుకునే క్రమంలో దీక్ష టిప్పర్ టైర్ కింద పడిపోయింది. టైర్ ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. టిప్పర్ అతివేగంగా రావడంతోనే ప్రమాదం జరిగిందని గుర్తించిన పోలీసులు టిప్పర్‌ను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దిలీప్ ఫిర్యాదు మేరకు మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ ప్రియాంకసింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

లైంగికంగా వంచించి.. హత్యచేసి

- మహిళ హత్యకేసు ఛేదించిన పోలీసులు
- ఇద్దరిలో ఒకరు అరెస్టు
- మరో నిందితుడి కోసం గాలింపు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పనిచేసే చోట పరిచయమైన మహిళను అత్యాచారం చేసి ఆపై హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరి నిందితుల్లో ఒకరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన రుడల్ సదా, రామ్‌బిక్స్ సదా ఆరునెలల క్రితం కూలీకోసం వచ్చి సిరిసిల్లలోని అనంతనగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. కూలీ పనిచేసే వద్ద కొడిముంజకు చెందిన అలకుంట రమ పరిచయమైంది. ఆమెతో పరిచయం పెంచుకొని చనువుగా ఉంటున్నారు. గతనెల 19న కూలి పని అయిపోయాక ఆమెను గదికి తీసుకువచ్చారు. ముగ్గురు కలిసి మద్యం తాగారు. అనంతరం ఇద్దరు ఆమెపై అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబుతోందనన్న భయంతో సిలిండర్‌తో తలపై బాది హత్యచేశారు. తర్వాత ఇద్దరు బిహార్‌కు పారిపోయారు. దీనిపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి, టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుల్లో రామ్‌బిక్స్ సదాను బీహార్ అదుపులోకి తీసుకున్నారు హత్యకు వినియోగించిన సిలిండర్, మృతురాలి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

అనుమానితులు వస్తే వివరాలివ్వాలి..

గ్రామాలు, పట్టణాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమచారం ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. గుర్తు తెలియని వ్యక్తులకు గదులు అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. వారికి సంబంధించిన గుర్తింపుకార్డులు, కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లు తీసుకోవాలన్నారు.

ఘనంగా 'అల్ఫోర్స్' వార్షికోత్సవం



విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, సీఐ నీలం రవి

మల్యాల: విద్యార్థులు విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. మల్యాల అడ్డరోడ్డులోని ఆల్ఫోర్స్(ఎన్‌ఎస్వీ) పాఠశాల వార్షికోత్సవాన్ని ఈటెక్నో స్కూల్ ఆనందోత్సవ పేరుతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నరేందర్‌రెడ్డి, మల్యాల సీఐ నీలం రవి హాజరయ్యారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. క్రీడలు, పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందించారు. సీఐ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తాయన్నారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు విప్లవం సృష్టించాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేనిఫెస్టోలో భాగస్వామ్యం కావాలి

- మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్



యువత అభిప్రాయం సేకరిస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: బీజేపీ మేనిఫెస్టో రూపకల్పనలో యువత భాగస్వామ్యం కావాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్‌లో బీజేపీ మేనిఫెస్టో కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పని చేసిందన్నారు. దేశ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీజేపీకి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. తమ పార్టీ మేనిఫెస్టోలో యువతను భాగస్వామ్యం చేయాలన్న రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభిప్రాయాన్ని లిఖిత పూర్వకంగా సేకరిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, తమ అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలుపడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు అవసరమైన సలహాలు, సూచనలను యువత అందించాలని కోరారు. అన్నివర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మేనిఫెస్టో రూపొందిస్తుందన్నారు. పార్లమెంట్ ప్రబారి మీసాల చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్, నళిని, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శటి సంపత్, మాజీ మేయర్ డి.శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

కరీంనగర్: జిల్లా వ్యాప్తంగా పదోతరగతి ఒకేషనల్ పరీక్షకు 15 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 1,200 మందికి 1,184 మంది హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక తనిఖీ బృందం 5 పరీక్ష కేంద్రాలను, తాను 3 కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. గత నెలలో ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఇందుకు సహకరించిన అధికార యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎప్‌సెట్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

సప్తగిరికాలనీ: కరీంనగర్ ఉమ్మడి జిల్లాతోపాటు నిజామాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన కేజీబీవీ విద్యార్థినులకు ఎప్ సెట్ శిక్షణ తరగతులను డీఈవో జనార్దన్‌రావు సోమవారం ప్రారంభించారు. కరీంనగర్ కేజీబీవీలో శిక్షణిస్తారని, విద్యార్థినులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీవో కృపారాణి, సిరిసిల్ల ఆర్‌సీడీవో పద్మ, పెద్దపల్లి జీసీడీవో కవిత, జగిత్యాల జీసీడీవో అనుపమ, కేజీబీవీ ఇన్‌చార్జి పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



ఇషాక్



వినయ్‌సాగర్

కరీంనగర్: ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడిగా ఇషాక్, ప్రధాన కార్యదర్శిగా అసంపెల్లి వినయ్‌సాగర్, 16 మందితో నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఇషాక్ సోమవారం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడే సంఘంలో ఒక బాధ్యత గల పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: రాణిపురం రోడ్‌లోని 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేఈ వల్లంపహాడ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ మెహర్‌నగర్ ఫీడర్ పరిధిలోని మెహర్‌నగర్, ఎస్‌సీసీ ఆఫీస్ వెనక, సీతారాంపూర్ కొంత ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ నరేందర్ పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ తెలిపారు. నగరంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20 మందిని సోమవారం కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరిలో ఒకరికి 10, మరొకరికి 7, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా, మిగతావారికి రూ.23 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బహుదూర్‌ఖాన్‌పేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీసీ వనితరాణి, నాయకులు

కరీంనగర్‌రూరల్: మండలంలోని బహుదూర్ ఖాన్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ వనితరాణి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు గుర్రం నిర్మల సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం సీఏ గంగాజమున, స్థానిక హమాలీ, రైతు సంఘాల ప్రతినిధులు బుర్ర కుమారస్వామి, వెంకటేశం, అన్నాడి రాజిరెడ్డి, కల్యాణ్, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలులో ఆదర్శం

- కరీంనగర్ మండలంలో 99.60 శాతం పూర్తి
- జిల్లాలో మూడో స్థానం

కరీంనగర్‌రూరల్: ఇంటి పన్ను వందశాతం వసూలు చేసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌తో లక్ష్యం 99.60 శాతానికి చేరుకున్నారు. ఫలితంగా కరీంనగర్ మండలం జిల్లాలోనే మూడో స్థానం దక్కించుకొని, ఆదర్శంగా నిలిచింది. మండలంలోని 17 గ్రామాల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను రూ.1,58,02,557 వసూలు చేయాల్సి ఉండగా మార్చి నెలాఖరు వరకు రూ.1,57,40,711 వసూలు చేశారు.



నగునూరులో ఇంటిపన్ను వసూలు చేస్తున్న జీపీ కార్యదర్శి మల్లయ్య

వందశాతం పూర్తయిన గ్రామాలివే..

కరీంనగర్ మండలంలోని 4 పంచాయతీలు మినహా మిగతా అన్ని చోట్ల వందశాతం ఇంటి పన్ను వసూలైంది. బహదూర్‌ఖాన్‌పేట, చామనపల్లి, చేగుర్తి, చెర్లభూత్కూర్, దుబ్బపల్లి, ఎలబోతారం, ఫకీర్‌పేట, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, జూబ్లీనగర్, మందులపల్లి, మొగ్దుంపూర్, తాహెర్ కొండాపూర్ గ్రామాలు లక్ష్యాన్ని చేరుకున్నాయి. బొమ్మకల్‌లో రూ.35,861, దుర్శేడ్‌లో రూ.20 వేలు, నగునూరులో రూ.3,500, నల్లగుంటపల్లిలో రూ.2,485 మొత్తం రూ.61,846 వసూలు చేయాల్సి ఉంది.


వారం రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల సమన్వయంతో ఇంటి పన్ను వసూలు లక్ష్యానికి చేరువయ్యాం. బొమ్మకల్, దుర్శేడ్, నగునూరు, నల్లగుంటపల్లిల్లో వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. వందశాతం పన్ను వసూలు పూర్తి చేస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో, కరీంనగర్ మండలం

వేసవిలోనూ గుడ్డు ఆరోగ్యమే

కరీంనగర్: మండుతున్న వేసవిలోనూ కోడి గుడ్డు ఆరోగ్యానికి దోహదం చేస్తుందని ఆరోగ్య నిపుణులతోపాటు జాతీయ పోషకాహార సంస్థ చెబుతోంది. ఎండాకాలం ఆహారంలో గుడ్డు తీసుకుంటే శరీరానికి వేడి చేస్తుందనేది అపోహ మాత్రమే. కాలం ఏదైనా గుప్పెడంత గుడ్డులో గంపెడంత ఆరోగ్యం ఉన్నది వాస్తవం. ఇది గుర్తించే సమగ్ర స్త్రీ, శిశు అభివృద్ధి పథకం కింద ఇచ్చే పౌష్టికాహారంలో కోడిగుడ్డును కూడా చేర్చారు.



- వేడి చేస్తుందన్నది అపోహ మాత్రమే
- పాల తర్వాత స్థానం గుడ్డుదే
- విటమిన్లు అధికం

- గర్భిణులు, శిశువులకు, పాలిచ్చే తల్లులకు కావాల్సిన ఐరన్, ఫోలిక్‌యాసిడ్ గుడ్డులో ఉంటాయి.
- చర్మ సౌందర్యానికి అవసరమైన విటమిన్ ఇ, డి, సెలీనియం మూలకాలు ఎక్కువగా ఉంటాయి.
- పిల్లలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి, జ్ఞాపకశక్తిని వృద్ధిపరిచే హిస్టోడిన్, లినోలిక్ ఆమ్లం, కోలిన్ ఎక్కువగా ఉంటాయి.
- యువకులకు కండరాలు, ఇంద్రియ పుష్టిని కలిగించే బి–1, బి–2, బి–6 తదితర విటమిన్లు కూడా ఎక్కువే.
- విటమిన్ ఎ, సెలీనియం మంచి నిష్పత్తిలో ఉండటం వల్ల ఓబెసిటీ ప్రమాదం తగ్గుతుంది.
- గుడ్డులోని పచ్చసొనలో కెరోటిన్ దృష్టి లోపాలు తలెత్తకుండా కాపాడుతుంది.
- మహిళల్లో రొమ్ము కేన్సర్ నివారణకు అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.
- అలిసిపోకుండా శక్తినిచ్చే విటమిన్ బి–12 ఉంటుంది.

శాఖాహారమే : మహాత్మాగాంధీ

ఆవు, గేదె రక్త మాంసాల నుంచి వచ్చే పాలు జీవశాస్త్రం ప్రకారం, కీటకాలు విసర్జించే తేనె మాంసాహారమే. అయినా ప్రజలు వాటిని శాఖాహారంగా భావిస్తున్నారు. అలాగే, కోళ్ల ఫారాలలో పుంజులు ఉండవు. పెట్ట కోళ్లు సమగ్ర ఆహారం తిని, పుంజు కలయిక లేని అనగా జీవకణం లేని గుడ్డును ఇస్తాయి(ఈ గుడ్డును పొదిగిస్తే పిల్లలు రావు). పాలు, తేనె మాదిరిగా దీన్ని కూడా శాఖాహారంగా భావించవచ్చని జాతిపిత మహాత్మాగాంధీ కీ టు హెల్త్ అనే బుక్‌లో వెల్లడించారు.

- సగం ఉడికించిన గుడ్డు సరిగా జీర్ణం కాదు. అయినా అల్సర్ రోగులకు మంచిది.
- తల్లి పాల తర్వాత గుడ్డుదే ప్రథమ స్థానం. త్వరగా జీర్ణం అవుతుంది. శరీర నిర్మాణానికి ఉపయోగపడే 24 పదార్థాల్లో 23, శ్రేష్ఠమైన ప్రోటీన్స్ ఉన్నాయి.
- 2007 ప్రపంచ సర్వే రిపోర్టు ప్రకారం,, నిండా నూరేళ్లు జీవించే వ్యక్తులకు గుడ్డే మంచి ఆహారం.
- గుడ్డు పాలు, టీ, కాఫీల కంటే విలువైనది. అతి చౌకైనది.

అఖిల్ కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు. సోమవారం నగరంలోని ముకరంపురలో గల అఖిల్ నివాసానికి వెళ్లి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్, సమద్ నవాబ్, ఇర్ఫాన్, పెద్దిగారి తిరుపతి, లయాక్, కొట్టె ప్రభాకర్, షేక్ శహన్షా, అష్రఫ్, మాసుం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అఖిల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్

కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థికి సన్మానం

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని నగరానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సోమవారం కరీంనగర్ వచ్చిన వంశీ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌లను శాలువాలతో సత్కరించారు. మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు న్యాత శ్రీనివాస్, వెన్న రాజమల్లయ్య, బొబ్బిలి విక్టర్, కాడె సూర్యనారాయణ, కాడె శంకర్, కుంభాల రాజ్‌కుమార్, దండి రవీందర్, గూడ కనకయ్య, దారం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థి వంశీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, పక్కన ఎమ్మెల్యే వివేక్

పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉంటాం

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

సప్తగిరికాలనీ: ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తాము రాష్ట్రంలోని 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల గొంతుకగా బరిలోకి దిగబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బాధ్యులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గడ్డం హరీశ్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

నేటి నుంచి రాజ్యాంగ రక్షణ యాత్ర

కరీంనగర్: మాలమహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్ మాట్లాడుతూ.. మాలమహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు రాజ్యాంగ రక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 5న యాత్ర కరీంనగర్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎలుక ఆంజనేయులు, గూడ కనకయ్య, తాళ్ల వెంకటేశ్, దామెర సత్యం, నాయిని ప్రసాద్, ఇరుకుల్ల యాదగిరి, ఎల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో విద్యార్థుల కోసం కేంద్రం నుంచి తెచ్చిందేమీ లేదని ఆరోపించారు. విద్యార్థులు, యువకుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం పూర్తి కాకముందే వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారి అండతోనే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయకపోతే విద్యావ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల సమ్మయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కేశబోయిన రాము, కనకం సాగర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కేంద్ర బలగాల కవాతు

కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌కు వచ్చిన సీఐఎస్‌ఎఫ్ బలగాలతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం కవాతు నిర్వహించారు. పలు సంఘటనల ఆధారంగా గుర్తించిన సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక గాంధీ చౌరస్తా నుంచి కిసాన్‌నగర్ మీదుగా కార్ఖానాగడ్డ, నాకా చౌరస్తా తదితర ప్రాంతాలకు వెళ్లారు. స్థానిక, స్పెషల్ యాక్షన్ టీం పోలీసులు పాల్గొన్నారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, కంపెనీ కమాండెంట్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండెంట్ విజేందర్, త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తదితరులున్నారు.



ఎకరానికి రూ.25 వేల పరిహారమివ్వాలి



నాయబ్ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..

కరీంనగర్‌రూరల్: సాగు నీరందక పంటలు ఎండిపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కరీంనగర్ రూరల్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాయబ్ తహసీల్దార్ శంకర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. ఎస్సారెస్పీ కాల్వ నీళ్లు అందకపోవడంతో వందలాది ఎకరాల్లోని వరి పంట ఎండిపోయిందని తెలిపారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారమివ్వాలని కోరారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని, రూ.2 లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సంతోష్‌కుమార్, చిందం అశోక్, పాశం తిరుపతి, నరేందర్, గోపాల్, కమలాకర్‌రెడ్డి, రమేశ్, శ్రీధర్, దేవేందర్, రామచంద్రం, సునీల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి..

కొత్తపల్లి: సాగు నీరందక, అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కొత్తపల్లి పట్టణ, మండల నాయకులు డిమాండ్ చేశారు. వారికి ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రైతులకిచ్చిన హామీలను నెరవేరుస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయంలో విఫలమైందని ఆరోపించారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతోపాటు రూ.500 బోనస్ ప్రకటించాలని, తరుగు పేరిట కోతలు విధించకుండా మిల్లర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

రైతు దీక్షకు రండి

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మంగళవారం కరీంనగర్‌లోని పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం వద్ద తలపెట్టిన రైతుదీక్షను విజయవంతం చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పంట చేతికొచ్చే సమయంలో సాగు నీరందక అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులంతా రైతాంగానికి అండగా నిలవాలన్నారు. రైతు దీక్ష తర్వాత రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ స్థానికంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

నేడు సర్వాయి పాపన్న వర్ధంతి సభ

విద్యానగర్: కరీంనగర్ మానేరు బ్రిడ్జిపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఆయన వర్ధంతి నిర్వహిస్తున్నట్లు సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న గౌడ్ తెలిపారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాపన్న 314వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే సభకు బహుజనులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి పర్శరాం గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు పిల్లి మహేశ్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడిసెల రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బద్దం ఎల్లారెడ్డిపై పరిశోధనకు డాక్టరేట్



అనిత

కరీంనగర్: తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బద్దం ఎల్లారెడ్డి జీవి తం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఈదులకంటి అనిత అన్నారు. 'ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్ట్ మూవ్‌మెంట్ ఇన్ తెలంగాణ ఎ–స్టడీ' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ సాధించారు. సైదాపూర్ మండలంలోని ఆకునూరుకు చెందిన అనిత ప్రస్తుతం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల హిస్టరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ప్రొఫెసర్ పి.సదానందం గైడెన్స్‌లో బద్దం ఎల్లారెడ్డి జీవన విధానంపై పరిశోధన చేయడం, డాక్టరేట్ పొందడం ఆనందంగా ఉందన్నారు. పరిశోధన చేసిన సమయంలో తనకు సహకరించిన బద్దం ఎల్లారెడ్డి కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు, ప్రజా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత టాలెంట్ టెస్ట్

కరీంనగర్‌టౌన్: పై అకాడమీ ఆధ్వర్యంలో పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచిత టాలెంట్ టెస్ట్‌ను బుధవారం ఉదయం 9 గంటలకు రాంనగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకుడు పవన్‌కుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేల చొప్పున పారితోషికం, ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 98853 26712, 98665 37311 ఫోన్ నంబర్లలో సంప్రదించి, పేరు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

అక్షర చిట్‌ఫండ్ బాధ్యులపై కేసు

కరీంనగర్ క్రైం: చిట్టీలు వేయించుకొని, తిరిగి ఖాతాదారులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్ బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లికి చెందిన మిట్టపల్లి భాగ్యలక్ష్మి 2019లో కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్‌లో గల అక్షర చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.5 లక్షల చిట్టీ వేసింది. అవసరాల నిమిత్తం ఎత్తుకోగా రూ.3.87 లక్షలు వచ్చాయి. చిట్‌ఫండ్ చైర్మన్, డైరెక్టర్లు ఆ డబ్బులను ఇవ్వకుండా తిరిగి చిట్‌ఫండ్‌లో డిపాజిట్ చేస్తే ప్రతినెలా 18 శాతం చొప్పున వడ్డీ ఇస్తామని నమ్మించారు. సదరు మొత్తాన్ని 36 నెలలపాటు డిపాజిట్ చేసి, కాలపరిమితికి అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బాండ్ ఇచ్చారు. ఆమెకు అసలు, వడ్డీ డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తూ వచ్చారు. భాగ్యలక్ష్మి కూతురు హరిత 2021 కోతిరాంపూర్ శాఖలో రూ.10 లక్షల చిట్టీ వేసి, 2023 వరకు డబ్బులు చెల్లిస్తుంచింది. తర్వాత ఆ శాఖను మూసివేశారని తెలిసింది. అనంతరం తల్లీకూతురు హనుమకొండలోని చిట్‌ఫండ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి, వారికి రావాల్సిన డబ్బులు గురించి, చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు పేరాల శ్రీవిద్య, ఎస్.కొండాల్‌రావు, పుప్పాల రాజేందర్, గోనె రమేశ్‌లను అడిగారు. కానీ, వారు కాలయాపన చేస్తూ ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో బాధితులు సోమవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలు వినియోగించుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ సమత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మ్యాజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సమత జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వారం రోజులపాటు వివిధ అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అనంతరం పలు కంపెనీల్లో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, హెచ్‌ఆర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పవిత్ర, ట్రైనర్ తిరుపతి, జిల్లా మొబిలైజేషన్ ఇన్‌చార్జి శివ తదితరులున్నారు.

మేమంతా మీ వెంటే..

ఏపీ సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రలో జనగర్జన

పెత్తందారులపై పోరుకు మేమంతా సిద్ధం అని నినాదాలు

పోటెత్తిన ప్రజాభిమానం.. ఇసుకేస్తే రాలనంతంగా జనం

ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఠంఛన్‌గా పెన్షన్‌ను ఇంటికి పంపిన మనవడిని చూడటానికి అవ్వాతాతలు.. దశాబ్దాల సొంతింటి కల నెరవేర్చిన సోదరుడి కోసం అక్కచెల్లెమ్మలు.. అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన పథకాలతో తమ చదువులకు భరోసా ఇచ్చిన మామయ్యతో మాట కలపడానికి విద్యార్థులు.. సొంతకాళ్లపై నిలబడ్డామని చెప్పడానికి యువతీ యువకులు.. ఇలా ఒక్కరేంటి అన్ని వర్గాల ప్రజలతో అనంతపురం–చెన్నై జాతీయ రహదారి కిక్కిరిసింది. ప్రియతమ నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని, కరచాలనం చేయాలని, కుదిరితే మాట కలపాలని వేలాది మంది ప్రజలు పరితపించడం అడుగడుగునా కనిపించింది. సీఎం సైతం ప్రజలతో అదే రీతిలో మమేకమయ్యారు.

ముదిగుబ్బ నుంచి కదిరికి వెళ్లే మార్గం మధ్యలో నడిమిపల్లి వద్ద బస్సు దిగిన సీఎం.. ఓ వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడారు. 'మీకు వలంటీర్ల ద్వారా పెన్షన్ ఇంటి దగ్గర ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకున్నాడు. ఈసీకి ఫిర్యాదు చేసి ఇంటి దగ్గరకు పెన్షన్ పంపిణీ నిలిపివేయించాడు' అని చెప్పారు. ఈ క్రమంలో వృద్ధురాలు మాట్లాడుతూ.. 'చంద్రబాబుతో మాకు పని లేదు. ఎన్నాళ్లు ఆపుతాడు? మాకు నువ్వే కావాలి. నువ్వుంటే మాకు ఏ కష్టం ఉండదు' అంటూ భావోద్వేగానికి గురైంది.


కదిరిలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేస్తున్న సీఎం జగన్

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో ప్రజాభిమానం పోటెత్తింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఐదో రోజు సోమవారం విజయవంతంగా కొనసాగింది. కిలోమీటర్ల కొద్దీ జనం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా బస్సు వెనుక యువత పరుగులు తీయడం గ్రామ గ్రామాన కనిపించింది. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురంలోని బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్ర మొదలైంది. అయితే ఉదయం 6 గంటల నుంచే బస కేంద్రం వద్దకు జనం భారీగా తరలివచ్చారు. అనంతపురం–చెన్నై జాతీయ రహదారిపైకి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సాధారణ ప్రజలు చేరుకోవడంతో పండుగ వాతావరణం తలపించింది. రోడ్‌షో బత్తలపల్లి మండల కేంద్రానికి చేరుకునేలోపే రోడ్డుపై ఇసుకేస్తే రాలనంత మంది సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. మురిసిన ముదిగుబ్బ.. కదం తొక్కిన కదిరిబత్తలపల్లి నుంచి ముదిగుబ్బ మధ్య రామాపురం, కట్టకిందపల్లి, రాళ్ల అనంతపురం సహా పలు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి చేరుకుని సీఎంకు ఘన స్వాగతం పలికారు. రామాపురంలో బస్సు దిగి సీఎం జగన్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముగిగుబ్బకు చేరుకునేలోపే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డుపై బారులు తీరారు. కదిరి పట్టణంలోకి వస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. సీఎం రాక నేపథ్యంలో నేల ఈనిందా అన్నట్టు జనంతో కదిరి రోడ్లు కిటకిటలాడాయి. బస్సుపై నుంచి రోడ్‌షో నిర్వహించిన సీఎం జగన్.. పీవీఆర్ కళ్యాణ మండపంలో ముస్లిం సోదరులతో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



'మేమంతా సిద్ధం యాత్ర 5వ రోజు నా స్టార్ క్యాంపెయినర్‌లతో..' అంటూ సీఎం వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో కొన్ని ఫొటోలు పోస్ట్ చేశారు. అనారోగ్యంతో ఉన్న ఓ వృద్ధురాలు సీఎం వైఎస్ జగన్‌కు తన చేతిని అందించారు. ఆమెను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని చెప్పింది విని ఓదార్చారు. అలాగే మహిళా రైతులు తాము పండించిన వేరుశెనగ పంటను వైఎస్ జగన్‌కు ఇచ్చారు.

తిరుగుబాటుతో తత్తరపాటు

అవ్వాతాతలకు పింఛన్లపై ఆటంకాలు బాబు బృందం నిర్వాకమే

పింఛన్ల పంపిణీపై వలంటీర్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 1న ఈసీకి అచ్చెన్న ఫిర్యాదు

- నాలుగు నెలలుగా సుప్రీం, ఢిల్లీ హైకోర్టు, రాష్ట్ర హైకోర్టులో నిమ్మగడ్డ పిటిషన్లు.. ఫిబ్రవరి 23, 25న ఈసీకి సైతం ఫిర్యాదు
- నిమ్మగడ్డ – బాబు బంధం స్థానిక ఎన్నికల్లోనే బట్టబయలు
- బాబు బృందం ఫిర్యాదులతోనే ఇంటి వద్ద పింఛన్లకు ఈసీ బ్రేక్
- సీఎం జగన్ ప్రభుత్వానికి ఆపాదిస్తూ 'ఈనాడు' రోత కథనాలు
- గతంలో విమర్శించిన సచివాలయాల ఉద్యోగులతోనే పింఛన్లు పంచాలంటూ డిమాండ్
- లబ్ధిదారుల ఇళ్ల వివరాల కోసం వారూ ఎవరో ఒకరిపై ఆధారపడాల్సిందేగా?
- ఇవన్నీ ఆలోచించాకే నిర్ణయం తీసుకున్న అధికారులపై పచ్చమూక అభాండాలు

పింఛన్లు అడ్డుకుని దొంగ ఏడుపు

- ఇంటింటికి వెళ్లి ఇవ్వాలని సీఎస్‌ను కోరిన టీడీపీ నేతలు
- వలంటీర్ల ద్వారా తాము వద్దనలేదని బాబు బుకాయింపు

మరిన్ని వివరాలు, ఫొటోల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రైతు ఎజెండాతో జనంలోకి..

▶ మొదటి పేజీ తరువాయి

ఎండుతున్న పంటలు, ధాన్యం కొనుగోలుపై బోనస్ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా కేసీఆర్ పర్యటన ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్ హామీలపై కూడా..: రైతు ఎజెండాతో పాటు ఆసరా పింఛన్లు, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, మహిళకు రూ.2,500 వంటి హామీలపై కాంగ్రెస్ తీరును క్షేత్ర స్థాయిలో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ దిశా నిర్దేశం చేస్తోంది. అదే సమయంలో రామమందిరం అంశాన్ని బీజేపీ సానుకూలంగా మలుచుకుంటుందనే అంచనాతో తామూ రాముని భక్తులమేనని ప్రతిచోటా చెప్తున్న బీఆర్ఎస్ నేతలు.. రామమందిరం పేరిట బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తోందంటూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని నిర్ణయించింది.

ముఖ్య నేతలతో సన్నాహక సమావేశాలు

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్.. ఎన్నికల ప్రచార సభల షెడ్యూలును ఖరారు చేసే పనిలో ఉన్నారు. ఈలోగా లోక్‌సభ నియోజకవర్గాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ అభ్యర్థి, ముఖ్య నేతలతో సన్నాహక సమావేశాల బాధ్యతలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావుకు అప్పగించారు. ఇప్పటికే సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ సమావేశాలకు కేసీఆర్ హాజరయ్యారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఏకపక్ష విజయాన్ని అందించిన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో క్షేత్ర స్థాయి ప్రచారానికి కేటీఆర్ శ్రీకారం చుట్టారు. ఇంకోవైపు హరీశ్‌రావు మెదక్, వరంగల్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో జరిగే పార్టీ భేటీలకు హాజరవుతున్నారు. ఉగాది పండుగ లోగా లోక్‌సభ, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు పూర్తి చేయడం లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఉగాది, రంజాన్ పండుగల తర్వాత బహిరంగ సభల ద్వారా కేసీఆర్ ప్రచార పర్వంలోకి అడుగు పెడతారు. ఈ నెల 13న చేవెళ్లలో జరిగే బహిరంగ సభ అనంతరం మరిన్ని సభల నిర్వహణకు షెడ్యూలు రూపొందిస్తున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు నుంచి మూడు సభలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈసారి ఆ తప్పులు చేయొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కో పోలింగ్ బూత్‌లో పార్టీ అభ్యర్థికి అనుకూలంగా వివిధ వర్గాల మద్దతును కూడగట్టే దిశగా బూత్ కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయలేదని వెల్లడైంది. పోలింగ్ సందర్భంగా కూడా ఈ కమిటీల పని విధానం సరిగ్గా లేదని, సభ్యులు అంకితభావంతో బాధ్యతలు నిర్వహించలేదని తేలింది. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తిగా బూత్ కమిటీలను ఏర్పాటు చేయకపోయినా పేపర్‌పై వేసినట్టు చూపడం, గతంలో ఎప్పుడో వేసిన కమిటీలే ఎన్నికల నాటికి పనిచేస్తున్నట్టు చూపడం, ఆయా కమిటీల సభ్యులు తమకు బాధ్యతలు అప్పగించిన చోట్ల పనిచేయకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. వీటితో పాటు బూత్ కమిటీల స్థాయిల్లో మెరుగైన సమన్వయానికి ఉపయోగపడే వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయకపోవడం, ఇంటింటికి వెళ్లి 'ఓటర్ మాస్ కాంటాక్ట్ ప్రోగ్రామ్'వంటివి చేపట్టకపోవడం వంటివి ప్రధాన లోపాలుగా నాయకత్వం గుర్తించింది.

ఈసారి కాల్‌సెంటర్ ద్వారా బూత్‌ల పర్యవేక్షణ

తాజాగా జరిగే లోక్‌సభ ఎన్నికల్లో...గతంలో చేసిన తప్పులు మళ్లీ చోటుచేసుకోకుండా మెరుగైన సమన్వయ, పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఈ ఎన్నికలకు రాష్ట్రంలో పార్టీ పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు పకడ్బందీగా కార్యాచరణ అమలుకు కసరత్తు ప్రారంభించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ ద్వారా పోలింగ్ బూత్ కమిటీల కార్యకలాపాల పర్యవేక్షణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర పార్టీ నుంచి ఒక్కోబూత్‌కు ఒక్కొక్కరికి సమన్వయ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. గ్రామ స్థాయిల్లోనే సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి ఒక్కో రాష్ట్రనాయకుడికి పోలింగ్‌బూత్ సమన్వయ బాధ్యతలు అప్పగించనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ ద్వారా 17 ఎంపీ సీట్ల పరిధిలో బూత్ కమిటీల నియామకం పూర్తిస్థాయిలో జరిగిందా లేదా ? వాటిలో ఎంత మంది సభ్యులున్నారు.. వారికి అప్పగించిన బాధ్యతలు సక్రంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న దానిపై ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం సమీక్షించనుంది.

21 కాదు.. 11

ఇవి బాబు-పవన్ కుమ్మక్కు డ్రామాలంటూ మండిపాటు

పేరే జనసేనది.. పోటీచేసేది టీడీపీనే అంటున్న జనసేన శ్రేణులు

సాక్షి, అమరావతి: అంతన్నాడు.. ఇంతన్నాడే గంగరాజు.. అన్నట్లుగా ఉంది ఇప్పుడు జనసేన పరిస్థితి. తెలుగుదేశం పార్టీతో పొత్తుకు ముందు వరకు జనసేనకు 60, 50, 40 సీట్లంటూ ఊరించి చివరికి పవన్‌కళ్యాణ్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు కేటాయించింది కేవలం 21 సీట్లేనని.. తీరా అభ్యర్థులను పూర్తిస్థాయిలో ఖరారు చేసేశాక చూస్తే అందులో టికెట్లు పొందిన అసలు సిసలైన జనసేన నేతలు కేవలం పదకొండు మందేనని ఆ పార్టీ నేతలు నిట్టూర్పు విడుస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన అభ్యర్థులే సరిగ్గా ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి జనసేన పార్టీలో చేరి, ఆ పార్టీ తరఫున పోటీచేస్తుండడాన్ని చూసి ఇవేం పొత్తులురా బాబూ అంటూ జనసేన శ్రేణులు రుసరుసలాడుతున్నారు. నిజానికి.. రెండు పార్టీలు మిత్రపక్ష పార్టీలే అయినప్పుడు పొత్తులో ఆ సీట్లు టీడీపీనే ఉంచుకుని జనసేనకు వేరే సీట్లు కేటాయించవచ్చు కదా అంటూ వారు మండిపడుతున్నారు. పొత్తులో జనసేనకు కేటాయించి నిన్నటివరకు అభ్యర్థులు ఎవరో తేలని అవనిగడ్డ, పాలకొండ నియోజకవర్గాల్లో సైతం తాజాగా సోమవారం టీడీపీ నేతలే జనసేనలో చేరి జనసేన అభ్యర్థులుగా పోటీచేసేందుకు సన్నద్ధమవ్వడంపై జనసేన నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అలాగే.. జనసేనకు కేటాయించిన యలమంచిలి, భీమవరం స్థానాల్లో పార్టీ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులు పంచకర్ల రమేష్, అంజిబాబు 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీచేశారని.. ఇప్పుడు పొత్తు తర్వాత వారు జనసేనలో చేరిన విషయాన్ని ఆ పార్టీ శ్రేణులు గుర్తుచేస్తున్నారు. చివరికి.. జనసేనకు కేటాయించిన అవనిగడ్డ, పాలకొండ సీట్లను సైతం టీడీపీకే చెందిన మండలి బుద్ధప్రసాద్, నిమ్మక జయకృష్ణలు సోమవారం పవన్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకుని ఆ టికెట్లను ఎగరేసుకుపోవడం నిజమైన పొత్తు రాజకీయాలు ఎలా అవుతాయని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు.

పొత్తు పేరుతో అధినేతే మోసం చేస్తుంటే..

ఇక పొత్తులో జనసేనకు ఇప్పుడు కేటాయించిన 21 స్థానాల్లో కేవలం నెలిమర్ల, కాకినాడ రూరల్, నరసాపురం, తాడేపల్లిగూడెం, పోలవరం, తెనాలి, యలమంచలి నియోజకవర్గాల్లో మాత్రమే గత ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసిన వారే మళ్లీ ఇప్పుడు పొత్తులోనూ పోటీచేస్తున్నారు. అలాగే, పవన్‌కళ్యాణ్ పోటీచేసే పిఠాపురంతో పాటు నిడదవోలులో పోటీచేస్తున్న కందుల దుర్గేష్ కూడా గత ఎన్నికల్లో వేరే నియోజకవర్గాల నుంచి జనసేన తరఫునే పోటీచేశారు. ఇక గత ఎన్నికల్లో పోటీచేయకపోయినా ఇప్పుడు రాజానగరం, రాజోలు స్థానాల్లో పోటీచేస్తున్న జనసేన అభ్యర్థులు నాలుగైదేళ్లుగా పార్టీ కోసం పనిచేసున్నారని.. మిగిలిన స్థానాల్లో మాత్రం ఇప్పుడు కొత్తగా పార్టీలోకి చేరిన నాయకులేనని అంటున్నారు.

పొత్తులు కాదు.. కుమ్మక్కు రాజకీయాలు

ఇకపోతే.. 2019 ఎన్నికల్లో జనసేన ఒంటిరిగా పోటీచేసిన సమయంలో కూడా దాదాపు 60 చోట్ల పది వేలకు పైగా ఓట్లు వచ్చాయని.. అందులో చాలాచోట్ల అప్పుడు పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థులే ఐదేళ్లుగా అక్కడ పార్టీ కోసం పనిచేసుకుంటూ ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీచేయాలని ఆశించారు. కానీ, పొత్తులో సొంత పార్టీ నాయకులకు అన్యాయం చేస్తూ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యవహరిస్తున్న తీరుపట్ల జనసేన నేతలు, పార్టీ శ్రేణులు గుర్రుగా ఉన్నారు. అసలు టీడీపీ–జనసేన మధ్య ఉంది పొత్తులు అనేకంటే కుమ్మక్కు రాజకీయాలు అనడమే సరిగ్గా ఉంటుందని వారు ఆరోపిస్తున్నారు. చంద్రబాబు–పవన్ ఇద్దరూ కుమ్మక్కై చివరికి జనసేన అధినేత తన సొంత పార్టీ నాయకులనే మోసం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

కమలం నేతలూ ఇలాంటి భావనలోనే..

మరోవైపు.. టీడీపీ–బీజేపీ–జనసేన పొత్తుపై కమలం పార్టీ నాయకులు కూడా ఇదే భావనను వ్యక్తంచేస్తున్నారు. ఈ పొత్తులో మొదట నుంచి పార్టీని నమ్ముకుని 25–30 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్న అసలుసిసలైన కమలనాథులకు ఈ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కకపోగా.. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయాక పునరావాసం కోసం ఆ పార్టీ నుంచి బీజేపీలోకి జంప్ చేసిన నేతలనే ఇప్పుడు బీజేపీ అభ్యర్థులుగా నిలబెట్టేందుకే చంద్రబాబు ఈ పొత్తులను తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కమిటీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కీలకస్థానాల్లో ఉన్న తొమ్మిదిమంది జాతీయ నాయకత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే.

కేసీఆర్ ప్రతి మాటా అబద్ధమే!

కరువు మొదలైందే బీఆర్ఎస్ పాలనలో.. మేం సమర్థవంతంగా డీల్ చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్

- 3 నెలల్లోనే కుప్పకూలిన ప్రాంతీయ పార్టీ దేశంలో ఎక్కడైనా ఉందా?
- పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదు..
- అందుకే కేసీఆర్‌లో భయం మొదలైంది.. ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారు
- 200 మంది రైతుల ఆత్మహత్యలు అవాస్తవం.. 200 మంది బీఆర్ఎస్ నేతలు వెళ్లిపోయింది వాస్తవం
- కేసీఆర్ ప్రెస్‌మీట్‌లో జనరేటర్ ఆగిపోతే తామేం చేయాలని నిలదీత



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండ జిల్లా పర్యటనలో మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ''కాళేశ్వరం విషయంలో ఏం జరుగుతుందో తెలియదు. పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మిగిలే పరిస్థితి లేదు. అందుకే కేసీఆర్‌లో భయం మొదలైంది. ఫ్రస్టేషన్‌లో వాస్తవాలను వక్రీకరించి మాట్లాడుతున్నారు..'' అని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం పోయింది, పార్టీ కూడా పోతుందనే భయం కేసీఆర్‌లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గొప్పలకు పోయి టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారని.. ఇప్పుడు బీఆర్ఎస్, టీఆర్ఎస్‌గా కూడా మిగలకుండా వీఆర్ఎస్ అవుతుందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదని, ఎన్నికల తర్వాత కేసీఆర్ కుటుంబ సభ్యులు తప్ప ఆ పార్టీలో ఎవరూ ఉండరని వ్యాఖ్యానించారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు

కాంగ్రెస్ కరువు తెచ్చిందంటూ మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం దారుణమని ఉత్తమ్ మండిపడ్డారు. గత 20 ఏళ్లలో కురిసిన వర్షాలు, కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు వచ్చిన నీటి లెక్కలను వివరించారు. ''ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదా? అది కూడా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వచ్చింది. వర్షాకాలంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. డిసెంబర్ 7న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇవన్నీ రైతులకు తెలుసు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సీఎం, మంత్రులు, అధికారులు సమర్థవంతంగా పనిచేస్తూ వీలున్నంత మేరకు పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న రెండు నెలల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం..'' అని ఉత్తమ్ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్న కేసీఆర్ మాటలు అవాస్తవమని స్పష్టం చేశారు. అయితే బీఆర్ఎస్ నుంచి 200 మంది నేతలు వెళ్లిపోయిన మాట మాత్రం వాస్తవమని చెప్పారు. సూర్యాపేటలో కేసీఆర్ ప్రెస్‌మీట్ జనరేటర్ సాయంతో నిర్వహించారని.. ఆ జనరేటర్ ఆగిపోతే తామేం చేయాలని ప్రశ్నించారు. కానీ దీనికి కూడా కరెంటు పోయిందంటూ కేసీఆర్ అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు.

విద్యుత్ డిమాండ్ పెరిగినా.. డీల్ చేస్తున్నాం..

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని, అయినా తాము 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని ఉత్తమ్ చెప్పారు. ఎన్టీపీసీ 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని కేసీఆర్ అబద్ధం చెప్పారని.. అక్కడ ఉత్పత్తి అవుతున్నది 1,600 మెగావాట్లేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన ప్రతి ధాన్యం గింజను కొంటామని, ఇప్పటికే 7,149 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల నుంచి కనీస మద్దతు ధర కన్నా తక్కువకు కొంటే వ్యాపారులపై చర్యలు చేపడతామన్నారు. వరి ధాన్యానికి బోనస్ అమలుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నిసార్లు పంటలు నష్టపోయినా రైతులకు పరిహారం ఇవ్వలేదని.. ఎన్నికలకు ముందు మాత్రం రెండు జిల్లాల్లో ఇచ్చి డ్రామాలు ఆడారని విమర్శించారు. పోలీసులు తటస్థంగా ఉండాలని కేసీఆర్ చెప్పడం విడ్డూరమని, అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పోలీసుల సాయంతో ఫోన్ ట్యాపింగ్ చేసి.. ఇప్పుడు పోలీసులు తటస్థంగా ఉండాలని కోరడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు.

వంద రోజుల్లో ఇంత పతనమైన పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే..

''రాష్ట్రంలో ఒకే స్థానం నుంచి ఏడు సార్లు వరుసగా గెలిచిన నాయకుడిని నేనొక్కడినే. నా సుదీర్ఘ అనుభవంతో చెప్తున్నా. నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల. అధికారం కోల్పోయిన 100 రోజుల్లోనే ఇంతగా పతనమైన పార్టీని దేశంలో మునుపెన్నడూ చూడలేదు..'' అని ఉత్తమ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని.. ఆ చిట్టా బయటికి వస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కొత్త పథకాలు ప్రవేశపెట్టలేమన్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

కేసీఆర్.. ఇంతగా దిగజారాలా?

- పదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తి చెప్తున్నవన్నీ కట్టుకథలే..: మంత్రి భట్టి విక్రమార్క ఫైర్
- రాష్ట్రం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు కేసీఆరే కారణం
- నేతలు బీఆర్ఎస్‌ను వీడుతుండటాన్ని జీర్ణించుకోలేక విమర్శలు
- విద్యుత్తు రంగంపై రూ.1,10,690 కోట్ల బకాయిల భారం వేశారు
- కేసీఆర్ పాపం వల్లే ఎన్టీపీసీ ప్లాంట్ రాకుండా పోయిందని విమర్శ



సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్లు సీఎంగా చేసిన కేసీఆర్ చెప్తున్నవన్నీ కట్టుకథలేనని.. ఆయన అబద్ధాలు వింటుంటే మరీ ఇంత దిగజారి మాట్లాడటం అవసరమా అనిపిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, నీళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కేసీఆర్ అవాస్తవాలే చెప్పారని ఆరోపించారు. చివరికి జనరేటర్ లోపంతో మైక్ కట్ అయితే కాంగ్రెస్ కరెంట్ కోతలంటూ మాట్లాడారని మండిపడ్డారు. తాను గీసిన గీత దాటరనుకున్న నేతలంతా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో అది జీర్ణించుకోలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. భట్టి సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లకు కేసీఆర్ పాలనే కారణమని మండిపడ్డారు.

ఇల్లు కూల్చి పోయావు కదా

''కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యే కదా.. దీన్నికూడా నడపలేరా అంటూ మాపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు విస్మయం కలిగించాయి. కట్టిన ఇల్లును కూల్చేసి పోయారు కదా.. గత పదేళ్లలో కేసీఆర్ రూ.1,10,690 కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ఆగం చేసి వెళ్లారు. రాష్ట్రం దివాలా తీస్తే.. ఒక్కొటీ సరిచేసుకుంటూ ముందుకెళ్తున్న మాపై కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితం..'' అని భట్టి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇచ్చామన్నారు.

కేసీఆర్ పాపం వల్లే ఎన్టీపీసీ రాలేదు

ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రాన్ని తానే రాష్ట్రానికి తెచ్చినట్టు కేసీఆర్ పెద్ద అబద్ధం చెప్పారని భట్టి విమర్శించారు. ''రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణకు 4వేల మెగావాట్ల విద్యుత్ ఎన్టీపీసీ ద్వారా వచ్చేలా పొందుపరిచారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ ఆ ఎన్టీపీసీని ఎందుకు తీసుకురాలేక పోయారు? పీపీ అగ్రిమెంట్ విషయంలో ఎవరు ఆపారు? కేసీఆర్ పాపం వల్లనే కదా ఎన్టీపీసీ రాలేదు. పైగా కొందరు నేతల లాభం కోసం భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. యాదాద్రి పవర్ ప్రాజెక్టును బొగ్గు దొరికే ప్రదేశానికి 350 కిలోమీటర్ల దూరంలో నిర్మాణం చేపట్టారు. పర్యావరణ అనుమతి కోసం 50 శాతం స్థానిక, మరో 50 శాతం దిగుమతి చేసుకున్న బొగ్గు వాడుతామని కట్టుకథలు అల్లారు. ఈ అబద్ధాలను గుర్తించిన కేంద్రం పర్యావరణ అనుమతిని రద్దు చేసింది..'' అని భట్టి తెలిపారు. ఇలా ప్రజల ముందు తప్పులు మాట్లాడితే పరువు పోతుందనే ఇంగిత జ్ఞానం కూడా కేసీఆర్‌కు లేదని వ్యాఖ్యానించారు. ఒకవేళ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్టీపీసీ ప్లాంట్‌ను మొదలు పెడితే నిర్మాణానికి ఐదేళ్లు పడుతుందని.. ఒక్కో యూనిట్ ధర రూ. 8–9 అవుతుందన్నారు. అందుకే సౌర విద్యుత్ కొనుగోలుపై దృష్టి పెట్టామని.. ఈ మధ్యనే సోలార్ కార్పొరేషన్ వాళ్ల యూనిట్‌కు రూ.5.59కు ధరతో 25ఏళ్ల పాటు కరెంట్ ఇచ్చేందుకు టెండర్లు వేశారని వివరించారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్ ఇస్తున్నామని భట్టి చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోందన్నారు. పదేళ్లకు ముందు యూపీఏ సర్కారు ఐకేపీ మహిళలకు వడ్డీ లేని రుణాలిస్తే.. కేసీఆర్ గత పదేళ్లలో ఐకేపీలను విస్మరించారని విమర్శించారు. ఇప్పుడు తాము రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామన్నారు.

మరో రూ.1,000 కోట్లు అప్పు

▶ మొదటి పేజీ తరువాయి

డిసెంబర్ 19న రూ.900 కోట్లు, ఈ ఏడాది జనవరి 16న రూ.2,000 కోట్లు, అదే నెల 23న రూ.1,000 కోట్లు, ఫిబ్రవరి ఆరో తేదీన రూ.2,000 కోట్ల రుణాలను తీసుకుంది. ఇక గత ఆర్థిక సంవత్సరంలో చివరి మాసమైన మార్చిలో నాలుగు దఫాల్లో రూ.6,718 కోట్లకు పైగా రుణాలను సమీకరించింది. మార్చి ఐదో తేదీన రూ.2,000 కోట్లు, అదే నెల 12న మరో రూ.2,000 కోట్లు, 19న రూ.1,000 కోట్లు, చివరిగా మార్చి 26న రూ.1,718 కోట్ల అప్పులు తీసుకుంది. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికం (జనవరి, ఫిబ్రవరి, మార్చి)లో రూ.11,718 కోట్ల రుణం సమకూర్చుకుంది. కాగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం గత ఏడాది డిసెంబర్ నాటికి రూ.36,536.01 కోట్ల రుణాలు తీసుకుంది. ఆ తర్వాత తీసుకున్న అప్పులతో కలిపితే ఈ మొత్తం రూ.48 వేల కోట్లకు చేరడం గమనార్హం.

ఈ నెలలో మరో రూ.4 వేల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మొదటి త్రైమాసికంలో రూ.16 వేల కోట్ల రుణాలను తీసుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఏప్రిల్, మే, జూన్‌లలో ప్రభుత్వం సమీకరించనున్న రుణాల వివరాలను ఆర్బీఐ మార్చి 28న వెల్లడించింది. దీని ప్రకారం ఏప్రిల్ 2న రూ.1,000 కోట్లు, 8, 23 తేదీల్లో రెండు దఫాలుగా రూ.2 వేల కోట్ల చొప్పున ఒక్క నెలలో రూ.5 వేల కోట్లు తీసుకోనుంది. మేలో 7, 14, 28 తేదీల్లో 3 దఫాలుగా రూ.6 వేల కోట్లు, జూన్ 4న రూ.1000 కోట్లు, 11, 25 తేదీల్లో 2 దఫాలుగా రూ.4 వేల కోట్లను అప్పుగా తీసుకోనుంది. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా సగటున రూ.5 వేల కోట్ల వరకు అప్పులను సమీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కుండల తయారీలో మనమదురై మహిళలు



సీజన్

ప్రతి ఊరిలో కుండలు చేస్తారు. కాని కుండలు చేయడానికి మాత్రమే ఒక ఊరు ప్రసిద్ధం అయ్యింది. అదే తమిళనాడులోని 'మనమదురై'. అక్కడ పారే వైగై నది తెచ్చే ఒండ్రు మట్టితో తయారయ్యే ఈ కుండలు చల్లదనానికి ప్రతీకలు. స్త్రీలు ఈ కుండల తయారీలో సరి సమాన శ్రమ చేస్తారు. ఘటాలు కూడా తయారు చేస్తారు. ఈ కుండల ప్రత్యేకత వల్ల వీటికి 'జియోగ్రాఫికల్ ఇండికేషన్' (జిఐ) ట్యాగ్ దక్కింది.

కుండలు చేసే ఊరు

వేసవి రాగానే కుండలు గుర్తుకొస్తాయి. ప్రతి ఇంటిలో కుండలోని చల్లటి నీళ్లు తాగడానికి ఇష్టపడతారు. ఫ్రిజ్‌లోని నీళ్లలో ఉండే కృత్రిమ చల్లదనం కుండ నీళ్లలో ఉండదు. అందుకే కొత్త కుండలు వేసవిలో ప్రతి ఇంటికి చేరుతాయి. చలివేంద్రాలు పెట్టేవారు పెద్ద పెద్ద కుండలు కొని దాహార్తి తీర్చి పుణ్యం కట్టుకుంటారు. పక్షులకు నీరు పెట్టాలనుకునేవారు మట్టి పాత్రల్లో నీళ్లు నింపి పెడతారు. ఒకప్పుడు పల్లెల్లో పాలకుండ, పెరుగు కుండ, నెయ్యి కుండ ఉండేవి. పెరుగు కుండలో తోడు పెడితే చాలా రుచి. స్టీలు, ప్లాస్టిక్ దెబ్బకు కుండలు కొన్నాళ్లు వెనుకబడినా మళ్లీ ఇప్పుడు ఆరోగ్యస్పృహ వల్ల పుంజుకున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రత్యేక కుండలకు గిరాకీ తగ్గలేదు. వాటిలో మనమదురై కుండలు మరీ ప్రత్యేకం.

కుండల ఊరు

తమిళనాడులోని శివగంగ జిల్లాలోని చిన్న ఊరు మనమదురై. యాభై వేల జనాభా ఉంటుంది. ఇది మదురై నుంచి 60 కిలోమీటర్ల దూరం. ఇక్కడ పారే వైగై నది ఈ ఊరికి ఇచ్చిన అనుకోని వరం కుండలు తయారు చేయడానికి అవసరమైన ఒండ్రుమట్టి. నది ఒడ్డు నుంచి తెచ్చుకున్న ఒండ్రుమట్టి కాల్షియం లైమ్, బూడిద, సోడియం సిలికేట్, మాంగనీస్, ఐరన్ మిశ్రమాలను కలిపి కుండలు తయారు చేస్తారు. మనమదురై కుండను గుర్తించడం ఎలా అంటే దాని అడుగు పరిపూర్ణమైన గుండ్రంగా ఉంటుంది. అదే సమయంలో నేల మీద సరిగ్గా కూచుంటుంది. ఈ కుండల తయారీలో పంచభూతాలు ఉంటాయి అంటారు ఈ ఊరి వాళ్లు. నేల, నీరు, అగ్ని తయారీలో ఉపయోగిస్తే మట్టిలోని సూక్ష్మరంధ్రాలు గాలి రాకపోకలను సూచిస్తాయి. కుండ లోపలి ఖాళీ (శూన్యం) ఆకాశాన్ని సూచిస్తుంది. వేసవి కోసం ఇక్కడ విశేష సంఖ్యలు కుండలను స్త్రీ, పురుషులు కలిసి తయారు చేస్తారు. కుటుంబాలన్నీ కుండల మీదే ఆధారపడి బతుకుతాయి. వీటికి ఎంత డిమాండ్ ఉన్నా దూరప్రాంతాలకు పంపడం ఖర్చుతో, రిస్క్‌తో కూడుకున్న పని. కుండలు పగిలిపోతాయి. అందుకే స్థానికంగా తప్ప ఇవి ఎక్కువగా దొరకవు.

ఘటం ఎలా తయారు చేస్తారు?

మనమదురై కుండలకే కాదు ఘటాలకు కూడా ప్రసిద్ధి. నీరు పోస్తే కుండ. సంగీతం పలికిస్తే ఘటం. కాని అది సంగీతం పలికించాలంటే కొంచెం ప్రత్యేకంగా తయారు చేయాలి. మనమదురై ఘటాలు చాలా ప్రసిద్ధి. ఇక్కడ మీనాక్షి కేశవన్ అనే మహిళ ఘటాలు తయారు చేయడంలో ఖ్యాతి పొందింది. పెద్ద పెద్ద విద్వాంసులు ఆమె తయారు చేసిన ఘటాలనే వాయించేవారు. ఘటం తయారు చేయాలంటే కుమ్మరి చక్రంపై కుండ తయారయ్యాక ఒక రోజు ఉంచేస్తారు. మర్నాడు దానిని ప్రత్యేక చెక్కమెత్తతో మెత్తుతారు. ఒక పచ్చికుండ కాల్చడానికి ముందు ఘటంగా మారాలంటే ఆ కుండలోని ప్రతి అంగుళాన్ని మెత్తాలి. అలా 3000 సార్లు మెత్తి ఆ తర్వాత కాల్చుతారు. అప్పుడే ఘటం తయారవుతుంది. ఇది ఓపికతో కూడిన పని కాబట్టి స్త్రీలు ఎక్కువగా చేస్తారు. వీటి కోసం వేల కిలోమీటర్ల నుంచి వచ్చి కొనుక్కెళ్లేవారు ఉన్నారు. కుండలు చేసే కుటుంబాలు ఉన్నా ఘటాలు చేసే కుటుంబాలు అంతరించిపోతున్నాయని ఇటీవల సాంస్కృతిక, సంగీత అభిమానులు క్రౌడ్ ఫండింగ్ చేసి ఘటాల తయారీని పునరుద్ధరించేలా చూశారు. ●

హెల్త్ టిప్స్

- కడుపులో పుళ్లు, గ్యాస్ వంటి సమస్యలు ఉన్నవారు రోజూ ఒక పచ్చిక్యారట్‌ను తినడం అలవాటు చేసుకుంటే ఆ సమస్యలు అదుపులో ఉండడంతోబాటు చర్మానికి మంచి రంగు కూడా వస్తుంది.
- రక్తహీనతతో బాధపడేవారు ఆహారంలో మునగాకును తరచు తీసుకోవడం వల్ల వంటికి బాగా రక్తం పడుతుంది.
- పంటినొప్పి ఉన్నవారు, ఏమైనా తాగినా, తిన్నా పళ్లు జివ్వుమని లాగేవారు పుదీనా ఆకులను నీడపట్టున ఎండబెట్టి చేసిన పొడిలో కాస్త ఉప్పు కలిపి దానితో పళ్లు తోముకుంటూ ఉంటే పంటి సమస్యలు ఉండవు.
- నడుంనొప్పితో బాధపడేవారు పుదీనా ఆకుల రసంలో పచ్చకర్పూరం పొడిని చేర్చి, నడుముకు పట్టులా వేసే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.





గెలుపు దారి

కల ఉన్న చోట కష్టం ఉంటుంది. 'మరింత కష్టపడతాను' అంటూ ముందుకువెళ్లాలి. లక్ష్యం ఉన్న చోట సవాలు ఎదురొస్తుంది. సరియైన జవాబు చెప్పి ఆ సవాలును వెనక్కి పంపించాలి. ఇందుకు నిలువెత్తు ఉదాహరణ శృతి మల్హోత్రా. జార్ఖండ్‌లోని రాంచికి చెందిన శృతి ఎన్నో చిన్న బ్రాండ్‌లను పెద్ద సక్సెస్ చేసింది. సక్సెస్‌కు సరియైన అడ్రస్‌గా పేరు తెచ్చుకుంది...

సక్సెస్ స్పెషలిస్ట్



శృతి మల్హోత్రా

శృతి మల్హోత్రా బాల్యంలోకి వెళితే...

ప్రతిరోజు రాత్రి నలుగురు అక్కాచెల్లెళ్లు వార్తలు వినడానికి రేడియో ముందు కూర్చునేవారు. కొత్త విషయాలు, ఆసక్తికరమైన విషయాలను రూల్ నోట్ ప్యాడ్‌లో రాసుకునేవారు. మరుసటి రోజు తండ్రితో వాటి గురించి చర్చించేవారు. తండ్రి వాటి గురించి మరిన్ని కొత్త విషయాలు వివరంగా చెప్పేవాడు. శృతి తండ్రి పిల్లలకు తరచుగా చెప్పే మాట...

'స్వతంత్రంగా ఉండండి' 'పెద్ద కలలు కనడానికి వెనకాడ వద్దు' 'ఈ ప్రపంచంలో మీకు అత్యున్నత స్నేహితుడు... విద్య'

తండ్రి మాటలు అక్షరాలా ఆచరించడం వల్లే పదిమందీ మెచ్చుకునే స్థాయికి ఎదిగింది శృతి మల్హోత్రా. మిషనరీ స్కూల్ నుంచి దిల్లీ యూనివర్శిటీలో చదువుకోవడం వరకు 'స్వతంత్రంగా ఉండడం' అనే లక్షణాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. దీనివల్ల ఆమె చాలామందికి 'రెబెల్'గా కనిపించేది.

'ఏదైనా చేయాలి. అది ఇతరుల కంటే భిన్నంగా ఉండాలి' అనే లక్ష్యాన్ని కాలేజీ రోజుల్లోనే నిర్దేశించుకుంది మల్హోత్రా.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో చదువు పూర్తయిన తరువాత ఫ్యాషన్ కంపెనీ 'బెనెటన్'తో ప్రొఫెషనల్ ఇన్నింగ్స్ ప్రారంభించింది.

నైకీ, ప్లానెట్ స్పోర్ట్స్‌లో కూడా అద్భుతమైన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించింది.

స్థూలంగా చెప్పాలంటే ఫ్యాషన్, లైఫ్ స్టైల్ డిజైనింగ్‌లలో ప్రత్యేకమైన పేరు తెచ్చుకుంది.

2007లో ఎథికల్ బ్యూటీబ్రాండ్ 'ది బాడీ షాప్'లో చేరింది. ఇది తన ప్రయాణ గతిని మార్చేసింది.

రిటైల్, సేల్స్, డిస్ట్రిబ్యూషన్‌లలో అడుగడుగునా పురుషాధిక్యత కనిపించే కాలంలో మహిళలు అడుగు వేసి నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. 'వేరే వారి కంటే ఒక మెట్టుకింద ఉండడానికి నేను ఎప్పుడూ ఇష్టపడలేదు. సవాలుగా తీసుకున్నాను. రెట్టింపు కష్టపడ్డాను' అంటుంది మల్హోత్రా.

ఆ కాలంలో బ్యూటీ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన రిటైల్ బిజినెస్ ఫార్మసీ, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లలో మాత్రమే కనిపించేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జీరో నుంచి ప్రయాణం ప్రారంభించాను' అంటుంది మల్హోత్రా.

'ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నావు?' అనే సన్నాయి నొక్కుల నుంచి 'ఈ రంగంలో పెద్ద పేరున్న మహిళ' అనే ప్రశంస వరకు శృతి మల్హోత్రా ఎంతో ప్రయాణం చేసింది. ఎన్నో పాఠాలు నేర్చింది. ఎందరికో గుణపాఠాలు చెప్పింది. 'క్వెస్ట్ రిటైల్' గ్రూప్ సీయీవోగా ఎంతో పేరు తెచ్చుకుంది.

'శృతి మల్హోత్రా సీయీవో మాత్రమే కాదు ఎన్నో బ్రాండ్స్‌ను విజయవంతం చేసిన డ్రైవింగ్ ఫోర్స్' అంటాడు ఫ్యాషన్ కంపెనీ లకోస్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీయీవో రాజేష్ జైన్.

తన సక్సెస్‌కు కారణం తల్లిదండ్రులు అని చెబుతుంది మల్హోత్రా. చదువు చెప్పించడం నుంచి కలల సాధనలో వెన్నుదన్నుగా నిలవడం వరకు వారి పాత్ర ఎంతో ఉందని చెబుతోంది.

'వృత్తి జీవితంలో ఎంతోమంది మేల్ కొలీగ్స్‌తో పనిచేశాను. ఎప్పుడూ ఎవరితోటీ సమస్య రాలేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు అవకాశం లేకపోవడమే అసలు సమస్య. మహిళలకు సమానావకాశాలు కల్పించడం విషయంలో ఎన్నోసార్లు పోరాడాను' అంటుంది మల్హోత్రా.

'మీరు ఎక్కడి నుంచి వచ్చారు అనేది ముఖ్యం కాదు. మీరు ఎక్కడికి వెళుతున్నారన్నది ముఖ్యం' అనేది శృతి మల్హోత్రాకు ఇష్టమైన మాట.

సాగుబడి
రేవతి కార్తె: మార్చి 31 నుంచి

నేలపైన కాదు.. నేరుగా వేర్లకే తడి

- భూగర్భ డ్రిప్‌తో 50% నీరు, 30% విద్యుత్తు ఆదా
- మామిడి, బత్తాయి తదితర పండ్ల, కూరగాయ తోటలకు రక్షణ



'స్వర్' డ్రిప్ వ్యవస్థ ఇలా ఉంటుంది.

దీర్ఘకాలం మనుగడ సాగించే పండ్ల, పూల తోటల నుంచి కొద్ది నెలల్లో పంటకాలం ముగిసే సీజనల్ కూరగాయల సాగు వరకు నీటిని పొదుపుగా వాడుకోవటం అంటే వెంటనే అందరికీ గుర్తొచ్చేది చెట్ల దగ్గర మట్టిపై నీటిని చుక్కలు చుక్కలుగా వదిలే డ్రిప్ లైన్లు! అయితే, అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పుల కాలంలో బోర్లు ఎండిపోతూ ఉంటే.. పండ్ల, పూల తోటలను, కూరగాయ తోటలను రక్షించుకోవడానికి దీనికన్నా మెరుగైన మరో మార్గం ఉంది. అదే.. భూగర్భ డ్రిప్! నేల మీద నీరివ్వటం కాదు, భూమిలో వేర్లకే నేరుగా నీటి తేమ అందించటం!



మల్లె తోట



దానిమ్మ తోట

భూతాపం ఏటేటా పెరిగిపోతున్న దశలో నీటి సవాళ్లు మరింత తీవ్రమవుతున్నాయి. దీనికి తగినట్లు నీటిని మరింత సమర్థవంతంగా వాడుకోవాల్సిన అవసరం వస్తోంది. ఇంతకుముందెన్నడూ ఎరుగని రీతిలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెచ్చుమీరుతుంటే.. ఉద్యాన తోటల సాగుకు నీటి లభ్యత తగ్గిపోతూ ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్. గోపాల్ 'స్వర్' (సిస్టం ఆఫ్ వాటర్ ఫర్ అగ్రికల్చర్ రిజునవేషన్) పేరుతో వినూత్న డ్రిప్‌ను ఆవిష్కరించారు. సాధారణ డ్రిప్ భూమి పైనే నీటిని వదులుతూ ఉంటే.. ఈయన రూపొందించిన డ్రిప్ నేలపైన కాకుండా చెట్లు/మొక్కల వేర్ల దగ్గర భూగర్భంలో నీటి తేమను అతి పొదుపుగా వదులుతుంది. సాధారణ డ్రిప్‌తో పోల్చితే కూడా సగానికి సగం నీరు ఆదా కావటంతో పాటు.. అతి తక్కువ నీరు అందుబాటులో ఉండే కరువు కాలపు మండు వేసవిలోనూ పండ్ల తోటలను కంటికి రెప్పలా కాపాడుకోవటానికి, తద్వారా వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేసుకోవడానికి ఈ భూగర్భ డ్రిప్ 'స్వర్' రైతులకు చక్కగా ఉపయోగపడుతోందని గోపాల్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. 2019 మొదలుకొని ఇప్పటికి 8 రాష్ట్రాల్లో స్వర్ భూగర్భ డ్రిప్‌ను అనేక పండ్ల, కూరగాయ తోటల్లో అనేక సంస్థలతో కలిసి ప్రయోగాత్మకంగా ఉపయోగించి చూస్తూ సత్ఫలితాలు పొందుతున్నామన్నారాయన.

'స్వర్' ఎలా పనిచేస్తుంది?

భూగర్భంలో చెట్లు/ మొక్కల వేర్లకే నీటి తేమను అందించటమే 'స్వర్' భూగర్భ డ్రిప్ ప్రత్యేకత. సాధారణ ఆన్‌లైన్ డ్రిప్ లేటరల్ పైపునకు ఉండే డ్రిప్పర్‌ను తొలగించి, 'స్వర్' భూగర్భ డ్రిప్ బాక్సులను అమర్చితే సరిపోతుంది. దీని నిర్మాణం ఎలా ఉంటుందంటే.. అరచేతి సైజులో ఉండే ఒక ప్లాస్టిక్ బాక్స్ ఉంటుంది. దానికి నిండా సన్నని బెజ్జాలుంటాయి. 5 ఎం.ఎం. మైక్రో ట్యూబ్‌తో ఒక చివర్న ఈ బాక్స్‌ను జోడించి.. మరో చివర భూమిపైన ఉండే డ్రిప్ లేటరల్ పైపులకు అమర్చాలి. ఆ తర్వాత బాక్స్‌ను చెట్టు/ మొక్క దగ్గర మట్టిని తవ్వి భూమి లోపల వేర్ల దగ్గర్లో పెట్టి, మట్టి కప్పెయ్యాలి. ఆ విధంగా ఈ భూగర్భ డ్రిప్ భూమి లోపల వేరు వ్యవస్థకు నీటి తేమను అందుబాటులోకి తెస్తుంది. మట్టి లోపల వేరు వ్యవస్థ దగ్గర ఉండే ఈ బాక్స్‌లో క్వార్ట్జ్ స్టోన్ గ్రాన్యూల్స్ ఉంటాయి. అవి నిరంతరం నీటి తేమను మట్టి ద్వారా వేరు వ్యవస్థకు క్రమబద్ధంగా అందిస్తుంటాయి. బయటి నుంచి వేర్లు ఈ బాక్స్ లోపలికి అల్లుకొని దాని పనితీరును దెబ్బ తీయకుండా ఉండేలా దీన్ని రూపొందించటం విశేషం.

మామిడి, బత్తాయికి 4 డ్రిప్ బాక్సులు

ఉద్యాన తోటల్లో చెట్ల వయసును, ఎత్తును బట్టి, మట్టి తీరును బట్టి ఒక్కో చెట్టుకు ఎన్ని డ్రిప్ బాక్సులను ఏర్పాటు చేసుకోవాలో, వేరు వ్యవస్థ వద్ద నేలలో ఎంత లోతులో ఏర్పాటు చేసుకోవాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. చెట్టు మొదలు దగ్గర కాకుండా.. దాని కొమ్మలు విస్తరించిన చివరిలో పీచువేళ్లు అందుబాటులో ఉండే చోట్ల ఈ డ్రిప్ బాక్సులను ఏర్పాటు చేసుకోవటం ముఖ్యం.

ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్, వైజాగ్ కృషి విజ్ఞాన కేంద్రం, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవా, జిఐజడ్ వంటి సంస్థలతో కలిసి స్వర్ భూగర్భ డ్రిప్, లివింగ్ కంపోస్టుపై ప్రయోగాలు చేసి సత్ఫలితాలు సాధించామని గోపాల్ తెలిపారు. పెద్ద మామిడి చెట్టుకు 4 (12–16 అంగుళాల లోతులో) స్వర్ డ్రిప్ బాక్సులు, జామ చెట్టుకు 2 (12 అంగుళాల లోతులో), బత్తాయి చెట్టుకు 4 (12 అంగుళాల లోతులో), నిమ్మ చెట్టుకు 2 (6 అంగుళాల లోతులో), దానిమ్మ చెట్టుకు 2 (భగువ చెట్టుకు 4–5, గణేశ్ చెట్టుకు 6–7 అంగుళాల లోతులో), కొబ్బరి చెట్టుకు 4 (4–5 అంగుళాల లోతులో), మల్లె మొక్కకు 1 డ్రిప్ బాక్సు ఏర్పాటు చేసుకుంటే చాలని ప్రయోగాత్మక సాగులో తేలింది. రెండు చెరకు మొక్కలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నామని గోపాల్ తెలిపారు.

50% నీరు, 30% విద్యుత్తు ఆదా

భూగర్భ డ్రిప్ బాక్సుల ద్వారా వేరు వ్యవస్థకు నీటిని అందించటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వర్షాకాలంలో తప్ప కలుపు సమస్య ఉండదు. కాబట్టి రైతుకు శ్రమ, ఖర్చు తగ్గుతాయి. సాధారణ డ్రిప్‌తో పోల్చితే 50% నీరు, 30–40% విత్యుత్తు ఆదా అవుతుంది. డ్రిప్ ద్వారా ఇచ్చే ద్రవరూప ఎరువులు కూడా 30% ఆదా అవుతాయి. సౌర విద్యుత్తు ద్వారా నడిచే 5 హెచ్‌పి మోటారుకు బదులు 1.5 హెచ్.పి. మోటారు సరిపోతుంది. 10% అదనంగా పంట దిగుబడి వస్తుంది. అంతేకాదు, త్వరగా పూత వస్తుందని గోపాల్ చెబుతున్నారు.

అవార్డుల పంట

సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ (సిఇసి) తరపున 'స్వర్' భూగర్భ డ్రిప్ వ్యవస్థను ఆవిష్కరించిన కె.ఎస్.గోపాల్‌కు 2023 అవార్డుల పంట పండించింది. న్యూఢిల్లీలోని ఐఎఆర్ఐలో పూసా కృషి పురస్కారం (రూ. 5 లక్షలు), ఫిక్కి ఉత్తమ నీటి సాంకేతికత పురస్కారం, రూ. 50 లక్షల యాక్ట్ గ్రాంటు లభించాయి. కేంద్ర జలశాఖ, యుఎన్‌డిపి, తెరి ఉమ్మడిగా 2024 ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో 'స్వర్' ప్రథమ బహుమతిని గెల్చుకుంది.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

తోటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చు!

సాధారణ డ్రిప్ వాడినప్పుడు చెట్టు/మొక్క దగ్గర ఉపరితలం నుంచి వేర్ల దగ్గరకు మట్టిని తడుపుకుంటూ నీరు వెళ్లాల్సి ఉంటుంది. 'స్వర్' భూగర్భ డ్రిప్ బాక్సులు ఏర్పాటు చేసుకుంటే ఆ అవసరం ఉండదు. నేరుగా వేర్లకే నీటి తేమను అందించవచ్చు. దీనివల్ల, నీటి వాడకం సగానికి సగం తగ్గిపోతుంది. మండు వేసవిలోనూ 3 నుంచి 5 రోజులకు ఒకసారి నీరిస్తే సరిపోతుంది. అడుగు లోతులో నీటి తేమ ఎంత ఉందో సెన్సార్ ఆధారంగా తెలుసుకుంటూ.. నీటి అవసరం ఉన్నప్పుడు మాత్రమే, తగినంత నీటి తేమను, నెమ్మదిగా అందించటం వీలవుతుంది. తద్వారా తక్కువ నీటితోనే పండ్ల, పూల తోటలను, కూరగాయ తోటలను అధిక వేడి, హీట్ వేవ్ కష్టకాలంలోనూ రక్షించుకోవటానికి అవకాశం ఉంది. భూగర్భ డ్రిప్ బాక్సు ధర గతంలో రూ. 50 ఉండేది. ఇజ్రేల్ కంపెనీ సహాయంతో దీన్ని రూ. 25కి తగ్గించగలిగాం.

– కె.ఎస్.గోపాల్ (98481 27794), 'స్వర్' భూగర్భ డ్రిప్ ఆవిష్కర్త, డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్‌సర్న్స్, హైదరాబాద్.




మార్కెట్‌ను బట్టి సేద్యం.. నేరుగా ప్రజలకే అమ్మకం..



ఖర్బూజ తోటలో రైతు దంపతులు వెంకటేష్, విజయ

రైతు దంపతులు బండారి వెంకటేష్, విజయకు ప్రయోగాలంటే ప్రాణం. చదివింది పదో తరగతే అయినా, ఉద్యాన పంటల సాగులో భేష్ అనిపించుకుంటున్నారు. ఇతర రైతులకు భిన్నంగా మార్కెట్‌కు తగిన పంటలు పండించడం, దళారులకు విక్రయించకుండా నేరుగా మార్కెటింగ్ చేయటం వారి సక్సెస్‌కు ముఖ్య కారణాలుగా నిలిచాయి.

వెంకటేష్, విజయ దంపతులది జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామం. ఖర్బూజ (పుచ్చ) పంటను తమకున్న 3 ఎకరాల్లో నవంబర్ నుండి మే నెల వరకు గత మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. దీని పంట కాలం 90 రోజులు. ఒకేసారి పొలం మొత్తంలో విత్తనాలు వేయకుండా, కొన్ని రోజుల వ్యవధిలో ఐదు దఫాలుగా విత్తుతారు. శివరాత్రి నుంచి ఎండలు ముదురుతాయి. అప్పటి నుంచి మే వరకు పుచ్చకాయలు మార్కెట్‌కు వచ్చేలా సాగు చేస్తారు. ప్రతి రోజు టన్ను నుంచి టన్నున్నర కాయలు జగిత్యాల మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఖర్బూజ రకాలను సాగుచేస్తుంటారు. ఈ ఏడాది ఐదు రకాల ఖర్బూజ పండ్లను సాగు చేశారు.



జగిత్యాలలో ఖర్బూజ కాయలు అమ్ముతున్న వెంకటేష్

సాధారణ ఖర్బూజ (సూపర్ క్వీన్ రకం), లోపల పసుపు పచ్చగా బయట ఆకుపచ్చగా ఉండే విశాల్ రకం, లోపల ఎర్రగా బయట పసుపు పచ్చగా ఉండే అరోహి రకం, గుండ్రంగా ఉండే జన్నత్ రకం, మస్కిమిలన్ (జ్యూస్ రకం) సాగు చేశారు. ఈ విత్తనాలను బెంగళూర్ నుంచి తెప్పించారు.

ఖర్బూజ విత్తనాలు వేయక ముందు భూమిలో కోళ్ల ఎరువు, పశువుల పేడ వేసి, రెండు సార్లు దున్నిస్తారు. తర్వాత, బెడ్ మేకర్‌తో బెడ్ తయారు చేసి, మల్చింగ్ షీట్ వేసి, డ్రిప్ ద్వారా సాగు నీరు అందిస్తుంటారు. రసాయన ఎరువులు, పురుగు మందులు పెద్దగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటారు.

3 నెలలు కష్టపడి పంట పండించి, ఆ పంటను దళారులకు విక్రయిస్తే కిలోకు రూ. 5–6 ధర కూడా రాదు. అందుకని ఈ రైతు దంపతులు తామే నేరుగా వినియోగదారులకు అమ్ముతారు. విజయ సాయంత్రం తోటకు వెళ్లి కూలీల సాయంతో కాయలను తెంపుతుంటారు. వెంకటేష్ ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి, ఒక్కరిద్దరి సహాయంతో కాయలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తారు. ఇంటి వద్ద భోజనం చేసి ఉ. 8 గంటలకు జగిత్యాలకు వచ్చి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద అమ్ముతారు. ఈ సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మంచి గిరాకీ వస్తోంది. కిలో రూ. 25 నుంచి 49 వరకు రకాన్ని బట్టి విక్రయిస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇవ్వడంతో పాటు కాయలు నాణ్యతగా, రంగు రంగుల్లో ఉండటంతో వినియోగదారులు సైతం ఈ రైతు దగ్గర కొనటానికి ఆసక్తి చూపుతున్నారు.

ఖర్బూజ సాగుతో పాటు ఏడాది పొడవునా ఏదో రకం కూరగాయలు, పండుగలప్పుడు పూలు కూడా సాగు చేస్తున్నారు. ఏ పంట పెట్టినా, అందులో అధిక దిగుబడులు సాధిస్తారు. వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చితేనే రైతులకు లాభం అనే మాటను వీరు చేసి చూపిస్తున్నారు. పలువురు యువ రైతులు వీరిని అనుసరిస్తున్నారు.

– పన్నాల కమలాకర్ రెడ్డి, సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్

డిమాండ్‌ను బట్టి పంట మార్చుతాం!

ఐదారు రకాల ఖర్బూజ కాయలు పండించేందుకు చాలా కష్టపడుతున్నాం. ఆ పంటను దళారులకు విక్రయిస్తే విత్తనాల ఖర్చు కూడా రావడం లేదు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రకాన్ని మార్చుతాం. నా పంటకు నేనే రాజును. నేరుగా అమ్ముతున్నాను. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రజలు మా దగ్గర కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌ను గమనించుకుంటూ.. భార్యభర్త కలిసి పనిచేస్తే వ్యవసాయం తృప్తిగా ఉంటుంది. మంచి ఆదాయమూ వస్తుంది.

– బండారి వెంకటేష్, విజయ (62818 13273)



సినెర్ ఖాతాలో మయామి మాస్టర్స్ టైటిల్...

ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ మూడో ప్రయత్నంలో మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫ్లోరిడాలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6–3, 6–1తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచాడు. 2021, 2023లలో రన్నరప్‌గా నిలిచిన సినెర్ ఈసారి మాత్రం టైటిల్‌ను వదల్లేదు. సినెర్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 16 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ టైటిల్‌తో సినెర్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి ఇటలీ ప్లేయర్‌గా నిలిచాడు.

పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా

స్లో ఓవర్ రేట్ కారణంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఆదివారం విశాఖపట్నంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన ఢిల్లీ హోం మ్యాచ్‌లో క్యాపిటల్స్ బౌలర్లు నిర్ణీత సమయంలో కోటా ఓవర్లు పూర్తి చేయలేదు. దీంతో ఐపీఎల్ నియమావళి ప్రకారం జట్టు కెప్టెన్ పంత్‌పై జరిమానా పడింది. ఈ సీజన్‌లో మూడు మ్యాచ్‌లాడిన ఢిల్లీ ఆదివారం నాటి మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది.



ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X లక్నో
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	3	3	0	6	1.249
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
లక్నో	2	1	1	2	0.025
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ముంబై 'మూడు'పోయింది

ముంబై ఇన్నింగ్స్... తొలి 21 బంతుల్లో 20 పరుగులు, 4 వికెట్లు... ఇందులో రోహిత్ శర్మ సహా ముగ్గురు తొలి బంతికే డకౌట్... ముంబై ఇన్నింగ్స్ మొదలవడంతోనే ముగిసినట్లు అనిపించింది... బౌల్ట్ కొట్టిన ఈ దెబ్బ తర్వాత కొంత కోలుకున్నా 125 పరుగుల స్కోరు ఏమాత్రం సరిపోలేదు... రాజస్తాన్ రాయల్స్ అలవోకగా మరో 27 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించేసింది... సొంతగడ్డపై కూడా బోణీ చేయలేకపోయిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో ఇంకా గెలుపు ఖాతా తెరవని ఏకైక జట్టుగా నిలిచింది.

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓటమి


- రాజస్తాన్ 'హ్యాట్రిక్' విజయం
- గెలిపించిన బౌల్ట్, చహల్, పరాగ్


రోహిత్, హార్దిక్

ముంబై: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో పరాజయాల 'హ్యాట్రిక్' నమోదు చేసింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆ జట్టు ఓటమి పాలైంది. సోమవారం జరిగిన పోరులో రాజస్తాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో ముంబైను ఓడించి విజయాల 'హ్యాట్రిక్' సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులే చేసింది. హార్దిక్ పాండ్యా (21 బంతుల్లో 34; 6 ఫోర్లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 32; 2 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (3/22) పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఆరంభంలోనే దెబ్బ తీయగా... చహల్‌కు కూడా 3 వికెట్లు దక్కాయి. అనంతరం రాజస్తాన్ 15.3 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. రియాన్ పరాగ్ (39 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో గెలిపించాడు.

టపటపా...

రాజస్తాన్ బౌలింగ్ ధాటికి ముంబై బ్యాటింగ్ ఆరంభంలోనే కకావికలమైంది. బౌల్ట్ ధాటికి రోహిత్ శర్మ (0) తొలి బంతికే అవుట్ కాగా, తర్వాతి బంతికే నమన్ ధీర్ (0) వెనుదిరిగాడు. ఐపీఎల్‌లో అతి 'తొందరగా' రెండో ఓవర్లోనే ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన బ్రెవిస్ (0) కూడా తన తొలి బంతికే పెవిలియన్ చేరాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (16) వికెట్ బర్గర్ ఖాతాలో పడింది. స్కోరు 20/4కు చేరిన దశలో తిలక్, పాండ్యా కొద్ది సేపు నిలిచి జట్టును ఆదుకున్నారు. బర్గర్ ఓవర్లో 3 ఫోర్లతో పాండ్యా ధాటిని ప్రదర్శించాడు. అయితే ఐదో వికెట్‌కు 36 బంతుల్లో 56 పరుగులు జోడించిన తర్వాత ముంబైని చహల్ దెబ్బ తీశాడు. తక్కువ వ్యవధిలో అతను పాండ్యా, తిలక్‌లను అవుట్ చేయడంతో ముంబై పరిస్థితి మరింత దిగజారింది. తిలక్ వెనుదిరిగాక జట్టు కోలుకోలేక పోయింది. అతను అవుటైన తర్వాత 40 బంతుల్లో 30 పరుగులే వచ్చాయి. టిమ్ డేవిడ్ (17) కూడా ప్రభావం చూపలేకపోయాడు.


బౌల్ట్

రాణించిన పరాగ్...

లక్ష్యం చిన్నదే అయినా రాయల్స్ ఇన్నింగ్స్ కాస్త తడబాటుకు లోనైంది. తొలి ఓవర్లోనే యశస్వి (10) వెనుదిరగ్గా... సంజూ సామ్సన్ (12), బట్లర్ (13) కూడా విఫలమయ్యారు. అయితే పరాగ్ జాగ్రత్తగా ఆడి జట్టును విజయం దిశగా నడిపించాడు. అశ్విన్ (16)తో కలిసి అతను ఐదో వికెట్‌కు 40 పరుగులు జత చేశాడు. విజయానికి 15 పరుగులు కావాల్సిన దశలో పరాగ్ వరుసగా 6, 6, 4 బాది ముగించాడు. ఈ క్రమంలో 38 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది.

అభిమానులు...అదే తీరు!

హార్దిక్ పాండ్యాకు ముంబై సొంత మైదానం వాంఖెడేలోనూ ఫ్యాన్స్ నుంచి నిరసన ఎదురైంది. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడంతో ఆగ్రహంగా ఉన్న అభిమానులు గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే ఈసారి కూడా పాండ్యా పేరు వినిపించినప్పుడల్లా గేలి చేశారు. టాస్‌కు వచ్చినప్పుడు మాట్లాడకుండా అంతరాయం కలిగించారు. చివరకు వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ 'మర్యాద పాటించండి' అని చెప్పినా జనం పట్టించుకోలేదు. అనంతరం ముంబై ఫీల్డింగ్ సమయంలో ఒక అభిమాని నేరుగా గ్రౌండ్‌లో రోహిత్ వద్దకు వెళ్లి కౌగిలించుకోవడం భద్రతా సిబ్బంది వైఫల్యాన్ని చూపించింది. అనూహ్యంగా దూసుకొచ్చిన ఫ్యాన్ రోహిత్ కూడా ఒక్కసారిగా భయపడిపోయాడు!

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) సామ్సన్ (బి) బర్గర్ 16; రోహిత్ (సి) సామ్సన్ (బి) బౌల్ట్ 0; నమన్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 0; బ్రెవిస్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 0; తిలక్ (సి) అశ్విన్ (బి) చహల్ 32; పాండ్యా (సి) (సబ్) పావెల్ (బి) చహల్ 34; చావ్లా (సి) హెట్‌మైర్ (బి) అవేశ్ 3; డేవిడ్ (సి) బౌల్ట్ (బి) బర్గర్ 17; కొయెట్జీ (సి) హెట్‌మైర్ (బి) చహల్ 4; బుమ్రా (నాటౌట్) 8; ఆకాశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 125. వికెట్ల పతనం:** 1–1, 2–1, 3–14, 4–20, 5–76, 6–83, 7–95, 8–111, 9–114. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–22–3, బర్గర్ 4–0–32–2, అవేశ్ ఖాన్ 4–0–30–1, చహల్ 4–0–11–3, అశ్విన్ 4–0–27–0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) డేవిడ్ (బి) మఫాకా 10; బట్లర్ (సి) చావ్లా (బి) ఆకాశ్ 13; సామ్సన్ (బి) ఆకాశ్ 12; పరాగ్ (నాటౌట్) 54; అశ్విన్ (సి) తిలక్ (బి) ఆకాశ్ 16; శుభమ్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (15.3 ఓవర్లలో 4 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1–10, 2–42, 3–48, 4–88. **బౌలింగ్:** మఫాకా 2–0–23–1, బుమ్రా 4–0–26–0, ఆకాశ్ మధ్వాల్ 4–0–20–3, కొయెట్జీ 2.3–0–36–0, పీయూష్ చావ్లా 3–0–18–0.

మీరాబాయికి 'పారిస్' బెర్త్ లాంఛనమే!

వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్



బ్యాంకాక్: భారత స్టార్ మహిళా లిఫ్టర్ మీరాబాయి చాను పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం దాదాపు ఖరారైంది. అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) ప్రపంచకప్‌లో సోమవారం జరిగిన మహిళల 49 కేజీల ఈవెంట్‌లో టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి మూడో స్థానంలో నిలిచింది. 6 నెలల విరామానంతరం బరిలోకి దిగిన ఆమె గ్రూప్ 'బి'లో పోటీపడి మొత్తం 184 కేజీల (81+103) బరువెత్తింది. తద్వారా మీరా మూడో స్థానంలో నిలిచింది. ఫలితమిలా ఉన్నప్పటికీ తప్పనిసరి టోర్నీల్లో పాల్గొనడంతో పాటు, 49 కేజీల కేటగిరీలో ఆమె ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉంది. చైనా లిఫ్టర్ జియాన్ హుయ్‌హువా అగ్రస్థానంలో ఉండగా, ప్రతి కేటగిరీ నుంచి టాప్–10 లిఫ్టర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు లభిస్తాయి. దీంతో 2017 ప్రపంచ చాంపియన్ మీరాబాయి జూలైలో జరిగే ఒలింపిక్స్‌కు అర్హత పొందడం లాంఛనం కానుంది. ప్రపంచకప్ ముగిశాక క్వాలిఫయర్ల జాబితాను అధికారికంగా ప్రకటిస్తారు. మణిపూర్‌కు చెందిన మీరాబాయికివి వరుసగా మూడో ఒలింపిక్స్ క్రీడలు కానున్నాయి. రియో ఒలింపిక్స్‌లో మీరాబాయి విఫలంకాగా, టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం సొంతం చేసుకుంది.

శాసించే స్థితిలో శ్రీలంక



చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక మూడో రోజే శాసించే స్థితిలో నిలిచింది. తద్వారా క్లీన్‌స్వీప్ దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 55/1తో సోమవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 68.4 ఓవర్లలో 178 పరుగులకే కుప్పకూలింది. లంక పేసర్లు అసిత ఫెర్నాండో 4, విశ్వ ఫెర్నాండో, లహిరు కుమార చెరో 2 వికెట్లు తీశారు. లంకకు తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 6 వికెట్లకు 102 పరుగులు చేసింది. మాథ్యూస్ (39 బ్యాటింగ్; 3 ఫోర్లు), ప్రభాత్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం లంక 455 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది.



మళ్లీ నంబర్‌వన్‌గా బోపన్న

ఫ్లోరిడా: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. గతవారం రెండో ర్యాంక్‌లో నిలిచిన 44 ఏళ్ల రోహన్ బోపన్న తన భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. దాంతో సోమ వారం విడుదల చేసిన ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో బోపన్న ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ 95వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. గత వారం 97వ ర్యాంక్‌లో నిలిచిన సుమిత్ రెండు స్థానాలు పురోగతి సాధించాడు. భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్ 61 స్థానాలు ఎగబాకి 349వ ర్యాంక్‌లో నిలిచాడు.

సినిమా


త్రిష
సమంత

కథ వినగానే మా నాన్న గుర్తొచ్చారు

''మనకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ధైర్యం చెప్పే వ్యక్తి కుటుంబంలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో ఫ్యామిలీ స్టార్ మా నాన్న గోవర్ధన్. 'ఫ్యామిలీ స్టార్' కథ వింటున్నప్పుడు నాకు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో హీరో పాత్రకి గోవర్ధన్ అనే పేరు పెట్టమని పరశురామ్‌కి చెప్పాను. ఈ నెల 8న మా నాన్న పుట్టినరోజు. 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విషయంలో ఆయన గర్వపడతారని ఆశిస్తున్నాను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''రాజుగారి బ్యానర్‌లో నేను 'కేరింత' సినిమా ఆడిషన్‌కు వెళ్లి, సెలెక్ట్ కాలేదు. ఇప్పుడు 'ఫ్యామిలీ స్టార్' చేశాను. లాక్ డౌన్‌లో నా స్టాఫ్ జీతాలు, మెయింటెనెన్స్‌కి ఇబ్బంది కలిగింది. అప్పుడు రాజుగారే పంపించారు.. ఆయనకు సినిమా చేయాలని అప్పుడే అనుకున్నా. ఈ సినిమాకి నాకు పేరొస్తే ఆ క్రెడిట్ పరశురామ్‌కి ఇస్తాను'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''విజయ్, పరశురామ్ కలిసి 'గీత గోవిందం' వంటి బ్లాక్ బస్టర్ చేశారు. 'ఫ్యామిలీ స్టార్' కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. విజయ్ ఈ సినిమాలో 360 డిగ్రీస్ క్యారెక్టర్ చేశాడు. నిర్మాతల గురించి ఆలోచించే హీరో విజయ్. అందుకే అతనితో మరో రెండు సినిమాలు చేయబోతున్నా'' అన్నారు. ''ఫ్యామిలీ స్టార్'లో ఇందు పాత్రను పోషించగలనా? లేదా అని భయపడ్డాను. కానీ, విజయ్, 'దిల్' రాజు, డైరెక్టర్‌గార్లు సపోర్ట్ ఇచ్చారు'' అన్నారు మృణాల్ ఠాకూర్.

– విజయ్ దేవరకొండ


మృణాల్, విజయ్ దేవరకొండ, 'దిల్' రాజు

కష్టాల్లో మంకీ మేన్?


'మంకీ మేన్' పోస్టర్

'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ నటుడు దేవ్ పటేల్ తొలి ప్రయత్నంగా దర్శకత్వం వహించిన చిత్రం 'మంకీ మేన్'. ఈ చిత్రంలో కిడ్ అనే లీడ్ రోల్‌లోనూ నటించారు దేవ్. కాగా ఈ నెల 5న యూఎస్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇండియాతో పాటు పలు దేశాల్లో ఈ నెల 19న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఇండియాలో 'మంకీ మేన్' కష్టాలు ఎదుర్కొంటోందని టాక్. ఇప్పటికే ఈ చిత్రం పలు విదేశీ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కాగా వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తొలి చిత్రం అయినా దేవ్ అద్భుతంగా తీశాడనీ, కాన్సెప్ట్ బాగుందనీ అక్కడివారు అంటున్నారు. అయితే కాన్సెప్ట్ విషయంలోనే ఇండియాలో 'మంకీ మేన్'కి కష్టాలు ఎదురవుతున్నాయనే వార్త ప్రచారంలోకి వచ్చింది. తన తల్లిని చంపినవారిపై పగ తీర్చుకోవడానికి హీరో హనుమంతుడి వేషంలోకి మారడం అనేది ఈ చిత్రం ప్రధానాంశం. ఆ వేషంలో అతను చేసే మారణకాండ మరీ హింసాత్మకంగా ఉందని, కొందరి ప్రేక్షకుల మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉందని ఇక్కడి సెన్సార్ బోర్డ్ భావిస్తోందట. అందుకే ఈ నెల 19న ఇండియాలో 'మంకీ మేన్' రిలీజ్ కాకపోవచ్చని భోగట్టా. సెన్సార్ చెప్పిన మార్పులు చేసి, 25న విడుదల చేస్తారని సమాచారం. ఇక ఈ చిత్రం ద్వారా తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళ హాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. ఇంకా మకరంద్ దేశ్‌పాండే, సికందర్ ఖేర్, అశ్వినీ కల్సేకర్ వంటి పలువురు భారతీయ తారలు కూడా ఈ చిత్రంలో నటించారు.

ఉగాదికి టైటిల్

అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నంబర్ 9గా ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రం టైటిల్‌ను ఈ నెల 9న ఉగాది సందర్భంగా ప్రకటించనున్నట్లు పేర్కొని ప్రీ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. పుర్రెలు, అగ్ని, మంచు పర్వతాల మధ్య నడుస్తున్న అఘోరా లుక్ పోస్టర్‌లో ఉంది. పోస్టర్‌పై స్మరామి నారాయణన్ తత్వమవ్యయం అని రాసి ఉంది. ''లార్జర్ దెన్ లైఫ్ కథతో, ఆధ్యాత్మిక నేపథ్యంలో భారీ ఎత్తున ఈ సినిమాని రూపొందించనున్నాం. పూర్తి వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని నిర్మాణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

అల్లు అర్జున్‌కి జోడీగా..?

'పుష్ప: ది రైజ్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన 'పుష్ప: ది రూల్' సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పూర్తయిన తర్వాత తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అందులో భాగంగానే హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులను ఫైనల్ చేసే పనిలో పడ్డారట అట్లీ. కాగా ఈ మూవీలో అల్లు అర్జున్‌కి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో సమంత, త్రిష పేర్లు వినిపిస్తున్నాయి. తొలుత త్రిష పేరు తెరపైకి వచ్చింది. అల్లు అర్జున్‌కి ఆమె జోడీగా నటించనున్నారనే వార్తలు కోలీవుడ్‌లో హల్‌చల్ చేశాయి. అయితే తాజాగా సమంత పేరు వినిపిస్తోంది. అట్లీ దర్శకత్వం వహించిన 'తేరి' సినిమాలో విజయ్‌కి జోడీగా నటించారు సమంత. అలాగే 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రంలో అల్లు అర్జున్‌తో జతకట్టారీ బ్యూటీ. అలాగే 'పుష్ప: ది రైజ్' మూవీలో 'ఊ అంటావా...' అంటూ ప్రత్యేక పాట చేశారు. తాజాగా వీరి జోడీ రిపీట్ కానుందనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి అల్లు అర్జున్ సరసన నటించేది సమంతా? త్రిషా? లేకుంటే ఇద్దరూ నటిస్తారా? ఈ ఇద్దరూ కాకుండా వేరే కథానాయిక నటిస్తారా? అనే విషయం తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాలి. ఈ అక్టోబర్‌లో అల్లు అర్జున్–అట్లీ మూవీ సెట్స్ మీదకు వెళ్లనుందని టాక్.

టాక్సిక్‌లో ఫిక్స్?

'కేజీఎఫ్'తో పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయిన యశ్ హీరోగా రూపొందనున్న తాజా చిత్రం 'టాక్సిక్'. ఈ చిత్రం గురించి ఏదో ఒక వార్త ప్రచారంలోకి వస్తోంది. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో కథానాయిక ఎవరు? అనేది ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. ఈ చిత్రంలో యశ్‌కి సోదరిగా కరీనా కపూర్ ఫిక్స్ అనే వార్త వచ్చిన నేపథ్యంలో తాజాగా కథానాయికలుగా శ్రుతీహాసన్, కియారా అద్వానీ ఫిక్స్ అనే వార్త వైరల్‌గా మారింది. ఈ ఇద్దరూ దాదాపు ఖరారైనట్లేనని భోగట్టా. ముఖ్యంగా 'టాక్సిక్'లో శ్రుతీ ఎంట్రీ షురూ అనడానికి ఓ ఉదాహరణ కూడా ఉంది. ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ను శ్రుతీహాసన్ పాడారు. సో... సినిమాలో ఓ కథానాయికగా ఆమె నటించే చాన్స్ ఉందని భోగట్టా. త్వరలో ఈ చిత్రం ఆరంభం కానుంది. మరి.. హీరోయిన్లుగా శ్రుతి, కియారా ఫిక్స్ అయ్యారా? అనేది త్వరలోనే తెలిసిపోతుంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది.


కియారా
శ్రుతీహాసన్

థ్రిల్లింగ్ కేస్


అజయ్

అజయ్, రవి ప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నంబర్ 15'. తడకల వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో బీజీ వెంచర్స్‌పై నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం టీజర్‌ని తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, ట్రైలర్‌ని నిర్మాత సి. కల్యాణ్ విడుదల చేయగా, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ లిరికల్ వీడియోను లాంచ్ చేశారు. చిత్ర దర్శక–నిర్మాత తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ–''సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కేస్ నంబర్ 15'. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి'' అన్నారు.

లక్ష్యం ఏంటి?

''భరతనాట్యం' సినిమా కథ ఫ్రెష్‌గా అనిపిస్తుంది. పాత్రలకు ఎదురైన పరిస్థితులు ప్రేక్షకులని నవ్విస్తాయి. చాలా పాత్రలున్నప్పటికీ వాటి లక్ష్యం ఒకటే ఉంటుంది. అది ఏంటి? అన్నది సినిమాలో చూడాలి'' అన్నారు డైరెక్టర్ కేవీఆర్ మహేంద్ర. సూర్యతేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా నటించిన చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 5న విడుదలవుతోంది. కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ– ''నేను తీసిన 'దొరసాని' దర్శకుడిగా తృప్తినిచ్చింది. ఆ సినిమా తర్వాత ఓ ప్రముఖ హీరోతో క్రైమ్ కామెడీ మూవీ అనుకున్నా. కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. సూర్యతేజ చెప్పిన 'భరతనాట్యం' ఐడియా నచ్చడంతో స్క్రిప్ట్ వర్క్ చేసి, ఆ తర్వాత ఈ మూవీ చేశాం. 'భరతనాట్యం' లాంటి ఎలిమెంట్‌తో ఇప్పటివరకూ సినిమా రాలేదు'' అన్నారు.


కేవీఆర్ మహేంద్ర

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
363	135
74,015	22,462

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,360	▼	19
డోజోన్స్	39,539	▼	269
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲	21
డాక్స్	18,492	▲	15
షాంఘై	3,077	▲	36
నికాయ్	39,803	▼	566

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	68,663
బంగారం (99.5 స్వచ్ఛత)	68,388
వెండి (కేజీ)	75,111

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.57	85.25
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	102.78	107.69
€	యూరో	భారతీయ	87.75	92.21
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	42.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	51.94	56.82
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.47	64.19
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.33	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.81	23.60
¥	చైనా యువాన్	భారతీయ	10.41	12.49



ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యత కావాలి!

90 సంవత్సరాల స్మారకోత్సవ కార్యక్రమంలో ఆర్‌బీఐకి ప్రధాని మోదీ పిలుపు

ముంబై: ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, విశ్వాసాన్ని పెంపొందించడంసహా వచ్చే దశాబ్ద కాలంలో దేశాభివృద్ధే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రధాన ప్రాధాన్యత కావాలని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆర్‌బీఐ 90 సంవత్సరాల స్మారకోత్సవ కార్యక్రమాన్ని ముంబైలో ప్రారంభించిన సందర్భంగా మోదీ ప్రసంగించారు. భారత్ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి రాబోయే దశాబ్దం ఎంత ముఖ్యమో, ఆర్‌బీఐ 2035 నాటికి 100 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక స్వావలంబన, అంతర్జాతీయంగా రూపాయికి మరింత ఆమోదయోగ్యత వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రధానికి ఈ సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఒక జ్ఞాపికను అందజేశారు. భారత దేశ ఆర్థిక ప్రగతికి మూలస్తంభంగా పనిచేసే స్థిరమైన, బలమైన ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడంపై ఆర్‌బీఐ దృష్టి సారిస్తుందని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ అపార అనుభవం, నైపుణ్యతలు అంతర్జాతీయ అనిశ్చితులను ఎదుర్కొనడంలో దోహదపడిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కార్యక్రమంలో పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బెయిస్, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, ఆర్థిక శాఖ సహాయ మంత్రులు భగవత్ కిషన్‌రావ్ కరాడ్, పంకజ్ చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగారం మెరుపులు

- న్యూఢిల్లీలో ఒకేరోజు 1,070 అప్
- ఆల్‌టైమ్ హై రూ. 68,420కి చేరిక



న్యూఢిల్లీ: అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు తగ్గుతుందన్న అంచనాలు, ఈజీ మనీ విశ్లేషణలు, ద్రవ్యోల్బణం భయాలు బంగారం ధరను గరిష్ట స్థాయిలకు తీసుకువెళుతున్నాయి. చైనా డిమాండ్ కూడా పసిడి పరుగుకు కారణమవుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర సోమవారం ఒకేరోజు రూ.1,070 ఎగసి, రూ.68,420కి ఎగసింది. ఇక వెండి కూడా కేజీకి రూ.1,120 ఎగసి రూ.78,570కి చేరింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో చూస్తే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.68,800కు చేరింది. 22 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.63,296కు ఎగసింది. విజయవాడలో ఈ ధరలు వరుసగా రూ.70,700, రూ.65,000గా నమోదయ్యాయి. విశాఖలో వరుసగా రూ.71,000, రూ.64,000 వరకూ ఎగశాయి. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఫ్యూచర్స్‌లో జూన్ కాంట్రాక్ట్ ధర ఒక దశలో రూ.978 ఎగసి రూ.68,679కి చేరింది. విదేశీ మార్కెట్లలో స్పాట్ కామెక్స్ బంగారం ధరలు ఔన్స్‌కు (31.1గ్రాములు) 2,266 డాలర్లకు పెరిగింది.

ఏపీలో అరబిందో ప్లాంట్లు ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన ప్లాంట్లు ప్రారంభం అయ్యాయి. కాకినాడ సెజ్‌లో లైఫియస్ ఫార్మా నెలకొల్పిన 15,000 మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యంగల పెన్‌-జి ప్లాంటుతోపాటు 1.8 లక్షల మెట్రిక్ టన్నుల గ్లూకోజ్ ఫెసిలిటీలో ఉత్పత్తి ప్రారంభం అయింది. ఇదే సెజ్‌లో క్యూల్ ఫార్మా స్థాపించిన 3,600 మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యంగల 6–అమినో పెనిసిలానిక్ యాసిడ్ (6–ఏపీఏ) కేంద్రంలో కార్యకలాపాలు మొదలయ్యాయి. పూర్తిగా ఎగుమతుల కోసం అనకాపల్లి జిల్లాలోని తాడి వద్ద యూజియా స్టెరైల్స్ ఏర్పాటు చేసిన 28.5 కోట్ల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంగల ఆంపూల్స్, వయల్స్ ప్లాంటు షురూ అయింది. శ్రీకాకుళం జిల్లాలో ఆరోయాక్టివ్ ఫార్మాకు చెందిన ఏటా 13,200 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయగల రెడీ టు కంప్రెస్ గ్రాన్యులేటెడ్ ప్రొడక్ట్స్ ప్లాంటులోనూ కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి.

జీఆర్‌టీ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్' విజేతలకు బహుమతులు

హైదరాబాద్: పండుగ సీజన్ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ నిర్వహించిన 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్'లో పాల్గొన్న కస్టమర్లలో 1,062 మంది విజేతలుగా ఎన్నికయ్యారు. గతేడాది డిసెంబర్ 23 నుంచి ఈ జనవరి 31 మధ్య జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూంల్లో రూ.5వేలకు పైగా కొనుగోలు చేసిన కస్టమర్లకు బహుమతులు గెలుచుకునే అవకాశం అందించింది. మొత్తం 1062 విజేతల్లో 24 మంది మహీంద్రా ఎక్స్‌యూవీలు, 47 మంది రూ.2 లక్షల విలువైన వజ్రాల నెక్లెస్‌లు, 47 మంది టీవీఎస్ జూపిటర్ 125 సీసీ బైకులు, 236 మంది (ఒక్కొక్కరికి) 10 గ్రాముల బంగారు నాణేలు, 708 మంది (ఒక్కొక్కరికి) 100 గ్రాముల వెండి నాణేలు అందుకున్నారు.

42 లక్షల వాహన విక్రయాలు

2023– 24లో రికార్డు స్థాయి అమ్మకాలు ● 2022–23తో పోల్చితే 9 శాతం అధికం



న్యూఢిల్లీ: 2023–24 ఆర్థిక సంవత్సరం ఆటో పరిశ్రమకు కలిసొచ్చింది. మొత్తం అన్ని కంపెనీలు కలిపి 42.30 లక్షల ప్యాసింజర్ వాహనాలు విక్రయించాయి. 2022–23లో అమ్ముడైన 38.9 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 9% అధికం. ప్రయాణికుల వాహనాల వాటాలో స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల వాటా 43% నుంచి 50.04 శాతానికి పెరిగింది. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రాఅండ్‌మహీంద్రా(ఎంఅండ్‌ఎం), ఎంజీ మోటార్స్, టయోటా, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్స్ కంపెనీలు డీలర్లకు రికార్డు స్థాయిలో వాహనాలను సరఫరా చేశాయి.

- మారుతీ సుజుకీ 2022–23లో మొత్తం 19,66,164 వాహనాలను విక్రయించగా, ఈ సంఖ్య 8% పెరిగి 21,35,323 లక్షలకి చేరింది. ఇందులో దేశీయ సరఫరాలే 17,59,881 యూనిట్లు. కాగా ఒక్క మార్చిని తీసుకుంటే, కంపెనీ వార్షికంగా 10 శాతం వృద్ధితో 1.87 లక్షల వాహనాలను విక్రయించింది.
- ద్విచక్ర వాహన విభాగంలో 2023–24లో టీవీఎస్ మోటార్స్ 41.91 లక్షల యూనిట్లను, సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా 11.33 లక్షల వాహనాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ 8.34 లక్షల వాహనాలను విక్రయించాయి.

ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్

కొత్త నిబంధన అమల్లోకి



న్యూఢిల్లీ: 'ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్' నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పలు వాహనాలకు ఒకే ఫాస్టాగ్‌ను వాడటం లేదా ఒకే వాహనానికి పలు ఫాస్టాగ్‌లను వాడటం వంటి ధోరణులను నివారించేందుకు దీన్ని ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వ రంగ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి ఒకరు తెలిపారు. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత సమర్థమంతంగా తీర్చిదిద్దేందుకు, టోల్ ప్లాజాల దగ్గర రద్దీని తగ్గించి.. వాహనాలు నిరాటంకంగా రాకపోకలు సాగించే వీలు కల్పించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ 'ఒక వాహనం ఒక ఫాస్టాగ్' విధానాన్ని ప్రతిపాదించింది.

మార్చిలో జీఎస్‌టీ వసూళ్ల సునామీ



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ చక్కటి పనితీరుకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అద్దం పడుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం చివరినెల మార్చిలో అంతక్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే వసూళ్లు 11.5 శాతం ఎగశాయి. విలువలో రూ.1.78 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ చూస్తే జీఎస్‌టీ వసూళ్లు వార్షికంగా 11.7 శాతం వృద్ధితో రూ.20.14 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ వసూళ్లు సగటున రూ.1.68 లక్షల కోట్లు. గత ఏడాది ఇదే కాలంలో ఈ సగటు రూ. 1.5 లక్షల కోట్లు. ఇక తాజా సమీక్షా నెల్లో వసూళ్లు కొత్త పరోక్ష పన్నుల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత (2017 జూలై 1) అతి పెద్ద రెండవ భారీ వసూళ్లు. గత ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే (2023 ఏప్రిల్) రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు (రూ.1.87 లక్షల కోట్లు) నమోదయిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

2-4-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
హైదరాబాద్	380–00
వరంగల్	382–00

కొత్త ఆర్థిక సంవత్సరానికి లాభాల స్వాగతం

- ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాలు నమోదు చేసిన సూచీలు
- 74 వేల స్థాయిపైన సెన్సెక్స్
- 135 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 3 రోజుల్లో రూ.10.58 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: కొత్త ఆర్థిక సంవత్సరానికి(2024–25) దేశీయ స్టాక్ సూచీలు సరికొత్త రికార్డుతో స్వాగతం పలికాయి. దలాల్ స్ట్రీట్‌లో మూడోరోజూ బుల్ జోరు కొనసాగడంతో సోమవారం ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. ఫెడ్ వడ్డీరేటు తగ్గుతుందన్న అంచనాలుసహా ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, మెటల్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 602 పాయింట్లు పెరిగి 74,253 వద్ద, నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,530 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు దాదాపు సగం లాభాలు కోల్పోయాయి. ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 363 పాయింట్లు పెరిగి 74,015 వద్ద, నిఫ్టీ 135 పాయింట్ల లాభంతో 22,462 వద్ద నిలిచాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.64%, 2.98% చొప్పున రాణించాయి. బ్యాంకుల వార్షిక ఖాతా ముగింపు సందర్భంగా ఫారెక్స్ మార్కెట్ పనిచేయలేదు. ఈస్టర్ రోజు కావడంతో యూరప్ మార్కెట్లు పనిచేయలేదు.

మార్కెట్లో మరిన్ని సంగతులు



- ఆర్థిక రికవరీకి సంకేతంగా చైనా తయారీ రంగ పీఎంఐ గణాంకాలు మెప్పించడంతో దేశీయ మెటల్ షేర్లు మెరిశాయి.
- మార్కెట్ ర్యాలీలో భాగంగా అదానీ గ్రూప్ షేర్లు రాణించాయి.
- గడిచిన మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,544(2.13%) ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.10.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 393.24 లక్షల కోట్లకు చేరింది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 968 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు/శాఖల్లో గ్రూప్‌–బి(నాన్ గెజిటెడ్) జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడదల చేసింది. అర్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 968
» **అర్హత:** డిప్లొమా(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్) తత్సమానం లేదా డిగ్రీ (సివిల్ /మెకానికల్/ఎలక్ట్రికల్) చదివినవారు అర్హులు.
» **వయసు:** సీపీడబ్ల్యూడీ విభాగం పోస్టులకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. వివిధ కేటగిరీల వారికి వయోపరిమితుల్లో సడలింపులు లభిస్తాయి.
» **వేతనం:** సెవెన్త్ పే స్కేల్ ప్రకారం–రూ.35,400 నుంచి రూ.1,12,400 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** రెండు దశల్లో జరుగుతుంది. పేపర్‌–1, పేపర్‌–2 ఉంటాయి.
రెండు పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. పేపర్‌–1లో మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(50 ప్రశ్నలు–50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(50 ప్రశ్నలు–50 మార్కులు), జనరల్ ఇంజనీరింగ్(100 ప్రశ్నలు–100 మార్కులు) విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. పేపర్‌–2లో జనరల్ ఇంజనీరింగ్ విభాగం(100 ప్రశ్నలు–300 మార్కులు) నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.04.2024
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష(పేపర్‌–1):** 04.06.2024 నుంచి 06.06.2024వరకు
» **పేపర్‌–2 పరీక్ష:** త్వరలో తేదీ ప్రకటిస్తారు.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

ఎన్‌టీఏ-జిప్‌మ్యాట్-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జిప్‌మ్యాట్)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ సంయుక్తంగా అందిస్తున్న ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తుంది.

» **కోర్సు వ్యవధి:** ఐదేళ్లు.
» **బోధనాంశాలు:** లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఎథికల్ అండర్ స్టాండింగ్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/10+2(ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్) ఉత్తీర్ణులై ఉండాలి. 2022, 2023 సంవత్సరాల్లో లేదా 2024 చివరి సంవత్సరంలో పరీక్షలు రాసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ).
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులకు చివరితేది:** 21.04.2024.
» **పరీక్ష తేది:** 06.06.2024.
» **వెబ్‌సైట్:** http://www.jipmat.ac.in

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 143 పోస్టులు

ముంబై కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా.. దేశవ్యాప్తంగా బ్యాంక్ శాఖల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ఆఫీసర్ (ఎంఎంజీఎస్ –2/ఎస్ఎంజీఎస్ –4/ ఎంఎంజీఎస్‌–3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** క్రెడిట్ ఆఫీసర్‌–25, చీఫ్ మేనేజర్‌–09, లా ఆఫీసర్‌–56, డేటా సైంటిస్ట్‌–02, ఎంఎల్ ఓపీఎస్ ఫుల్‌స్టాక్ డెవలపర్‌–02, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్‌–02, డేటా క్వాలిటీ డెవలపర్‌–02, డేటా గవర్నెన్స్ ఎక్స్‌పర్ట్‌–02, ప్లాట్‌ఫాం ఇంజనీరింగ్ ఎక్స్‌పర్ట్‌–02, లైనక్స్ అడ్మినిస్ట్రేటర్‌–02, ఒరాకిల్ ఎక్సాడాటా అడ్మినిస్ట్రేటర్‌–02, సీనియర్ మేనేజర్‌–35, ఎకనామిస్ట్‌–01, టెక్నికల్ అనలిస్ట్‌–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్, డిగ్రీ, పీజీ, పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు ఎంఎంజీఎస్‌–2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810 /ఎస్ఎంజీఎస్‌–4 పోస్టులకు రూ.76,010 నుంచి రూ.89,890/ఎంఎంజీఎస్‌–3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.1,05,280.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2024.
» **వెబ్‌సైట్:** https://bankofindia.co.in

ఎంబీఏ, ఎంసీఏకు మార్గం.. ఐసెట్

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్..సంక్షిప్తంగా ఐసెట్! రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు సుపరిచితమైన ఎంట్రన్స్ టెస్ట్ ఇది! ఈ ఎంట్రన్స్‌లో ర్యాంకుతో.. మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అందించే ఎంబీఏ.. కంప్యూటర్ స్కిల్స్ అందించే ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఎంబీఏ కోర్సుతో కార్పొరేట్ రంగంలో, ఎంసీఏతో సాఫ్ట్‌వేర్ రంగంలో కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఐసెట్-2024 నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ, టీఎస్ ఐసెట్ పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ గైడెన్ తదితర వివరాలు..

» ఏపీ, టీఎస్‌లో ఐసెట్ 2024 నోటిఫికేషన్ విడుదల
» ఏపీలో మే 6,7 : టీఎస్‌లో జూన్ 5, 6 తేదీల్లో ఐసెట్
» ఐసెట్ స్కోర్‌తో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం
» మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో కెరీర్ అవకాశాలు



టీఎస్/ఏపీ ఐసెట్‌-అర్హతలు

- ఎంబీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఎంసీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల వ్వాలి. దీంతోపాటు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- రిజర్వేషన్ వర్గాలకు కనీస ఉత్తీర్ణత 45 శాతం.

200 మార్కులకు ఏపీ ఐసెట్

- ఏపీ ఐసెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. మొత్తం మూడు విభాగాల్లో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- సెక్షన్‌–ఎలో అనలిటికల్ ఎబిలిటీ పేరుతో డేటా సఫిషియన్సీ(20 ప్రశ్నలు–20 మార్కులు), ప్రాబ్లమ్ సాల్వింగ్ (55 ప్రశ్నలు–55 మార్కులు) నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్ బీలో కమ్యూనికేషన్ ఎబిలిటీ మొత్తం 70 మార్కులకు ఉంటుంది. ఇందులో వొకాబ్యులరీ 15 ప్రశ్నలు–15 మార్కులకు, ఫంక్షనల్ గ్రామర్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ 15 ప్రశ్నలు–15 మార్కులకు, రీడింగ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు –20 మార్కులకు ఉప విభాగాలుగా ఉంటాయి
- సెక్షన్ సీలో మ్యాథమెటికల్ ఎబిలిటీ మొత్తం 55 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్థమెటికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులకు, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి.

టీఎస్ ఐసెట్ ఇలా

- టీఎస్ ఐసెట్ ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. •ఇందులో మూడు విభాగాలు 200 మార్కులకు ఉంటాయి.
- సెక్షన్‌–ఎలో అనలిటికల్ ఎబిలిటీ పేరుతో డేటా సఫిషియన్సీ 20 ప్రశ్నలు–20 మార్కులకు, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు–55 మార్కులకు ఉంటాయి. ఇలా మొత్తం 75 ప్రశ్నలు–75 మార్కులకు సెక్షన్ ఏ ఉంటుంది.
- సెక్షన్‌–బి మ్యాథమెటికల్ ఎబిలిటీలో.. అర్థమెటికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు–30 మార్కులకు, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులకు అడుగుతారు. ఇలా మొత్తం 75 ప్రశ్నలు–75 మార్కులకు ఈ సెక్షన్ ఉంటుంది.
- కమ్యూనికేషన్ ఎబిలిటీ విభాగాన్ని సెక్షన్‌–సిగా నిర్వహిస్తారు. ఈ విభాగానికి మార్కులు కూడా 50 మార్కులు ఉంటాయి.

బెస్ట్ స్కోర్ సాధించేలా

ఐసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అభ్యర్థులు విశ్లేషణాత్మక దృక్పథం, అన్వయ నైపుణ్యాలను అలవర్చుకోవాలి. పరీక్ష తీరు, సిలబస్ స్థాయిపై అవగాహన పొందాక విభాగాల వారీగా ప్రిపరేషన్ కొనసాగించాలి.

డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్

ఈ విభాగంలో రాణించేందుకు విశ్లేషణ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి. ఇందులో ప్రశ్నలు ఒక డేటాను ఇచ్చి.. దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ –కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ అరేంజ్‌మెంట్‌లపై పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. అదే విధంగా వొకాబ్యులరీ పెంచుకునేందుకు ప్రతిరోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని వినియోగించే తీరుపై ప్రాక్టీస్ చేయాలి. బేసిక్ గ్రామర్ అంశాలుగా పేర్కొనే సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్‌–ఇన్‌డైరెక్ట్ స్పీచ్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవాలి.
- బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీలో.. వ్యాపార–వాణిజ్య అంశాలు, తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు–వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు ఒక అంశాన్ని, అందులోని కీలక పదాలను, సారాంశాన్ని గుర్తించే నేర్పు పెంచుకోవాలి.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

మ్యాథమెటికల్ ఎబిలిటీలో ఉండే అర్థమెటిక్, జామెట్రికల్, స్టాటిస్టికల్ ఉప విభాగాలకు సంబంధించి ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాల ప్రిపరేషన్ అవసరం. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాల కోసం ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు.. శాతాలు, లాభ నష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని–కాలం, పని–సమయంపై అవగాహన పెంచుకోవాలి. అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్ వంటి అంశాల్లో నైపుణ్యం కీలకంగా నిలుస్తుంది.

టార్గెట్ 1000లోపు ర్యాంకు

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అందుబాటులో ఉన్న ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు; ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తున్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభించే అవకాశముంది. కాని బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు సొంతం చేసుకోవాలంటే మాత్రం వేయిలోపు ర్యాంకు సాధించాలని నిపుణులు పేర్కొంటున్నారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

ఏపీ ఐసెట్ ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 7
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: 2024 ఏప్రిల్ 28, 29 తేదీల్లో
- ఐసెట్ తేదీలు: 2024 మే 6, 7 తేదీల్లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/ICET/ICET/ICET_HomePage.aspx

టీఎస్ ఐసెట్ ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 30
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: 2024, మే 17–20
- టీఎస్ ఐసెట్ తేదీలు: 2024 జూన్ 5, 6
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://icet.tsche.ac.in/TSICET_HomePage.aspx

క్లుప్తంగా...

ధరణి రికార్డులను సరిచేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ధరణిలో అసైన్డ్‌భూములను పట్టా భూములుగా మార్చి పాసుపుస్తకాలను సైతం జారీ చేసిన అధికారులు.. ఇప్పుడు ధరణి వెబ్‌సైట్‌లో తిరిగి అసైన్డ్‌భూములుగా రికార్డులు సరి చేసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఒక్క కంది మండలంలోనే ఏకంగా 518 ఎకరాల అసైన్డ్ భూములను పట్టా భూములుగా రికార్డులను తారుమారు చేసిన వ్యవహారాన్ని 'సాక్షి'వెలుగులోకి తెచ్చింది. '518 ఎకరాలు.. హాంఫట్'అనే శీర్షికతో సాక్షి మెయిన్ ఎడిషన్‌లో గత శనివారం సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు పట్టాభూములుగా మారిన అసైన్డ్‌భూముల రికార్డులను సరి చేస్తున్నారు. తారుమారు అయిన ఈ అసైన్డ్‌భూములకు సంబంధించి కాస్రా పహాణీలు, చెస్సాల, శేత్వార్ వంటి రికార్డుల ఆధారంగా రికార్డులను సరి చేస్తున్నారు. ప్రభుత్వ భూముల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ధరణిలో పట్టాభూములుగా మారిన అసైన్డ్ భూముల రికార్డులను సరి చేస్తున్నామని కంది తహసీల్దార్ విజయలక్ష్మి వెల్లడించారు.

మందుల పేరిట తప్పుడు ప్రకటనలిస్తే చర్యలు

హెచ్చరించిన డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కిడ్నీలో రాళ్లు తగ్గిస్తామని, షుగర్, బీపీలకు శాశ్వత పరిష్కారం అంటూ పలు రకాల దీర్ఘకాలిక రోగాలు నియంత్రిస్తామంటూ మోసపూరిత ప్రకటనలు జారీ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. డీసీఏ సోదాల్లో ఇలాంటి క్లినిక్‌లు, మందులు విక్రయిస్తున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. మార్చి 30, 31 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా క్లినిక్‌లను గుర్తించేందుకు సోదాలు చేపట్టినట్లు కమలాసన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఓ మెడికల్ దుకాణంలో రినాల్ కల్కులి పేరిట కిడ్నీలో రాళ్లు కరిగించే మందులు అంటూ తప్పుడు ప్రకటనలు ఇస్తున్నట్లు గుర్తించామని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎంసీఈఎంఈ కమాండెంట్‌గా నీరజ్ వర్ష్నీ బాధ్యతలు




సాక్షి, హైదరాబాద్: మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ) సికింద్రాబాద్ కమాండెంట్‌గా లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశిష్ట సేవా పతకగ్రహీత అయిన లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నీ వడోదరాలోని ఈఎంఈ స్కూల్‌కి కమాండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నీరజ్ వర్ష్నీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవలో అత్యుత్తమ సేవలందించాలని, విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఈఎంఈ సిబ్బందిని కోరారు.

దక్షిణ మధ్య రైల్వే రికార్డు

సరుకు రవాణా ఆదాయం 13,438 కోట్లు


సాక్షి, హైదరాబాద్: సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. మార్చితో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 141.117 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.13,438.76 కోట్ల ఆదాయం నమోదు చేసింది. ఇది అంతకుముందు సంవత్సరం కంటే 8.785 మిలియన్ టన్నులు అధికం కాగా, ఆదాయంలోనూ అదనంగా రూ.506 కోట్లు సంపాదించింది. గతిశక్తి కార్గో టెర్మినల్స్, గూడ్స్ షెడ్లను మెరుగుపరచటం లాంటి చర్యల ద్వారా సరుకు రవాణా పెంచగలిగింది. మొత్తం రవాణా చేసిన సరుకులో బొగ్గు 70.52 మిలియన్ టన్నులు(మి.ట), సిమెంటు 36.11మి.ట, ఎరువులు 7.40 మి.ట, ఆహార ధాన్యాలు 7.38 మి.ట. మేర ఉన్నాయి.

'దాసి' సుదర్శన్ కన్నుమూత



మిర్యాలగూడ, నాగార్జునసాగర్: సాహితీవేత్త, ప్రముఖ చిత్రకారుడు దాసి సుదర్శన్ (72) సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేశారు. ఎందరో విద్యార్థులను కళలు, సాహిత్యం వైపు మళ్లించి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. ఆయన జర్నలిస్టుగా పలు పత్రికలకు వ్యాసాలు రాశారు. కొన్ని దినపత్రికల్లో పనిచేశారు. సినీరంగంలో డిజైనర్‌గా పనిచేసి జాతీయ అవార్డు పొందారు. దర్శకుడు బి.నర్సింగరావు తీసిన చాలా సినిమాలకు క్యాస్టూమ్ డిజైనర్‌గా పనిచేశారు. నర్సింగరావు తీసిన దాసి సినిమాకు ఐదు జాతీయ అవార్డులు లభించగా క్యాస్టూమ్ డిజైనర్‌గా సుదర్శన్ జాతీయ అవార్డు అందుకున్నారు. జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీ ప్యానల్ సభ్యుడిగానూ ఆయన పనిచేశారు. సుదర్శన్ అంత్యక్రియలు మంగళవారం మిర్యాలగూడలో జరగనున్నాయి.

3 రోజులు ఎండల మంటలే!



సాధారణంకన్నా 3 డిగ్రీల దాకా అధిక ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సోమవారం తెలంగాణవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.5 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికమవడంతో వాతావరణంలో తేమ శాతం, ఉక్కపోత తీవ్రమైనట్లు అధికారులు వివరించారు. రానున్న మూడు రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ఆదిలాబాద్‌లో 41.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రానికి దక్షిణ దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి.

కాంట్రాక్టర్ల లబ్ధికి వ్యవ'సాయం'

వ్యవసాయశాఖ కార్పొరేషన్లలో అధికారుల తీరు

- వ్యాపారులకు అనుకూలంగా నిర్ణయాలు
- 'విజయ'బ్రాండ్‌ను ఒక ప్రైవేట్ సరుకుల వ్యాపారికి తాకట్టు పెట్టిన ఆయిల్ ఫెడ్
- అనేక టెండర్లు ప్రీయూనిక్ కంపెనీకే వచ్చేలా నిబంధనల రూపకల్పన
- మార్క్‌ఫెడ్ బ్రాండ్‌ను ఉపయోగించుకుంటున్న ప్రైవేట్ బయో ఫెర్టిలైజర్ కంపెనీ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖలోని పలు కార్పొరేషన్ల పనితీరుపై ఆరోపణలు వస్తున్నాయి. కొందరు అధికారులు కాంట్రాక్టర్లు, వ్యాపారులతో కలిసిపోయి కమీషన్లు దండుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్ బోర్డు సమావేశాల్లో ఆమోదం పొందామని చెప్పుకుంటూ, వ్యాపారులు, కాంట్రాక్టర్లకు అనుగుణంగా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో కొన్ని నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. మరికొన్ని నిర్ణయాలు ఆయా కార్పొరేషన్లకు తీవ్రమైన నష్టం మిగుల్చుతున్నాయి. కొందరు అధికారులకు మాత్రం రూ.కోట్లల్లో జేబులు నిండుతున్నాయి.

బ్రాండ్‌ల తాకట్టు...

→ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న 'విజయ'బ్రాండ్‌తో వస్తున్న నూనెలకు మార్కెట్లో మంచి పేరుంది. దీనిని ఒక వ్యాపారి వాడుకునేలా ఒప్పందం చేసుకున్నారు. పప్పులు, బాస్మతీ బియ్యం, డ్రైఫ్రూట్స్, మసాలాలు వంటి అనేక రకాల సరుకులు విజయ బ్రాండ్ పేరుతో అమ్ముకునేందుకు అనుమతి ఇచ్చారు. అలా అమ్ముకున్నందుకు ఆ వ్యాపారి ఆయిల్‌ఫెడ్‌కు కొంత రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు ఆ వ్యాపారికి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్న ఆయిల్‌ఫెడ్ స్థలం కూడా ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఇది మరింత వివాదాస్పదమైంది. పైగా ఆ వ్యాపారి అమ్ముతున్న సరుకులు నాసిరకంగా ఉన్నాయన్న ఫిర్యాదులున్నాయి. అయితే ఆ వ్యాపారి నుంచి కొందరు అధికారులకు కమీషన్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

→ విజయ బ్రాండ్‌తో మినరల్ వాటర్ ప్లాంట్ తీసుకొచ్చారు. రూ.కోట్లు ఖర్చు చేశారు. కానీ దానికి మార్కెటింగ్ కల్పించలేదు. దీంతో ఆయిల్‌ఫెడ్‌కు భారీ నష్టం వాటిల్లుతోంది.

→ మార్క్‌ఫెడ్‌లో బ్రాండ్‌ను తాకట్టు పెట్టారు. బయోఫెర్టిలైజర్ పేరుతో ఉన్న ఒక కంపెనీకి మార్క్ ఫెడ్ బ్రాండ్‌ను ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించారు. అంతేకాదు బహుళజాతి కంపెనీల కంటే ఎక్కువగా స్థానిక కంపెనీ ఫెర్టిలైజర్ అధిక ధరలకు విక్రయించడంపై రైతులు మండిపడుతున్నారు. అంతేకాదు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్లు దీన్ని ప్రోత్సహించాలని కూడా ఆదేశిస్తున్నారు. ఆ స్థానిక కంపెనీ నుంచి కమీషన్ల కోసమే మార్క్‌ఫెడ్ బ్రాండ్‌ను తాకట్టు పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆయిల్‌ఫెడ్‌లో అన్నీ ప్రీ యూనిక్ మయమే...

ఆయిల్‌ఫెడ్‌లో చేపట్టే అనేక రకాల పనులు ప్రీ యూనిక్ కంపెనీకే కట్టబెడుతున్నారని, ఆ కంపెనీకే దక్కేలా టెండర్ల నిబంధనలు ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

- ఇటీవల సిద్దిపేట ఆయిల్‌పాం ఫ్యాక్టరీ టెండర్లలో ఒక కంపెనీ తక్కువకు కోట్ చేస్తే, దానికి ఇవ్వకుండా ప్రీ యూనిక్‌కే అప్పగించడం విమర్శలకు తావిచ్చింది. సిద్దిపేట ఫ్యాక్టరీకి ఈ కంపెనీ దాదాపు రూ. 109 కోట్లకు కోట్ చేసి టెండర్లలో రెండో స్థానంలో నిలవగా, మరో కంపెనీ రూ. 99 కోట్లకే టెండర్ వేసింది. కానీ రూ. 99 కోట్లకు వేసిన కంపెనీకి కాకుండా ఏవో టెక్నికల్ కారణాలు చూపించి ప్రీ యూనిక్‌కే వచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకోవడంపై విమర్శలున్నాయి. దీనిపై వివాదం తలెత్తడంతో కోర్టు వరకు వెళ్లింది. అక్కడ టెక్నికల్ కారణాలు చూపించడంతో చివరకు కోర్టు ప్రీ యూనిక్‌కే టెండర్ ఇవ్వాలని తీర్పు ఇచ్చింది.
- ఒక్కోసారి ప్రీ యూనిక్ కంపెనీ మైనస్‌కు కూడా కోట్ చేసి టెండర్లలో పాల్గొంటుంది. అంటే ఎలాంటి లాభం లేకుండా, పైగా నష్టంతో టెండర్లలో పాల్గొంటుందన్నమాట. నష్టానికి టెండర్ వేయడమేంటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకదాంట్లో నష్టానికి వేసి మరోదాంట్లో ఎక్కువకు టెండర్ దక్కించుకునేలా ఆ కంపెనీ పన్నిన ఉచ్చులో అధికారులు ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- ఇటీవల ఒక టెండర్‌లో ప్రీ యూనిక్‌కు దక్కేలా చేసినందుకు దాదాపు రూ. 5 కోట్లు కొందరు అధికారులకు అందినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కొసమెరుపు

ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌ను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది.ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డిని ఆయిల్‌ఫెడ్ ఎండీగా ప్రభుత్వం నియమించింది. అశోక్‌రెడ్డి ముస్సోరిలో శిక్షణలో ఉన్నందున ఆయన వచ్చే వరకు సురేందర్ ఆ బాధ్యతలు చూస్తున్నారు. అయితే పది రోజులుగా ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులంతా రేయింబవళ్లు, సెలవు రోజుల్లోనూ పనిచేయాలని అక్కడి అధికారులు ఆదేశాలు ఇచ్చారు. గుడ్ ఫ్రైడే, ఆదివారాలు కూడా ఉద్యోగులు వచ్చి పనిచేశారు. కాంట్రాక్టర్లు, వ్యాపారుల బిల్లులన్నీ క్లియర్ చేసుకునేందుకే వారం దరితో పనిచేయించడం విమర్శలకు తావిస్తోంది.

ఉపకార దరఖాస్తుకు ముగిసిన గడువు

2023–24 విద్యా సంవత్సరంలో మొత్తం రిజిస్ట్రేషన్లు 11.72 లక్షలు

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు గడువు ముగిసింది. ఈ రెండు పథకాలకు రాష్ట్రవ్యాప్తంగా 11.72 లక్షల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు ప్రక్రియ ఈసారి సుదీర్ఘంగా సాగింది. గతేడాది ఆగస్టు 20 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ 31తో గడువు ముగుస్తుందని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయి నుంచి స్పందన పెద్దగా లేకపోవడంతో గడువును డిసెంబర్ 31వరకు పొడిగించింది. అయినప్పటికీ పలు కోర్సులకు సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ ముగియకపోవడంతో గడువు పెంపు అనివార్యమైంది. ఈక్రమంలో గడువును ఏకంగా మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు. దీంతో గడువు ముగిసే నాటికి 11.72 లక్షల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించినట్లు అధికారుల ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి.

27 ప్రాజెక్టులకు 'రెరా' నోటీసులు

రూ. 21 కోట్ల అపరాధ రుసుము వసూలు

సాక్షి, హైదరాబాద్: నిబంధనలు ఉల్లంఘించే రియల్ ప్రాజెక్టులపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఒక ప్రకటనలో తెలిపింది. 'రెరా'రిజిస్ట్రేషన్ పొందకుండా స్థిరాస్తి వ్యాపారులు వ్యాపార, మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టడం, ప్రీ లాంచింగ్ పేరుతో అపార్ట్‌మెంట్‌లలోని ఫ్లాట్ల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పలు ప్రాజెక్టులపై ఫిర్యాదులు రావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసి, ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం వరకు అపరాధ రుసుము విధిస్తున్నట్లు అథారిటీ కార్యదర్శి పి.యాదిరెడ్డి తెలిపారు. ప్రీ లాంచింగ్‌తో పాటు రెరా నిబంధనలు ఉల్లంఘించిన 27 ప్రాజెక్టులకు నోటీసులు జారీ చేసి రూ. 21 కోట్ల మేరకు ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు.

కోల్‌కతాకు నీటిపారుదల శాఖ బృందం

- నేడు జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో భేటీ
- త్వరలోనే కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణకు శ్రీకారం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. న్యాయ విచారణ కోసం సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌ను 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. జస్టిస్ పినాకి చంద్రఘోష్‌ను కలిసేందుకు సోమవారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ కోల్‌కతాకు వెళ్లారు. మంగళవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో సమావేశమై న్యాయ విచారణ కోసం ఆదేశిస్తూ జారీ చేసిన ఉత్తర్వులతోపాటు అనుసరించాల్సిన విధివిధానాలను ఆయనకు సమర్పించనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో లోపాలు, అక్రమాలపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించడం తెలిసిందే.

పెబ్బేరు మార్కెట్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.15 కోట్ల విలువైన ధాన్యం, గన్నీ బ్యాగులు దగ్ధం
- 6 గంటలుగా అదుపులోకి రాని మంటలు.. మంత్రి తుమ్మల ఆరా



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా పెబ్బేరులోని మార్కెట్‌యార్డులో ఉన్న వ్యవసాయ గోదాంలో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గోదాం నుంచి పెద్దఎత్తున పొగలు రావడంతో అధికారులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చేటప్పటికే మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. మూడు ఫైరింజన్లతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో దగ్గర్లోనే ఉన్న లిక్కర్ కంపెనీ నుంచి 10 ట్యాంకర్ల నీటిని తెప్పించి.. గోదాం గోడలు బద్దలుగొట్టి మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో 70 వేల ధాన్యం బస్తాలు, 13 లక్షల కొత్త గన్నీ బ్యాగులు ఉన్నాయి. రూ.15 కోట్ల మేర నష్టం వాటిల్లవచ్చని అంచనా. కాగా, ఫైరింజన్లకు సరిపడా నీరు అందుబాటులో లేకపోవడం కూడా మంటల్ని అదుపు చేయడంలో ఆలస్యమవుతోంది. ఘటనాస్థలాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పరిశీలించారు. ప్రమాదంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లాలని జిల్లా వ్యవసాయాధికారులకు సూచించిన ఆయన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

40 వేల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం వృద్ధిరేటు నమోదు
- రాష్ట్ర జీఎస్టీ వసూళ్లలో 19% పెరుగుదల
- రూ. 30 వేల కోట్లకు చేరువలో వ్యాట్ రాబడి.. 2 శాతం వృద్ధి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల మోత మోగింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ. 39,500 కోట్ల జీఎస్టీ రాబడుల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఏకంగా రూ. 40,650 కోట్లు సమకూరాయి. ఇవి 2022–23 ఆర్థిక సంవత్సరంలో వసూలైన రూ. 37,026 కోట్లకన్నా 10 శాతం అధికం. గతేడాది మార్చిలో రూ. 3,336 కోట్లు వసూలవగా ఈ ఏడాది మార్చిలో రూ. 3,715 కోట్లు వసూలయ్యాయి. మొత్తం జీఎస్టీ రూ. 40,650 కోట్లలో రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) కింద 2022–23లో రూ. 16,576 కోట్లు రాగా 2023–24లో 19 శాతం అధికంగా రూ. 20,012 కోట్లు సమకూరాయి. అలాగే ఐజీఎస్టీ (సమీకృత జీఎస్టీ) 2022–23లో కంటే రూ. 488 కోట్లు అదనంగా రూ. 20,638 కోట్లు సమకూరింది. వాణిజ్య పన్నుల కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి టి.కె.శ్రీదేవి బాధ్యతలు చేపట్టిన అనంతరం పన్ను ఎగవేతదారులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టడంతోపాటు శాఖ సిబ్బందిని సమన్వయపరిచి పన్ను వసూళ్లను మరింత మెరుగ్గా రాబట్టడం వల్లే వాణిజ్య పన్నుల రాబడుల్లో వృద్ధి నమోదు కావడం గమనార్హం.

పెట్రో అమ్మకాలపై అంతంతే

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే విలువ ఆధారిత పన్ను (వ్యాట్) రాబడులు కూడా పెరిగాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పెట్రోల్, లిక్కర్‌పై రూ. 29,516 కోట్లు వ్యాట్ కింద వసూలవగా 2023–24లో 2 శాతం వృద్ధితో రూ. 29,985 కోట్లు వసూలయ్యాయి. ఇందులో పెట్రో ఉత్పత్తుల అమ్మకాల ద్వారా రూ. 15,415 కోట్లు వచ్చాయి. అదే గతేడాదిలో పెట్రో ఉత్పత్తుల పన్నుల కింద రూ. 15,342 కోట్లు వచ్చాయి. ఈసారి రూ. 18,500 కోట్ల మేర ఎక్సైజ్ రాబడులను లక్ష్యంగా పెట్టుకోగా అందులో రూ.14,570 కోట్లే వసూలయ్యాయి. అయితే 2022–23తో పోలిస్తే 3 శాతం అధికంగా ఎక్సైజ్ ఆదాయం వచ్చింది. ఇక వృత్తి పన్ను కింద రూ. 743 కోట్లు, వివిధ పన్ను పరిహారాల ద్వారా రూ.625 కోట్లు 2023–24లో ఆదాయం వచ్చింది. మొత్తం కలిపి జీఎస్టీ, వ్యాట్ రాబడుల ద్వారా 2022–23లో రూ.72,421 కోట్లు ఆదాయం వస్తే 2023–24లో రూ.72,157 కోట్లే వచ్చినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అయితే పన్ను పరిహారం కింద 2022–23లో రూ. 5,044 కోట్లు రాగా ఈసారి రూ. 625 కోట్లు మాత్రమే వచ్చాయి. అయినా జీఎస్టీ, వ్యాట్ రాబడుల్లో స్వల్ప తగ్గుదల మాత్రమే నమోదైంది.

చిటారు కొమ్మన మిఠాయి పొట్లం



ఆ చిటారు కొమ్మన ఏం మిఠాయి పొట్లం ఉందో తెలియదు గానీ.. ఈ గజరాజు మాత్రం ఇదిగో ఇలా అంతెత్తున లేచి.. అందుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ చిత్రాన్ని జింబాబ్వేలోని మనాపూల్స్ నేషనల్ పార్కులో లుకాస్ వాల్టర్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. వరల్డ్ నేచర్ ఫొటోగ్రఫీ పోటీల్లో ఈ చిత్రం 'క్షీరదాల ప్రవర్తన' విభాగంలో మూడో స్థానాన్ని గెలుచుకుంది.

నిప్పులు గీసిన చిత్రం



చూడ్డానికి ఏదో మోడ్రన్ ఆర్ట్‌లాగా కనిపిస్తోందా?
ఇది ప్రకృతి గీసిన మోడ్రన్ ఆర్ట్. అగ్ని పర్వతం విస్ఫోటన చిత్రాన్ని ఫ్రాన్స్‌కు చెందిన అర్మండ్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు. ట్రావెల్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీల్లో ఈ చిత్రం జ్యూరీ ప్రశంసలు అందుకుంది.

అడవిలో అరుదైన గద్దలు



చేంజబుల్ హాక్ ఈగల్



లెస్సర్ ఫిష్ ఈగల్



పర్పుల్ హెరాన్




సర్పెంట్ ఈగల్

అంతరించిపోతున్న అరుదైన గద్దలు కవ్వాల్ టైగర్ జోన్‌లోని మంచిర్యాల జిల్లా జన్నారం అడవుల్లో దర్శనమిచ్చాయి. ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ ప్రదీప్ థామస్ ఇటీవల జన్నారం అడవుల్లో పర్యటించి అరుదైన గద్దల ఫొటోలను తీశారు. వాటిని చేంజబుల్ హాక్ ఈగల్, సర్పెంట్ ఈగల్, లెస్సర్ ఫిష్ ఈగల్‌గా పేర్కొన్నారు. అలాగే పర్పుల్ హెరాన్ (ఒక రకమైన కొంగ)ను సైతం తన కెమెరాలో బంధించారు.

- జన్నారం

టుడేస్ గ్రాఫిక్



భక్తుల ఇంటికే 'భద్రాచలం తలంబ్రాలు'

ఆర్టీసీ ఏర్పాట్లు.. రుసుము రూ.151

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు భక్తులకు ఇంటి వద్దే అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. దేవాదాయశాఖతో కలిసి దీనిని చేపట్టబోతోంది. 2022లో 89 వేల మంది, గతేడాది 1.17 లక్షల మంది భక్తులకు తలంబ్రాలను వారి ఇళ్ల వద్దకు తెచ్చి అందించింది. దీంతో ఈసారి మరింత ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు చార్జీ గతేడాది రూ.116 ఉండగా ఈసారి దాన్ని రూ.151కు పెంచింది. అంతమేర చెల్లించి వివరాలు నమోదు చేసుకున్న వారికి కల్యాణ తలంబ్రాలు అందించనున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. సోమవారం బస్‌భవన్‌లో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎండీ సజ్జనార్ ఆవిష్కరించి బుకింగ్‌ను ప్రారంభించారు. తలంబ్రాలు కావాల్సిన వారు 040–23450033, 040–69440000, 040–69440069 నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

ఫణిగిరి బౌద్ధక్షేత్రం.. సీసపు నాణేలు



నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద తాజాగా పురావస్తు శాఖ జరుపుతున్న తవ్వకాల్లో 3, 4వ శతాబ్దాలకు సంబంధించి ఇక్ష్వాకుల కాలం నాటి 3,700 పైగా అరుదైన సీసపు నాణేలు (లెడ్ కాయిన్స్) లభ్యమయ్యాయి. గతంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కూడా పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో వేల సంఖ్యలో నాణేలను గుర్తించారు. మళ్లీ అంత పెద్ద సంఖ్యలో ఇక్ష్వాకుల కాలానికి చెందిన సీసపు నాణేలు వెలుగు చూడటం ఇదే ప్రథమం. ఈ తవ్వకాల్లో బౌద్ధ చైత్యాలకు సంబంధించిన గోడలు లాంటివి సైతం బయటపడుతున్నాయి. ఫణిగిరి బౌద్ధక్షేత్రంపై తవ్వకాలు జరిపేందుకు పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోలికేరీ ఆధ్వర్యంలో ఇటీవల కొలతలు సేకరించి ఏఎస్ఐ అనుమతితో తవ్వకాలు ప్రారంభించారు. ఈ తవ్వకాల్లో ఆదివారం సీసపు నాణేలు భారీగా బయల్పడ్డాయి. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన అధికారులు ఒకట్రెండు రోజుల్లో వివరాలు వెల్లడించనున్నారు. ఐదేళ్ల క్రితం తవ్వకాల్లో సున్నపురాయితో చేసిన 6 అడుగుల బౌద్ధశిల్పం ఇక్కడ లభ్యమైంది. సాధారణంగా బౌద్ధారామాల్లో బంగారు వస్తువులు లభించవు. కానీ గతంలో జరిపిన తవ్వకాల్లో ఇక్కడ ఏడో రోమన్ చక్రవర్తి నెర్వ (క్రీ.శ. 96–98) విడుదలచేసిన 7.3 గ్రాముల బరువుగల బంగారు నాణెం కూడా బయటపడింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.